ప్రజాపక్షం 8th ANNIVERSARY 22nd October, 2026

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 09, సంచిక: 294 | గురువారం | 24-09-2026 | మహబూబ్‌నగర్ Published from: **Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar** పేజీలు: 12+8 | వెల రూ. 5.00




యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో దసరాలోపు పూర్తి స్థాయిలో ఉత్పత్తి

10

'సర్'పై సహ కమిషనర్ల అభ్యంతరాలు

# పట్టించుకోని జ్ఞానేశ్‌కుమార్



- 10 నెలల వ్యవధిలో 14 సార్లు అభ్యంతరం తెలిపిన ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి
- 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సంచలన కథనం
- చర్చల్లో భిన్నాభిప్రాయాలు సహజమేనని సమర్థించుకున్న ఇసి

**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితా 'ప్రత్యేక ముమ్మర సవరణ' (సర్) ప్రక్రియపై భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) సభ్యుల మధ్య ఏకాభిప్రాయం కొరవడింది. నిర్ణయాలను ఏకపక్షంగా తీసుకున్నారు. ఈ మేరకు ఆంగ్ల దినపత్రిక 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' దినపత్రిక పరిశోధనాత్మక సంచలన కథనం ప్రచురించింది. ఇద్దరు కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు పేర్కొంది. తమకు తెలియకుండా లేదా తమ ఆమోదం లేకుండా ఎన్నికల కమిషన్ పేరుతో జారీ చేసిన నిర్ణయాలు, ఉత్తర్వులపై 10 నెలల వ్యవధిలో కనీసం 14 సార్లు ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి, అభ్యంతరాలు నమోదు చేశారని 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' తన కథనంలో పేర్కొంది. ఒకే రోజున నాలుగు అభ్యంతరాలతో సహా ఓటర్ల నమోదు, తొలగింపు, చట్టబద్ధమైన ఫారం 6లో మార్పులు, కమిషన్ ఓటర్ల డేటా బేస్ పనితీరుతో సహా ఓటర్ల జాబితా నిర్వహణలోని కీలక అంశాలకు సంబంధించినవి ఆ ఇద్దరు కమిషనర్ల అభ్యంతరాల్లో ఉన్నాయని తెలిపింది. ఢిల్లీలో ఓటర్ల జాబితా డేటా బేస్ 'క్రమంగా కేంద్రీకరించడం'పై కూడా సంధు, జోషి ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితాలను నిర్వహించడానికి ఉపయోగించే వ్యవస్థకు రాష్ట్ర స్థాయి అధికారులకు సరైన ప్రాప్యతను నిరాకరిస్తున్నారని వారు ఆరోపించినట్లు ఆ నివేదిక పేర్కొంది. ఒక సందర్భంలో, ఓటర్ల జాబితాలను నిర్వహించే ఐటి మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనుల కేటాయింపులో తరువాయి 8లో

## సిఇసి తక్షణమే రాజీనామా చేయాలి

సిపిఐ డిమాండ్



రాజ్యాంగబద్ధమైన ఎన్నికల సంఘం(ఇసి)పై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్న ఓటర్ల జాబితాల ప్రక్షాళనకు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్‌కుమార్ ప్రతీకగా నిలిచారని, ఆయనకు ఆ పదవిలో కొనసాగే హక్కు ఎంతమాత్రం లేదని, ఇసిపై ప్రజల విశ్వాసాన్ని, విశ్వసనీయతను పునరుద్ధరించాలంటే జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాల్సిందేనని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం ఇక్కడ ఒక ప్రకటన తరువాయి 8లో

## జ్ఞానేశ్ కుమార్‌ను అరెస్టు చేయాలి

'సర్'లో ఏకపక్ష నిర్ణయాలపై ప్రతిపక్షాలు ధ్వజం



'సర్' నిర్ణయాలను ఎన్నికల కమిషన్‌లో ఏకపక్షంగా తీసుకున్నారని ఓ అంగ్ల పత్రికలో వచ్చిన కథనంతో ఎన్నికల ప్రధాన కమిషనర్‌పై విపక్షాలు విమర్శలు గుప్పించాయి. దేశంలో ఎన్నికల ప్రక్రియను బలహీనపరిచిన ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశాయి. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా ఎన్నికల కమిషన్‌ను అడ్డుపెట్టుకుని ఓటు చోరీ చేస్తూ ఎన్నికల్లో గెలుస్తున్నారని ఆరోపించాయి. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ఎన్నికల సంఘం తరువాయి 8లో

## సిఇసి, ఇసిల నియామక పిటిషన్లపై సుప్రీంకోర్టులో భిన్నాభిప్రాయాలు



ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సిఇసి), ఎలక్షన్ కమిషనర్(ఇసి)ల ఎంపిక ప్రక్రియపై దాఖలైన పిటిషన్‌ను విస్తృత ధర్మాసనానికి నివేదించడంపై సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. ఈ ప్రక్రియ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సిజెఐ)ని తప్పించి, ఆ స్థానాన్ని ప్రధాన మంత్రి నామినేట్ చేసిన కేంద్ర మంత్రితో భర్తీ చేయాలంటూ 2023లో వెలువడిన చట్టాన్ని సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్‌ను బుధవారం జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీష్‌చంద్ర తరువాయి 8లో

పదిరోజులు వారబందీగా

# జూరాలకు నీరు

కర్ణాటక ముఖ్యమంత్రి హామీ

- ఆయకట్టు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను డి.కె. శివకుమార్‌కు వివరించిన రాష్ట్ర మంత్రులు వాకిటి, జూపల్లి
- నీరు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి, సిఎస్‌ను ఆదేశించిన కర్నాటక సిఎం



ప్రజాపక్షం/హైదరాబాద్

జూరాల ప్రాజెక్టుకు నీటి విడుదలకు కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ సానుకూలంగా స్పందించారని తెలంగాణ మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు తెలిపారు. తెలంగాణ రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని 10 రోజుల పాటు వారబందీ విధానంలో నీటిని విడుదల చేస్తామని కర్ణాటక సిఎం హామీ ఇచ్చారని వెల్లడించారు. జూరాల ప్రాజెక్టు వద్ద నీటి మట్టం తగ్గిపోవడం, ఎల్‌నినో ప్రభావంతో దక్షిణ తెలంగాణలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, జూరాల ఆయకట్టు పరిధిలో సాగునీటి కోసం రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కర్ణాటక సిఎంకు వివరించినట్లు మంత్రులు తెలిపారు. నిన్న సాయంత్రం, ఇవాళ ఉదయం రెండు దఫాలుగా కర్ణాటక డి.కె. శివకుమార్‌తో సమావేశమై తెలంగాణ పరిస్థితిని వివరించినట్లు పేర్కొన్నారు. తెలంగాణ ప్రతినిధుల విజ్ఞప్తిపై స్పందించిన కర్ణాటక సిఎం వెంటనే ఆ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. చలువరాయస్వామి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. షాలిని రాజనీష్‌తో మాట్లాడారని తెలిపారు. తెలంగాణకు సహాయం చేయాలని, సాధ్యమైనంత తరువాయి 8లో

## 'ఎడమ' ఆయకట్టుకు నీటి విడుదల



ప్రజాపక్షం/అమరచింత

జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువ ఆయకట్టుకు బుధవారం ప్రాజెక్టు అధికారులు నీటిని విడుదల చేశారు. దీంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాలతో కల్లుగీత పారిశ్రామిక కార్పొరేషన్ సొసైటీ రాష్ట్ర వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువను సందర్శించి ప్రాజెక్టు అధికారులచే నీటిని విడుదల చేయించారు. ఈ సందర్భంగా నాగరాజ్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని తెలిపారు. ఎడమ కాలువ నుంచి 900 క్యూ సెక్కుల నీరు ఇవ్వడంతో రైతులను పంటలను పండించేందుకు తరువాయి 12లో




బుధవారం ఉదయం సిఎస్ సంజయ్ జాజుతో జరిగిన చర్చల అనంతరం మీడియాతో మాట్లాడిన జెఎసి నేతలు

# దసరాలోపు 2 డిఎలు

- సంక్రాంతి లేదా ఉగాదికి మరో డిఎ
- ఉద్యోగులతో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలం
- అత్యవసర కార్యవర్గ సమావేశాన్ని రద్దు చేసుకున్న ఉద్యోగ సంఘాలు
- సిపిఎస్‌పై కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్

ఉద్యోగులతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన బుధవారం రాత్రి జరిగిన మరో దఫా చర్చలలో స్పష్టమైన హామీ దక్కడంతో ఉద్యోగ సంఘాలు గురువారం తలపెట్టిన అత్యవసర కార్యవర్గ సమావేశాన్ని రద్దు చేసుకున్నారు. దసరాలోపు రెండు డిఎలు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. మరో డిఎను సంక్రాంతి లేదా ఉగాది పండుగ వరకు చెల్లిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చింది. పిఆర్‌సి నివేదికను సాధ్యమైనంత త్వరగా తెప్పించుకుంటామని, సిపిఎస్‌పై కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ప్రకటించారు. పెండింగ్ బకాయిలను ఈ మార్చి వరకు సాధ్యమైనంత వరకు చెల్లిస్తామని ప్రభుత్వం హామీనిచ్చింది. అయితే ప్రస్తుతం చెల్లిస్తున్న రూ. 1000 కోట్లకు అదనంగా మరికొంత కలిపి ఇస్తామని, మొత్తంగా మార్చి వరకు పెండింగ్ బిల్లు లేకుండా చూస్తామని వెల్లడించింది. బుధవారం ఉదయం తరువాయి 12లో

## ఇక 'మీ సేవ' ఇంటి ముంగిటకే




- 1100 టోల్ ఫ్రీ లేదా పోర్టల్ ద్వారా స్లాట్ బుకింగ్
- తొలి దశలో క్యూర్ ప్రాంతాల్లో డోర్ డెలివరీ.. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ


ప్రజాపక్షం/హైదరాబాద్

పౌర సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరానికి చెక్ పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల నుంచి ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఈసీ కాపీలు, పోలీసు శాఖ సేవలు, ఐజిఆర్‌ఎస్ రిజిస్ట్రేషన్ల వరకు పలు 'మీ సేవ' సేవలను ఇక ప్రజల ఇంటి ముంగిటకే అందించేందుకు 'మీ సేవా డోర్ డెలివరీ తరువాయి 12లో

రాష్ట్ర భవిష్యత్తు, ఆర్థిక ప్రగతికి ఇన్‌వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 03

ఇరాన్‌తో చర్చలు

# ఫలవంతం!






- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన
- ఖతార్ మధ్యవర్తిగా మూడు గంటలు అమెరికా- ఇరాన్ చర్చ

**న్యూయార్క్ :** ఇరాన్‌ను నిర్మూలిస్తామంటూ డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న హెచ్చరికలమధ్య ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ కీలక సమావేశాల నేపథ్యంలో అమెరికా–ఇరాన్ మధ్య మూడు గంటలసేపు సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఈ సమావేశం తర్వాత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పాత్రికేయులతో మాట్లాడుతూ,మధ్యవర్తి దేశం ఖతార్ సహాయంతో మూడు గంటలసేపు ఇరు దేశాల ప్రతినిధులమధ్యా ఫలవంతమైన చర్చలు జరిగాయని చెప్పారు. గడచిన జూన్‌లో రెండు దేశాలమధ్యా కాల్పుల విరమణ ఒప్పందం విఫలమైన తర్వాత మళ్ళీ మొదటిసారి జరిగిన ఈ సమావేశాన్ని ఒక సానుకూల పరిణామంగా చూస్తున్నారు. ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చీ–ట్రంప్ ప్రత్యేకదూత స్టీవ్ విట్‌కాఫ్ మధ్య సుదీర్ఘ సమావేశంలో ప్రత్యేక పురోగతి సాధించిన దాఖలాలు కనిపించలేదు. అమెరికా తన దురాక్రమణ చర్యలు ఆపేయాలని ఇరాన్ పునరుద్ఘాటించింది. నిర్మాణాత్మకంగా,ఆశాజనకంగా ఉంటాయని భావించిన ఒక విడత చర్చలు పూర్తయ్యాయని విట్‌కాఫ్ చెప్పారు. ఇరుపక్షాల మధ్యా రోజంతా మధ్యవర్తులు అటూ ఇటూ తిరుగుతూ పరస్పర సందేశాలను చేరవేశారని తరువాయి 8లో




## ఎన్నికల సంఘంపై అనుమానం.. ప్రజాస్వామ్యానికి ప్రమాదం

భారత ప్రజాస్వామ్యానికి ఎన్నికలు ప్రాణాధారం. ఎన్నికలు సక్రమంగా జరిగాయా అనే ప్రశ్నకు సమాధానం చెప్పే సంస్థ ఎన్నికల సంఘం. అందుకే ప్రభుత్వం మీద, అధికార పార్టీ మీద, ప్రతిపక్షాల మీద, అభ్యర్థుల మీద ప్రజలకు అనుమానాలు రావచ్చు. కానీ ఎన్నికల సంఘం మీదే అనుమానం మొదలైతే సమస్య పరిధి 'ఎన్నికల ప్రక్రియ'ను దాటి, రాజ్యాంగ వ్యవస్థ విశ్వసనీయత వరకు వెళుతుంది. ఎన్నికల ఫలితం నచ్చకపోవడం ఒక రాజకీయ సమస్య. ఓటు హక్కును నిర్వహించే సంస్థ నిష్పాక్షికతపై సందేహం కలగడం మాత్రం ప్రజాస్వామ్య సమస్య. ఇటీవల వెలుగులోకి వచ్చిన పరిణామాలు ఈ తేడాను గుర్తించాల్సిన అవసరాన్ని పెంచుతున్నాయి. గత పది నెలల్లో ముగ్గురు సభ్యులతో కూడిన ఎన్నికల సంఘంలోని ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఓటర్ల జాబితాల సవరణ, కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, ఓటర్ల డేట్‌బేస్‌పై నియంత్రణ, ఫామ్6 మార్పులు, పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల తొలగింపులపై దాఖలైన అప్పీళ్లు తదితర అంశాల్లో కనీసం 14 సార్లు అధికారికంగా అభ్యంతరాలు వ్యక్తం చేశారని బుధవారం 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో ప్రచురితమైన ఓ పరిశోధనాత్మక నివేదిక పేర్కొంది. కొన్ని సందర్భాల్లో తమకు సమాచారం లేకుండానే నిర్ణయాలు లేదా ఉత్తర్వులు వెలువడ్డాయని వారు వ్యాఖ్యానించినట్టు ఆ నివేదిక తెలిపింది. ఆ ఇద్దరు కమిషనర్ల అభ్యంతరాల్లో ఉచితానుచితాలు ఎలావున్నా, వారి అభ్యంతరాలపై స్పందన ఏమిటి? ఏ నిర్ణయాన్ని ఎవరు తీసుకున్నారు? ఏ చట్టపరమైన అధికారంతో తీసుకున్నారు? ఆ నిర్ణయంలో మొత్తం కమిషన్‌కు సమాచారం ఉందా? ఉంటే దాని రికార్డు ఎక్కడ ఉంది? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం రావాలి. ఎందుకంటే ఎన్నికల సంఘం ఒక వ్యక్తి కార్యాలయం కాదు. అది రాజ్యాంగబద్ధమైన బహుసభ్య సంస్థ. ప్రత్యేకించి ఓటర్ల జాబితా విషయంలో ఈ ప్రశ్నలకు మరింత ప్రాధాన్యం ఉంది. 'సర్' కింద దేశవ్యాప్తంగా కోట్లాది పేర్లు డ్రాఫ్ట్ జాబితాల నుంచి మాయమయ్యాయి. తాజా నివేదిక ప్రకారం 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 13 కోట్లకు పైగా పేర్లు డ్రాఫ్ట్ రోల్స్‌లో కనిపించడం లేదు. అభ్యంతరం, విచారణ, అప్పీల్ వంటి ప్రక్రియలు ఉంటాయి కాబట్టి, డ్రాఫ్ట్ జాబితా నుంచి పేరు తొలగించడమంటే ఓటు హక్కు కోల్పోవడమేనని చెప్పలేం. కానీ ఒక పౌరుడి పేరు ఓటర్ల జాబితా నుంచి తొలగించిన క్షణం నుంచి అతని ఓటు హక్కును తిరిగి నిరూపించుకోవాల్సిన భారం మొదలవుతుంది. అందుకే ఇటువంటి ప్రక్రియలో పారదర్శకత అత్యంత కీలకం. పశ్చిమ బెంగాల్ పరిస్థితి ఈ ఆందోళనకు స్పష్టమైన ఉదాహరణ. ఎన్నికల సంఘం సుప్రీంకోర్టుకు సమర్పించిన వివరాల ప్రకారం 'సర్' సందర్భంగా 27.16 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించారు. వారిలో 22.21 లక్షల మంది తిరిగి తమ పేర్లు చేర్చాలని అప్పీల్ చేశారు. మరో 16.10 లక్షల అప్పీళ్లు ఇప్పటికే చేర్చిన పేర్లను తొలగించాలని కోరుతూ దాఖలయ్యాయి. మొత్తం అప్పీళ్ల సంఖ్య 38.31 లక్షలకు చేరింది. ఇంత భారీ సంఖ్యలో పౌరులు తమ ఓటు హక్కును తిరిగి నిర్ధారించుకోవాల్సిన దుస్థితి ఏర్పడినప్పుడు, ప్రతి చర్య వెనుక స్పష్టమైన అధికారం, కారణం, రికార్డు ఉండాలి. మరీ ముఖ్యంగా, ఒక న్యాయాధికారి ఓటరును జాబితాలో చేర్చిన తర్వాత ఆ నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఎన్నికల సంఘం తరపున ఎవరు అప్పీల్ చేశారు? వారికి ఆ అధికారం ఎవరు ఇచ్చారు? ఆ ప్రక్రియ గురించి కమిషన్‌లోని ఇతర సభ్యులకు సమాచారం ఉందా? అనే ప్రశ్నలు లేవనెత్తినట్లు వచ్చిన వార్తలను సాధారణ 'పరిపాలనా సూచనలు'గా కొట్టిపారేయడం తగదు. అదే విధంగా కొత్త ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే 'ఫామ్ 6'లో చేసిన మార్పులపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తల్లిదండ్రులు లేదా తాతముత్తాతల పేర్లు గత 'సర్' ఓటర్ల జాబితాలో ఉన్నాయా అనే అంశాన్ని కొత్త దరఖాస్తుదారుడితో సంబంధం పెట్టే రీతిలో ప్రశ్నగా నివేదికలు చెబు తున్నాయి. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఈ మార్పుకు చట్టపరమైన ఆధారం లేదని అభ్యంతరం వ్యక్తం చేశారని సమాచారం. ఇది ఒక సాంకేతిక అంశంలా కనిపించవచ్చు. కానీ ఓటర్ల జాబితాలో సాంకేతికతే హక్కును నిర్ణయించే స్థాయికి చేరితే అది సాంకేతిక సమస్యగా మిగలదు. ఎన్నికల సంఘం స్వయంగా దశాబ్దాలుగా ఓటర్ల జాబితా నిర్వహణలో వికేంద్రీకరణ ఒక రక్షణ వ్యవస్థగా ఉందని చెప్పుకొచ్చింది. ఇప్పుడు రాష్ట్రస్థాయి చట్టబద్ధ అధికారుల డేటాబేస్ ప్రాప్యతను కేంద్రీకరించడం, డిజిటల్ వ్యవస్థలో స్థానిక అధికారుల నిర్ణయాలను నమోదు చేయలేని పరిస్థితి ఏర్పడటం వంటి అంశాలపై అంతర్గతంగా అభ్యంతరాలు వచ్చాయని నివేదికలు చెబుతున్నాయి. ఎన్నికల సంఘం మాత్రం అంతర్గత నోట్లను, అభిప్రాయ భేదాలను సాధారణ పరిపాలనా ప్రక్రియలో భాగంగా అభివర్ణించింది. తుది నిర్ణయాలు మొత్తం కమిషన్ ఆమోదంతో ఏకగ్రీవంగా తీసుకున్నామని కూడా స్పష్టం చేసింది. ఈ వివరణను పరిగణనలోకి తీసుకోవాలి. అయితే అదే సమయంలో అధికారికంగా నమోదైన అభ్యంతరాలు, వాటిపై తీసుకున్న నిర్ణయాలు, వాటిని అధిగమించి ఉత్తర్వులు జారీ అయితే దానికి ఉన్న చట్టపరమైన ఆధారం వంటి వివరాలు ప్రజలకు అందుబాటులోకి రావడం కూడా అవసరం. ఒక సంస్థ తన నిష్పాక్షికతను కేవలం ప్రకటనతో కాకుండా రికార్డులతో నిరూపించాలి. ఇప్పుడు రాజకీయ నిందారోపణ కాదు.. సంస్థాగత ఆత్మపరిశీలన అవసరం. మొదటగా, కమిషన్‌లోని ప్రతి ముఖ్య నిర్ణయానికి పూర్తి డిజిటల్ ఆడిట్ ట్రెయిల్ ఉండాలి. ఎవరు ప్రతిపాదించారు? ఎవరు అభ్యంతరం చెప్పారు? ఎవరు ఆమోదించారు? ఏ చట్టాన్ని ఆధారంగా తీసుకున్నారు? తుది నిర్ణయం ఎలా వచ్చింది? అన్న వివరాలు భద్రంగా నమోదు కావాలి. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు మాత్రమే కాకుండా, అవసరమైన కాలపరిమితి వరకు ఆ రికార్డులను స్వతంత్ర ఆడిట్‌కు అందుబాటులో ఉంచాలి. అంతేకాదు, ఓటర్ల డేటాబేస్‌పై ఒకే స్థాయి లేదా ఒకే కార్యాలయానికి అధిక నియంత్రణ ఉండకూడదు. ఓటర్ల పేర్ల తొలగింపులో 'ముందుగా తొలగింపు, తర్వాత వివరణ' అనే విధానం ఉండకూడదు. ముగ్గురు సభ్యుల కమిషన్‌లో విభేదాలు వచ్చినప్పుడు వాటిని దాచి పెట్టడం కంటే వ్యవస్థీకృతంగా నమోదు చేయడం అవసరం. అదే విధంగా, ఎన్నికల సంఘం నియామక వ్యవస్థపై కూడా విస్తృతమైన సంస్థాగత చర్చ అవసరం. ఎన్నికల సంఘాన్ని రక్షించడం అంటే దాని ప్రతి నిర్ణయాన్ని సమర్థించడం కాదు. కానీ, ప్రతి నిర్ణయం వెనుక హేతుబద్ధత ఉండాలి. స్వతంత్ర ఎన్నికల సంఘానికి బలమైన న్యాయపరమైన పర్యవేక్షణ, పార్లమెంటరీ జవాబుదారీతనం, స్వతంత్ర సాంకేతిక ఆడిట్, పారదర్శక రికార్డులు, పౌరులకు సమర్థవంతమైన అప్పీల్ వ్యవస్థ వంటివి అవసరం. ప్రజాస్వామ్యంలో ఓటు ఒక కాగితంపై గుర్తు కాదు. అది పౌరుడు తన ప్రభుత్వాన్ని నిర్ణయించుకునే రాజ్యాంగ హక్కు. ఆ హక్కును నిర్వహించే సంస్థపై ప్రజలకు విశ్వాసం ఉండాలి. ఆ విశ్వాసం పారదర్శకతతో వస్తుంది. తప్పును సరిదిద్దే ధైర్యంతో వస్తుంది. ఎన్నికల కమిషన్ పేరుతో వివరణ సంతృప్తికరమైన సమాధానం కాజాలదు. అందునా ఎన్నికల కమిషన్ నిజాయితీ శంకించబడుతున్న ప్రస్తుత వాతావరణంలో, విశ్వాసం కలిగించదు. అందువల్ల ప్రభుత్వం ఆ ప్రతికా కథనంపై స్వతంత్ర దర్యాప్తు జరిపించి, నిజానిజాలు ప్రజల ముందుంచాలి. లేకపోతే, కమిషన్ పక్షపాత వ్యవహార శైలిపై అనుమానాలు మరింత బలపడతాయి. అది ప్రజాస్వామ్యానికి మరింత హాని చేస్తుంది. ●



### జ్ఞానేశ్ కుమార్‌ను జైల్లో పెట్టాలి

**పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికలను బిజెపి, ఎన్నికల సంఘం చోరీ చేశాయని (ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సంచలన కథనం నేపథ్యంలో) ఇప్పుడు రుజువైంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే అరెస్టు చేసి జైలులో పెట్టాలి. కొనసాగినంత కాలం సిఇసి పదవికి ఆయన తగిన వ్యక్తి కాదు. ఎస్ఐఆర్‌కు ముందు ఓటర్ల జాబితాతో పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికలను తాజాగా నిర్వహించాలి.**

– పశ్చిమ బెంగాల్ మాజీ సిఎం మమతా బెనర్జీ



ఈలిఫ్ ఎరాల్ఫ్

## బెర్లిన్ ప్రతినిధుల సభ ఎన్నికల విశేషాలు

జర్మనీ రాజధాని బెర్లిన్ 'ప్రతినిధుల సభ'కు సెప్టెంబర్ 20న జరిగిన ఎన్నికల్లో అరుణపతాకం రెపరెప లాడింది. వామపక్ష డీ లింకే (ది లెఫ్ట్) అతి పెద్ద పార్టీగా అవతరించింది.

'ది లెఫ్ట్' పార్టీ 25.7 శాతం ఓట్లతో ప్రథమ స్థానంలో నిలిచింది. అధికార క్రిస్టియన్ డెమోక్రటిక్ యూనియన్ (సి.డి.యు.) పార్టీ 18.8 శాతం ఓట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఫాసిస్టు భావజాలం కలిగిన ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ (ఎ.ఎఫ్.డి.) పార్టీ 16.3 శాతం ఓట్లతో మూడో స్థానంతో సరిపెట్టుకుంది.గ్రీన్స్ పార్టీ 14.3శాతం, సోషల్ డెమోక్రటిక్ పార్టీ(ఎస్.పి.డి.)12.1 శాతం ఓట్లు సాధించాయి.

1990లో తూర్పు, పశ్చిమ జర్మనీల విలీనం తర్వాత దేశ రాజధాని బెర్లిన్ నగరంలో వామపక్ష పార్టీ ఆధిక్యత కనబరచడం ఇదే మొదటి సారి.

జర్మనీ ఎన్నికలు మిశ్రమ ఎన్నికల పద్ధతిలో జరుగు తాయి. ప్రతి ఓటరుకు రెండు ఓట్లు ఉంటాయి. ఒక ఓటు తమ నియోజకవర్గ అభ్యర్థికి వేయాల్సి ఉంటుంది. రెండో ఓటు తమకు నచ్చిన రాజకీయ పార్టీకి వేయాల్సి ఉంటుంది. బెర్లిన్ ప్రతినిధుల సభలో మొత్తం 158 స్థానాలు ఉన్నాయి. అందు లో 78 స్థానాలు నియోజక వర్గ ప్రతినిధుల కోసం, 80 స్థానాలు పార్టీ జాబితాల నుండి గెలుపొందిన అభ్యర్థుల కోసం కేటాయించారు. ఒక్కొక్క నియోజకవర్గం నుండి పోటీపడిన అభ్యర్థులలో అత్యధిక ఓట్లు వచ్చిన అభ్యర్థి నియోజకవర్గ అభ్యర్థిగా గెలుపొంది ప్రతినిధుల సభ సభ్యుడు అవుతారు. మిగిలిన 80 స్థానాలను పార్టీలకు వచ్చిన ఓట్ల శాతాన్ని బట్టి దామాషా పద్ధతిలో పంపిణీ చేస్తారు. పార్టీలు ముందస్తుగా ప్రకటించిన అభ్యర్థుల జాబితా నుండి పార్టీకి వచ్చిన ఓట్ల శాతాన్ని బట్టి స్థానాల సంఖ్యకు సరిపడా అభ్యర్థులు ప్రతినిధులుగా నియమితులు అవుతారు.

రెండు పద్ధతుల్లో ఎన్నికైన మొత్తం 158 సభ్యులలో మెజారిటీ సాధించిన పార్టీ పాలనా బాధ్యతలు చేపడుతుంది

తాజా సమాచారం ప్రకారం ది లెఫ్ట్ పార్టీకి నియోజకవర్గాల నుండి 28మంది ప్రతినిధులు గెలుపొందగా, పార్టీ జాబితా నుండి 19 మంది సభ్యులకు అవకాశం లభించింది. దాంతో మొత్తం ప్రతినిధుల సంఖ్య 47కు చేరింది.

జర్మనీలోనూ, మొన్నటివరకూ బెర్లిన్‌లోనూ అధికార పార్టీగా ఉన్న క్రిస్టియన్ డెమోక్రటిక్ యూనియన్ 34 స్థానాలతో రెండో స్థానంతో సరిపెట్టుకున్నది. అతివాద జాతీయవాదుల పార్టీ ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ 29 స్థానాలతో మూడో స్థానానికి చేరింది. గ్రీన్ పార్టీకి 26 స్థానాలు దక్కగా జర్మనీలో చిరకాలం అధికారం చెలాయించిన పురాతన పార్టీల్లో ఒకటైన సోషల్ డెమోక్రటిక్ పార్టీ 22 స్థానాలతో చివరి స్థానంలో నిలిచింది. మరికొన్ని పార్టీలు పోటీలో ఉన్నప్పటికీ ఆయా పార్టీలకు ప్రతినిధులు ఎన్నిక కాకపోగా, ప్రాతినిధ్యం లభించే స్థాయిలో ఓట్లు పడలేదు.

గతంలో 12.2 శాతం ఓట్లతో 22 స్థానాలు గెలుపొందిన ది లెఫ్ట్ పార్టీ ఈ ఎన్నికల్లో 25.7 శాతం ఓట్లతో 47 స్థానాలు గెలిచింది. అయితే స్వతంత్రంగా ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన సంఖ్యాబలం లేకపోవడంతో గ్రీన్స్ తో గానీ, సోషల్ డెమోక్రటిక్ పార్టీతో గానీ పొత్తు పెట్టుకోవచ్చునని భావిస్తున్నారు.

ది లెఫ్ట్ పార్టీ ఉపాధ్యక్షురాలిగా, బెర్లిన్ ప్రతినిధుల సభలో పార్టీ బృందానికి ఉప నాయకురాలిగాఈలిఫ్ ఎరాల్ఫ్ (46) సేవలు అందిస్తూ వచ్చారు. గత పదేళ్ళుగా సామాజికన్యాయం, ప్రజల జీవన ప్రమాణాల పెంపుదల, మానవహక్కులు, శరణార్థుల సమస్యల పరిష్కారం కోసం ఆమె పోరాడుతున్నారు. జర్మనీలో ఇటీవల పొడచూపుతున్న జాతి విద్వేష భావాలకు వ్యతిరేకంగా ఆమె గట్టిగా గళం విప్పి ఉద్యమిస్తున్నారు. టర్కీ మూలాలు కలిగిన కుటుంబంలో ఆమె 1980లో మ్యూనిక్‌లో జన్మించారు. న్యాయశాస్త్రం అభ్యసించిన ఈలిఫ్ ఎరాల్ఫ్ సంకీర్ణం ద్వారా బెర్లిన్ పాలనా పగ్గాలు చేపట్టవచ్చుని పరిశీలకులు భావిస్తున్నారు.

అతివాద జాతీయ వాదానికి విరుగుడుగానే బెర్లిన్ పౌరులు వామపక్షం వైపు మొగ్గు చూపించారని అల్ జజీరా చేసిన వ్యాఖ్య గమనించదగినది.

# ప్రజాధనం పట్ల ఇంతటి నిర్లక్ష్యమా! ఏదీ శిక్ష?



మేరుగు రాజయ్య
9441440791

16వ,లోకసభ ఎన్నికలు 2014 ఏప్రిల్ 7 నుండి 12 వరకు జరిగాయి. మే 16న వెలువడిన ఫలితాలలో బీజేపీ 282 స్థానాలలో గెలుపొందింది.

ఎన్డీఏ(జాతీయ ప్రజాస్వామ్య కూటమి)తో కలిసి 336 మంది ఎంపిల నాయకుడిగా నరేంద్ర మోదీ ప్రధాన మంత్రిగా ప్రభుత్వం అధికారం లోకి వచ్చింది. ఈ లోక సభ ఎన్నికల మేనిఫెస్టోలో బిజెపి 125 వాగ్దానాలు ప్రకటించింది. అందులో 10వ, హామీలో విదేశాలలో జమ చేసిన నల్లధనాన్ని గుర్తించి, 100 రోజుల్లోగా 80 లక్షల కోట్ల నల్ల ధనాన్ని వెనక్కి రప్పించి ప్రతి భారతీయుడి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని హామీ ఇచ్చారు. నరేంద్ర మోదీ కూడా ఎన్నికల ప్రచారంలో ప్రజలకు హామీ ఇచ్చారు. ఇప్పటికీ గత 12 ఏండ్లు గా బిజెపినే అధికారంలో ఉంటున్నప్పటికీ విదేశాలలో దాయబడిన దేశీయ నల్లధనం వెనక్కి రాలేదు. పైగా దేశీయ బ్యాంకుల నుండి అప్పుగా తీసుకున్న కార్పోరేట్ కంపెనీల అధినేతలు కొందరు విదేశాలకు పారిపోయారు. బ్యాంకుల నుండి వేల కోట్ల రూపాయలు అప్పుగా తీసుకుని తిరిగి చెల్లించకుండా మొండికేసిన కంపెనీలు మరియు వ్యక్తుల వివాదాల పరిష్కారంకై 'నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్' (ఎన్సీఎల్టీ)ను ఏర్పాటు చేశారు. కార్పోరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ద్వారా కంపెనీల చట్టం 2013లోని సెక్షన్ 408 కింద ఎన్సీఎల్టీ 2016 మరియు 'ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రాప్టీ కోడ్(ఐబిసి)2016 తెచ్చారు. ఇవి కంపెనీల వివాదాలు, ఆర్థిక దివాళా ప్రక్రియలను పరిష్కారం చేస్తాయి. తద్వారా బ్యాంకులలో రుణ లభ్యతకు, రుణదాతలైన బ్యాంకులకు ఊతం ఇవ్వాలి. బ్యాంకులలో ఎన్పీఏ(నాన్ పెర్ఫార్మింగ్ అసెట్స్ /నిరర్ధక ఆస్తులు)ల తగ్గింపుకు, రుణ దాతల, వాటా దారుల హక్కులను సమతుల్యం చేసి మోసాలను, దుర్వినియోగాలను నివారించడానికి తోడ్పడాలి. కాని ఇటీవల మీడియాలో వైరల్ అయిన 'జీ గ్రూప్ అధినేత డాక్టర్ సుభాష్ చంద్ర' ఎన్సీఎల్టీ దివాళా కేసు చర్చనీయాంశం అయింది. ఇతను 2016 నుండి 2022 వరకు రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. బిజెపి మద్దతుతో హర్యానా రాష్ట్రం నుండి ఎన్నికయ్యారు. రుణ దాతలు చెప్పినట్లుగా వెలువడిన సమాచారం ప్రకారం 2017లో సుభాష్ చంద్ర నికర ఆస్తి సుమారు రూ.45,888 కోట్లు, 2018లో రూ.40,562కోట్లు చూపించగా ప్రస్తుతం రూ.31.79 కోట్లు మాత్రమే చూపించడంపై పలు అనుమానాలు వ్యక్తమైనవి. వ్యక్తిగత దివాళా కేసులో ఆయన అంగీకరించిన రూ.22,006 కోట్ల క్లెయిమ్స్‌కు బదులు కేవలం రూ.6.25 కోట్లు చెల్లించి పరిష్కరించుకోవడానికి వీలుగా 'జాతీయ కంపెనీల లా ట్రిబ్యునల్' (ఎన్సీఎల్టీ) రుణ చెల్లింపు ప్రణాళిక చెప్పింది. దానిపై రుణదాతలైన ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్, ఐడిబిఐ, హెచ్డిఎఫ్సీ, యాక్సిస్ బ్యాంక్, కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సుభాష్ చంద్ర ఆస్తులను మరింత లోతుగా పరిశీలించాలని కోరుచున్నవి. బ్యాంకులపై దాదాపుగా ప్రజలందరికీ విశ్వాసం ఉంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించిన 'ఇండియా ఇన్ క్లూజివ్ ఫైనాన్స్ రిపోర్ట్ 2025' లో 91 శాతం భారతీయులకు బ్యాంకు ఖాతాలు ఉన్నాయని పేర్కొంది. కాని 69 శాతం ఖాతాదారులు మాత్రమే లావాదేవీలు జరుపుచున్నారని తెలిపింది. ప్రపం చ బ్యాంకు కూడా గ్లోబల్ ఇండెక్స్ 2025లో భారత దేశం లో బ్యాంకు ఖాతాల యాజమాన్యం 89 శాతానికి చేరుకుందని హైలెట్ చేసింది. నిజంగా బ్యాంకులు ప్రజలకు చేస్తున్నదేమిటి? ప్రజలు పొదుపు(దాచుకున్న)చేసిన డబ్బులను తిరిగి రుణాల (అప్పులు)పేర వడ్డీలకు ఇస్తున్నాయి. పొదుపు చేసిన ప్రజలకు 2.50 శాతం నుండి 8.50 వడ్డీ చెల్లిస్తున్నాయి. అప్పులు తీసుకున్న వారి నుండి 9.98 శాతం నుండి 24 వరకు, 10.60 శాతం నుండి 16.50 వరకు, ఫ్యాక్టరీ లోన్స్ పై 9 శాతం నుండి 27 వరకు ఇంకా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు 9 శాతం నుండి 30 శాతం వరకు వడ్డీలను వసూలు చేస్తున్నవి. ఇంకా ఖాతాదారుల (ప్రజలు)నుండి ఖాతా నిర్వహణ ఖర్చులను, ఎటిఎం(ఆటో మెటిక్ టెల్లర్) పరిమితికి మించి డబ్బు ల ఉపసంహరణ ఛార్జీలు, చెక్ లావా దేవీల, చెక్ బుక్ ఛార్జీ లు, లోన్స్ ప్రాసెస్, ఎన్ఇఎఫ్టి(నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్ ట్రాన్స్‌ఫర్), ఆర్టీజిఎస్ (రియల్ టైమ్ గ్రాస్ సెటిల్ మెంట్)నగదు బదిలీల ఛార్జీలు, ఎస్ఎంఎస్(షార్ట్ మెసేజ్ సర్వీస్) ఫోన్ మెసేజ్ సమాచారం, డిమాండ్ డ్రాఫ్ట్, లాకర్ రెంట్, ఓవర్ డ్రాఫ్ట్, ముందస్తు ఖాతా ముగింపు ఛార్జీలు, హౌసిం గ్, వెహికిల్, గోల్డ్ లోన్స్ పై వడ్డీలు, బంగారు ఆభరణాల మూల్యాంకన ఛార్జీలు మొదలగు సేవలకు రుసుములు వసూలు చేస్తూ బ్యాంకులు లాభాలను సాధించుచున్నవి. అయినప్పటికీ ప్రజల దైనందిన జీవితంలో బ్యాంకులు భాగమైనవి.సమాజంలో మానవ సంబంధాల కంటే ఆర్థిక సంబంధాలు పరిఢవిల్లుతున్నట్లుగానే బ్యాంకులతో కూడా ఆర్థిక సంబంధాలు కొనసాగుతున్నవి.

ప్రభుత్వ రంగ బ్యాంకులు దాదాపు 12 ఉన్నవి.దేశ వ్యాప్తంగా 60,646 శాఖ బ్యాంకులున్నవి. 1969 జూలై 19న బ్యాంకుల జాతీయకరణ నుండి లాభాలను సాధించు చున్నవి. గడిచిన 2025 –2026 ఆర్థిక సంవత్సరంలో 3.21లక్షల కోట్లు నిర్వహణ లాభాలు కాగా, నికర లాభాలు రూ.1.98(యుఎస్ $ 22.59 బిలియన్లు)లక్షల కోట్లు సాధించినవి. మొత్తం డిపాజిట్లు 156.3 లక్షల కోట్ల వరకు చేరుకున్నవి. ప్రజల పొదుపు, డిపాజిట్లు, రకరకాల లోన్స్ పై వడ్డీలు,సేవలపై చార్జీలతో సాధించిన లాభాలను (మదుపు/ఇన్వెస్ట్)మరింత సంపదను సృష్టించడానికి వెచ్చించి ఉంటే బాగుండేది.అందులో ప్రాధాన్యత రంగాలైన వ్యవసాయం, చేతి వృత్తులు, చిన్న మధ్యతరహా పరిశ్రమలకు సరళంగా రుణ సౌకర్యం కల్పించినట్లయితే ఉపాధి అవకాశాలతో పాటుగా అభివృద్ధి సాధ్య పడేది. కాని కార్పోరేట్ శక్తులు, బ్యూరోక్రసీ(ప్రభుత్వ యంత్రాంగం) రాజకీయ శక్తులు తయారు చేసిన చట్టాలు,విధానాల వలన బ్యాంకు ల డబ్బులు "కాకులను కొట్టి గద్దలకు మేపిన చందంగా ఉంది. 2018 మార్చి 14 న విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి ఎం.జె అక్బర్ బ్యాంక్స్ లోన్స్ తీసుకున్న వ్యాపార వేత్తలు 31 మంది విదేశాలకు పరారీ అయినారని లోక సభలో చెప్పారు. 2018 జూలై 25 న విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జనరల్ (రిటైర్డ్) విజయ్ కుమార్ సింగ్ విదేశాలలో పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుల పేర్లను లోక్‌సభలో చెప్పారు. 2019 జనవరి 4న ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా లోక సభలో 27 మంది దేశం విడచి పారిపోయిన రుణ ఎగవేత దారుల పేర్లను చెప్పాడు. 2020 ఫిబ్రవరి 5 న ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా లోక సభలో విదేశాలలో పరారీలో ఉన్న 72 మందిని భారత్ కు తీసుక రావడానికి ప్రయత్నాలు జరుగుచున్నావని చెప్పాడు. విదేశాలలో పరారీలో ఉన్న వారి రుణాల మొత్తంపై మరియు ఎంత మంది ఉన్నారన్న విషయాలపై స్పష్టత లేదు. కేవలం 12 మంది పరారీలో ఉన్నవారి రుణాలు మాత్రం రూ.35,587.19 కోట్లుగా వెల్లడైనవి. గత 8 ఏండ్లుగా లుక్ అవుట్ సర్క్యులర్ (ఎల్ఓసి), రెడ్ కార్నర్ నోటీస్ (ఆర్సిఎన్) సిబిఐ (సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్),ఇడి(ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్) ద్వారా పరారీలో ఉన్న రుణ ఎగవేత దారులను స్వదేశానికి తీసుకు రావడానికి ప్రయత్నాలు జరుగుచున్నావని చెప్పుచూనే ఉన్నారు.

బ్యాంకుల నుండి తీసుకున్న వేల కోట్ల రుణాలను చట్టబద్ధంగా ఎగనామం పెట్టడం ఏలా సాధ్యమవుతుందని ప్రజలకు అంతు చిక్కని ప్రశ్నగా మిగిలింది.సామాన్యంగా తాకట్టు, పూచీకత్తు లేకుండా బ్యాంకులు రుణాలు ఇయ్యవు.తాకట్టు పెట్టిన బంగారం మార్కెట్ విలువలో 70 నుండి 85 శాతం వరకు గోల్డ్ లోన్ ఇస్తారు.ఇల్లు లేదా ఆస్తిని తాకట్టు పెట్టుకుని మార్కెట్ విలువలో 50 నుండి 70 శాతం వరకు పర్సనల్ లోన్ ఇస్తారు.అలాగే ఉద్యోగి లోన్ తీసుకోవడానికి సదరు ఉద్యోగి మరియు పూచీకత్తు పడే ఉద్యోగి కూడా తన వేతనాన్ని తమ బ్యాంకు ద్వారా తీసుకునే వారికి మాత్రమే లోన్ ఇస్తారు .రైతులకు కూడా పట్టాదారు పాసు బుక్కులు తాకట్టు పెట్టుకుని అప్పులు ఇస్తారు. కాని కార్పోరేట్ కంపెనీలకు,బడా పారిశ్రామిక వేత్తలకు ఏమి తాకట్టు,జమానాతు పెట్టుకోకుండా వేల కోట్ల రుణాలను ఏలా ఇస్తున్నారు.ఇచ్చిన రుణాలను మొండి బకాయిల పేర, నిరర్ధక ఆస్తుల పేర 'నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్ రప్ట్సీ కోడ్ 2016 మార్గదర్శకంగా ఎట్లా మాఫీ చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

2024 ఆగస్ట్ 8న ఆమ్ ఆద్మీ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ ఆర్థిక బిల్లుపై పార్లమెంటులో ప్రసంగించాడు. బీజేపీ ప్రభుత్వం తెచ్చిన 'హెయిర్ కట్ పథకాన్ని' బట్టబయలు చేశాడు. కేవలం 43 కంపెనీలు తీసుకున్న బ్యాంకు రుణాలు రూ.5,44,434 కోట్లు చెల్లించవలసి ఉండగా రూ.1,90,779 మాత్రమే చెల్లింపచేసి రూ.3,53,655 కోట్లను మాఫీ చేసిందని తెలిపాడు. అందులో కొన్ని కంపెనీల పేర్లను కూడా పేర్కొన్నాడు. **(బాక్స్–1 లో)**

**బాక్స్–1**

| వ.నెం. | పరిశ్రమ | రుణం | చెల్లింపు | మాఫీ |
|---|---|---|---|---|
| | | (సంఖ్యలు రూ.కోట్లలో) | | |
| 1. | అలోక్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ | 29,524 | 5,052 | 24,472 |
| 2. | ఎమ్‌టెక్ ఆటో లిమిటెడ్ | 12,641 | 2,615 | 10,026 |
| 3. | భూషణ్ పవర్ అండ్ స్టీల్ లిమిటెడ్ | 47,158 | 19,350 | 27,808 |
| 4. | భూషణ్ స్టీల్ లిమిటెడ్ | 56,022 | 35,571 | 20,451 |
| 5. | దీవా హౌసింగ్ ఫైనాన్స్ కార్పోరేట్ లిమిటెడ్ | 87,083 | 37,161 | 49,922 |
| 6. | లాంకో థర్మల్ పవర్ లిమిటెడ్ | 33331 | 136 | 33,195 |
| 7. | రిలయన్స్ ఇన్ ఫ్రాటెల్ లిమిటెడ్ | 41,055 | 4,236 | 36,819 |

ప్రభుత్వ వర్గాల నుండి తీసుకున్న ఈ సమాచారాన్ని ధృవీకరించడానికి కూడా సిద్ధంగా ఉన్నానని ఎంపీ సంజయ్ సింగ్ పార్లమెంటుకు చెప్పాడు. విద్య, ఆరోగ్య, రైతులకు రుణ మాఫీ, ప్రజల ద్రవ్యోల్బణం తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరినప్పుడు డబ్బు లేదని అంటుందని, కాని పెట్టుబడిదారులకు రుణ మాఫీ చేయడానికి మాత్రం డబ్బు ఉంటుందని ఎద్దేవా కూడా చేశాడు. కాంగ్రెస్ హయాంలో రూ.70,000 కోట్ల రుణాలను మాఫీ చేయగా బిజెపి కేవలం 43 కంపెనీలకే రూ.3,53,655 కోట్లు మాఫీ చేశారని ఆందోళన తెలిపారు. పూణేకు చెందిన 'సజగ్ నాగరిక్ మంచ్'అధ్యక్షుడు వివేక్ వెలంకర్ సమాచార హక్కు చట్టం 2005 దరఖాస్తుతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బిఐ)2016–2017 ఆర్థిక సంవత్సరం నుండి 2025–2026 ఆర్థిక సంవత్సరాల మధ్య రుణ ఎగవేత దారుల పేర్లను వెల్లడించమని కోరినాడు. దానికి బ్యాంకు వారు బ్యాంకు విశ్వసనీయ హోదా, వాణిజ్య గోప్యత కలిగి ఉన్న మూడవ పక్షాల వ్యక్తిగత సమాచారం అయినందున సహ చట్టం 2005,సెక్షన్ 8(1)(డి),8(1)(ఇ) మరియు 8(1)(జె) కింద పేర్లను బహిర్గతం చేయడం నుండి మినహాయింపు ఉందని తెలిపారు. **(బాక్స్–2 )**

ఎన్సీఎల్టీ మరియు ఇతర ఫోరమ్ లకు 309 రుణ ఖాతాలను ఎస్బిఐ తీసుకెళ్లగా రూ.1,49,895 కోట్ల క్లెయిమ్స్‌కు బదులుగా పరిష్కార ప్రణాళిక ద్వారా కేవలం రూ.49,727 కోట్లు వసూలు చేసుకోగలిగింది. ఇంకా రూ.100,168 కోట్లను నిరర్ధక ఆస్తులుగా రద్దు చేసుకుంది.

బ్యాంకుల రుణ ఎగవేత దారులను నియంత్రించడానికి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది. బ్యాంకులలో ప్రజల పొదుపు డిపాజిట్లతో, లోన్స్ పై వసూ లు చేస్తున్న వడ్డీలతో, బ్యాంకుల సేవలపై వసూలు చేస్తున్న చార్జీలతో ఏటా లక్షల కోట్ల రూపాయలు లాభాలు వస్తున్నవి. బ్యాంకుల లాభాలను మదుపు చేయడంలోనూ,మరింత సంపదను సృష్టించడానికి వెచ్చించకుండా పరోక్షంగా బడా పెట్టుబడి సంస్థల రుణ ఎగవేతకు సహకరిస్తుంది.పైగా ఇప్పుడు నగదు బదిలీల రుసుం వసూలుకు బిజెపి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సన్నద్ధం అవుతుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)నియంత్రణలో ఎన్పీసీపీ ద్వారా యూపీఐ పేమెంట్స్ 2016 నవంబర్ 4నుండి సాఫీగా జరుగుచున్నవి.ప్రతి సెకండ కు సగటుగా దాదాపు రూ.7,500 లావాదేవీలు జరుగుచున్నవి. ప్రపంచంలోనే అతిపెద్ద రియల్ టైమ్ చెల్లింపు వ్యవస్థగా యుపిఐ ఎదిగింది.

ప్రతి రోజు 640 మిలియన్లకు పైగా లావాదేవీలను ప్రాసెస్ చేస్తుంది. ఇప్పుడు యూపీఐ చెల్లింపులపై కూడా ఛార్జీలను వసూలు చేయడానికి కసరత్తులు జరుగుచున్నవి.దానితో నగదు బదిలీలకు అలవాటు పడిన ప్రజలలో ఆందోళన మొదలైంది.ఇప్పటికే బ్యాంకులలో రక రకాల రుణాలపై వసూలు చేస్తున్న వడ్డీలతో, బ్యాంకు సేవలపై వసూలు చేస్తున్న చార్జీలతో,ప్రజల పొదుపు డిపాజిట్ల డబ్బులతో పోగవుతున్న లక్షల కోట్ల రూపాయల లాభాలను రుణ ఎగవేత దారుల పాలు కాకుండా చర్యలు తీసుకుని, ఉత్పత్తి, ఉత్పాదక రంగాల అభివృద్ధికి వెచ్చించి సామాజిక అభివృద్ధికి, దేశాభివృద్ధికి కృషి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

**(బాక్స్–2)**

**నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్సీఎల్టీ)**

| సంవత్సరం | రద్దు చేసిన రుణం | వసూలు |
|---|---|---|
| | (సంఖ్యలు రూ.కోట్లలో) | |
| 2016–17 | 13,587 | 113 |
| 2017–18 | 17,548 | 309 |
| 2018–19 | 27,225 | 1,811 |
| 2019–20 | 46,348 | 4,548 |
| 2020–21 | 17,137 | 611 |
| 2021–22 | 6,177 | 548 |
| 2022–23 | 10,193 | 2,496 |
| 2023–24 | 3,320 | 1,471 |
| 2024–25 | 7,632 | 6,254 |
| 2025–26 | 2,690 | 2,677 |

## సినిమా మన జీవనశైలిలో భాగం అవుతున్నదా !

హాలీవుడ్ పేరుకు ప్రేరణగా బొంబాయి కేంద్రంగా అంతర్జాతీయ స్థాయి చలనచిత్రాలను నిర్మిస్తున్న హిందీ సినీ పరిశ్రమను బాలీవుడ్ అని పిలుస్తున్నాం. 1970ల్లో ప్రారంభంపైన బాలీవుడ్ సినీ వైభవం నేడు హాలీవుడ్ దృష్టిని కూడా ఆకర్షించడం, అత్యుత్తమ సినిమాలను తీస్తూ ప్రపంచ సినీ ప్రేక్షకుల మనసులు దోయడం జరుగుతోంది. హిందీ భాష సినిమాల ద్వారా భారతీయ నృత్యాలు, సాంస్కృతిక వారసత్వ సంపద, కళలు, గీతాలు, సంగీత మాధుర్యాల ను భారతీయ ప్రేక్షకులకు కాకుండా ప్రపంచ దేశాల ప్రజల మన్ననలు సహితం పొందడం మన బాలీవుడ్ విజయంగా భావించాలి. తెలుగు సినీ పరిశ్రమను టాలీవుడ్ అని, కేరళ మలయాళ సినీ పరిశ్రమను మాలీవుడ్ అని, కన్నడ సినీ పరిశ్రమను సాండల్వుడ్ అని, పంజాబీ సినీ పరిశ్రమను పాలీవుడ్ అని, గుజరాతీ సినీ పరిశ్రమను డాలీవుడ్ అని, బెంగాలీ/మరాఠీ/ఒడియా సినీ పరిశ్రమను ఓలీవుడ్ అని, అస్సామీ సినీ పరిశ్రమను జాలీవుడ్ అని, భోజ్పురీ సినీ పరిశ్రమను భోజ్వుడ్ అని, తమిళ సినీ పరిశ్రమను కోలీవుడ్ (చెన్నై, కొడంబాకమ్ పేరుతో)అని, పాకిస్థానీ సినీపరిశ్రమను లాలీవుడ్ అని పిలవడం పరిపాటి అయ్యింది.

**ప్రపంచ బాలీవుడ్ దినోత్సవం :** భారత జాతీయ సినీ అవార్డుల ప్రదానం, అంతర్జాతీయ ఫిలిమ్ ఫెస్టివల్ నిర్వహణ, ఫిలిమ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేయడం లాంటి కార్యక్రమాల నిర్వహణతో బాలీవుడ్ సినీ పరిశ్రమ ఖ్యాతి ప్రపంచవ్యాప్తం కావడం చూస్తున్నాం. మన హిందీ సినిమాలు ప్రపంచ దేశాల్లో కూడా మంచి ఆదరణ పొందడం నేడు సర్వసాధారణం అయ్యిం ది. బాలీవుడ్ సినిమా ద్వారా మనసులను రంజింపజేసే సుస్వర సంగీతం, ఆకర్షణీయ క్లాసికల్/నాన్ క్లాసికల్ డ్యాన్సులు, మన ఆచార వ్యవహారాలు, భారతీయ జీవనశైలి, మానవీయ విలువలు, చారిత్రక/పౌరాణిక చరిత్రలు, మరిచిపోలేని పాత్రలు ఎన్నో మన బాలీవుడ్ స్థాయిని అంతర్జాతీయ స్థాయికి చేర్చడం జరిగింది. 24 సెప్టెంబర్ 1913 రోజున దాదాసాహెబ్ పాల్కే నిర్మించిన భారత తొలి పూర్తి నిడివి కలిగిన రాజా హరిశ్చంద్ర సినిమా విడుదల కావడంతో ఆ అపూర్వ ఘట్టానికి గుర్తుగా ప్రతి ఏట 24 సెప్టెంబర్ రోజున ప్రపంచ బాలీవుడ్ దినోత్సవం (వరల్డ్ బాలీవుడ్ డే) పాటించడం 2014 నుంచి ప్రారంభమైంది. సామాజిక అంశాలతో కూడిన ఫామిలీ డ్రామాల కేంద్రంగా 1940ల్లో భారతీయ సినిమా స్వర్ణ యుగం ప్రారంభం అయ్యింది. ప్రపంచ సినీ ప్రభావంతో భారతీయ బాలీవుడ్ సినిమా కొత్త పుంతలు తొక్కుతూ, టెక్నాలజీని ఒంటపట్టించుకొని అద్భుతాలు తెరపై చూపిస్తూ బాలీవుడ్ సినీ పరిశ్రమ ఉజ్వలంగా ముందుకు సాగుతోంది. 1990ల తర్వాత పూర్వపు సినీ పరిశ్రమ నూతన రంగు రంగుల కాస్ట్యూమ్స్, అద్భుత సంగీత సరాగాలు, ఉద్విగ్న భరిత కథ గమనాల తో న్యూ బాలీవుడ్ రంగులు పూసుకొని ప్రపంచ మానవాళి మనసుల్లో తిష్ట వేస్తున్న ది.

సినిమా ఒక వినోదం మాత్రమే కాదని, ఆ పరిశ్రమ ద్వారా మన కళలను కాపాడుకోవడం, సంస్కృతులను రేపటి తరానికి పరిచయం చేయడం, ఆ కథల నుంచి స్ఫూర్తిని పొందడం జరగాలి. నేడు ఓటిటి వేదికలు రావడం, గ్రాఫిక్ టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో భారతీయ చలనచిత్ర పరిశ్రమ ఒక అతి పెద్ద ప్రజాదరణ పొందిన పరిశ్రమగా కొనసాగుతున్నది. భిన్న భాషల భారతంలో అనేక సినిమాలు విడుదల అవుతూ మనకు తెలియకుండానే మన సామాజిక జీవన విధానాలను ప్రభావితం చేస్తున్నాయి. నేటి సినిమాలు మన సంస్కృతికి అద్దం పడుతూ, కళలను పోషిస్తూ, కథలతో కట్టిపడేస్తూ, పరిమిత స్థాయిలో పాశ్చాత్య రంగులను పులుముకుంటూ ముందుకు సాగాలని కోరుకుందాం.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# రాష్ట్ర భవిష్యత్తు, ఆర్థిక ప్రగతికి
# ఇన్‌వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్

**• అధికారులంతా స్ఫూర్తితో భాగస్వాములు కావాలి : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క • డిసెంబర్ 7 నుంచి 9 వరకు ప్రపంచ పెట్టుబడుల సదస్సు**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో డిసెంబర్ 7 నుంచి 9 వరకు నిర్వహించనున్న 'ఇన్‌వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026' ఏర్పాట్లను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రాష్ట్ర భవిష్యత్తు, ఆర్థిక ప్రగతిని కొత్త శిఖరాలకు చేర్చే ఈ చారిత్రాత్మక సదస్సును విజయవంతం చేసేందుకు ప్రతి అధికారి స్ఫూర్తితో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. సచివాలయంలో బుధవారం నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ సన్నాహక సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మహ్మద్ అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సదస్సు ఏర్పాట్లు, ప్రచారం, దేశీయ, అంతర్జాతీయ రోడ్‌షోల నిర్వహణపై సమావేశంలో కార్యాచరణను ఖరారు చేశారు.

### పర్యవేక్షణకు 10 ప్రత్యేక అధికారుల కమిటీలు

2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్య సాధనలో గ్లోబల్ సమ్మిట్ కీలక మైలురాయిగా నిలుస్తుందని, సమ్మిట్ నిర్వహణ పర్యవేక్షణకు సుమారు 10 ప్రత్యేక అధికారుల కమిటీలను ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రతి కమిటీకి సీనియర్ అధికారి నేతృత్వం వహిస్తారని చెప్పారు. పనుల రూపకల్పన, బడ్జెట్ అంచనాలు, ఆమోదాల ప్రక్రియలో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు.అధికారుల కమిటీలతో పాటు ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్లను ఏర్పాటు చేసి, వాటికి సంబంధిత మంత్రులను చైర్‌పర్సన్లుగా నియమించినట్లు తెలిపారు. కన్వీనర్లను కూడా నియమించామని, వారు వెంటనే సంబంధిత మంత్రులను కలిసి బాధ్యతలు స్వీకరించి పనులు ప్రారంభించాలని ఆదేశించారు.



### ప్రపంచవ్యాప్తంగా విస్తృత ప్రచారం

ఇన్‌వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ప్రపంచవ్యాప్తంగా ప్రచారం కల్పించేందుకు ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, సోషల్ మీడియా వేదికలను విస్తృతంగా వినియోగించాలని డిప్యూటీ సీఎం సూచించారు. సదస్సుకు సంబంధించిన కార్యక్రమాలు, పెట్టుబడి అవకాశాలు, రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక అవకాశాలపై నిరంతర ప్రచారం జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో సదస్సుకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గతంలో కుదిరిన ఎంఓయులను సమీక్షించి, వాటి అమలు పురోగతిని పరిశీలించాలని ఆదేశించారు. తెలంగాణలో పెట్టుబడులకు అధిక అవకాశాలు ఉన్న దేశాలు, నగరాలు, పారిశ్రామిక రంగాలను గుర్తించి దేశీయ, అంతర్జాతీయ రోడ్‌షోల కోసం స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని భట్టి విక్రమార్క సూచించారు. ఏ దేశంలో ఏ రంగంలో పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయో అధ్యయనం చేసి, వివిధ రంగాలకు అనుగుణంగా రోడ్‌షోల ప్రణాళికను రూపొందించి మంత్రిమండలి ఉప సంఘానికి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేసి రోడ్‌షోలను ప్రారంభించాలని సూచించారు.

### వార్‌రూమ్ ద్వారా రోజువారీ పర్యవేక్షణ

సమ్మిట్ ఏర్పాట్ల కోసం ఏర్పాటు చేసిన బృందాలు వెంటనే సమావేశమై పనులను ప్రారంభించాలని, వార్ రూమ్ ద్వారా ప్రతి పనిని నిరంతరం పర్యవేక్షించాలని డిప్యూటీ సిఎం ఆదేశించారు. ప్రతిరోజూ సాయంత్రం పనుల పురోగతిని సమీక్షించిన అనంతరం రోజువారీ బాధ్యతలను ముగించాలని సూచించారు. ప్రతినిధుల స్పందనను బట్టి ప్రస్తుతం ప్రతిపాదించిన నాలుగు సభా ప్రాంగణాలను అవసరమైతే ఆరు లేదా ఎనిమిది హాళ్లకు పెంచేలా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. గ్లోబల్ సమ్మిట్‌ను కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా తెలంగాణకు దీర్ఘకాలికంగా ఉపయోగపడే ఆర్థిక, పారిశ్రామిక అవకాశాల వేదికగా తీర్చిదిద్దాలని భట్టి విక్రమార్క సూచించారు. రాష్ట్ర భవిష్యత్తు, అభివృద్ధి, ఆర్థిక వికాసంలో ప్రతి అధికారి భాగస్వామి కావాలని, ఎక్కడా రాజీ లేకుండా సదస్సును విజయవంతం చేయాలని డిప్యూటీ సిఎం ఆకాంక్షించారు.

# 'సర్'తో ఓటర్ల హక్కు కాలరాస్తున్న మోదీ సర్కార్

**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి.నరసింహ**




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబి తా సవరణ పేరుతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఓటర్ల హక్కులను నరేంద్ర మోదీ సర్కార్ కాలరాస్తోందని సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి.నరసింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల జాబితాలపై ప్రజల్లో ఇప్పటికే అనేక అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియ మరింత పారదర్శకంగా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం నాగోల్ సాయినగ ర్‌లో సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ఐఆర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును ఉద్దేశించి ఇటి.నరసింహ మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇవిఎంలను ఉపయోగించుకొని అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. కేంద్ర ప్రభు త్వం ప్రజా వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఎలాగైనా తిరిగి అధికారాన్ని హస్తగతం చేసుకోవడం కోసం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎస్ఐఆర్ పేరుతో ప్రజల ఓట్లను తొలగిస్తోందని విమర్శించారు. బెంగాల్, బీహార్ తదితర రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలను పరిశీలించాలని ఆయన కోరారు. ఏళ్లుగా ఓటు వేస్తున్న పౌరులను అకస్మాత్తుగా పాత రికార్డులు, మ్యాపింగ్ వివరాలు, ఇతర పత్రాల పేరుతో వివరణలు కోరడం ఆందోళన కలిగించే అంశమని నరసింహ అన్నారు. ఓటర్ల జాబితాలో డూప్లికేట్ ఎంట్రీలు, మరణించిన వారి పేర్లు, చిరునామా మారినవారి వివరాలు వంటి అంశాలను సరిచేయడం అవసరమే అయినప్పటికీ, ఆ ప్రక్రియలో నిజమైన ఓటర్లు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల యంత్రాంగంపై ఉందన్నారు.తెలంగాణలో నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత గడువులో సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించి అవసరమైన పత్రాలను సమర్పించాలని సూచించారు. రాష్ట్రంలో జారీ చేసిన 92.88 లక్షల నోటీసుల్లో 83.24 లక్షలు అందగా, ఇంకా 9.64 లక్షలు ఇంకా అందాల్సి ఉండగా 41.84 లక్షల నోటీసులకు గడువు ముగిసినట్లు అధికారులు వెల్లడించారని తెలిపారు. అయితే అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగించకుం డా ఎన్నికల సంఘం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు, సాయినగర్ ఏరియా బాధ్యులు కాంపల్లి శ్రీనివాస్, శాఖ కార్యదర్శు లు యాదయ్య, కొమ్ము రాములు, ధనమ్మ, ఉబ్బని వెంకటేష్, రాజుగౌడ్, అండాలు, అంజమ్మ, లక్ష్మి, హేమలత, రాధ, రాములు, ఉపేందర్, వెంకటమ్మ, అరెకంటి రాములు, లావణ్య, చెన్నమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ జయంతి నాడు 'డిమాండ్స్ డే'

### ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) పిలుపు

**చండీగఢ్:** అక్టోబర్ 2 (గాంధీ జయంతి)న దేశవ్యాప్తంగా 'డిమాండ్స్ డే' నిర్వహించాలని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) పిలుపునిచ్చింది. ఇటీవల కర్ణాటకలోని బెంగళూరులో జరిగిన ఐజెయు జాతీయ కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు యూనియన్ నాయకులు వెల్లడించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో భాగంగా మీడియా రంగానికి చెందిన వివిధ సమస్యలపై భారత రాష్ట్రపతికి, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు వినతిపత్రాలు అందజేయాలని రాష్ట్ర అనుబంధ సంఘాలను కోరింది. ఈ మేరకు ఐజెయు అధ్యక్షుడు బల్విందర్ సింగ్ జమ్మూ, ప్రధాన కార్యదర్శి డి. సోమసుందర్ బుధవారం ఒక ప్రతికా ప్రకటనను విడుదల చేశారు. కొత్త మీడియా కమిషన్ ఏర్పాటు, జర్నలిస్టుల భద్రతకు జాతీయ చట్టం, రద్దు చేసిన జర్నలిస్టుల చట్టాల్లో చట్ట బద్ధ హక్కులను పునరుద్ధరించాలని, నూతన వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలనే డిమాండ్స్‌తో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

# విద్యుత్‌పై బిఆర్ఎస్‌ది తప్పుడు ప్రచారం : అద్దంకి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ సరఫరా, డిమాండ్‌కు సంబంధించిన సమస్యలు తలెత్తుతున్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. సిఎల్‌పి కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ సరఫరాను సక్రమంగా కొనసాగించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. తెలంగాణలో యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ ప్లాంట్లను తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వాలేనని పేర్కొన్నారు. దేశానికి విద్యుత్ రంగాన్ని అభివృద్ధి చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ అందించిన తొలి పార్టీ కాంగ్రెస్ అని, ఎస్‌సి, ఎస్‌టి కాలనీలకు ఉచిత విద్యుత్ అందించామని చెప్పారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలు ప్రస్తుతానికి ప్రతిబంధకంగా మారాయని ఆరోపించారు. అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేయడంతో డిస్కంలపై ఆర్థిక భారం పడిందన్నారు. విద్యుత్ శాఖను అవినీతి, అక్రమాలకు కేంద్రంగా మార్చారని విమర్శించారు. విద్యుత్ విషయంలో బిఆర్ఎస్ తప్పుడు ప్రచా రం చేస్తోందని, ఆ ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని అద్దంకి దయాకర్ కోరా రు. అవసరమైతే ఎంత ధర చెల్లించైనా విద్యుత్ కొనుగోలు చేసి రైతులకు సరఫరా చేస్తామని స్పష్టం చేశారు.

### కెటిఆర్‌కు సమాధానం చెప్పే దమ్ము లేకే కరెంట్ పేరుతో డైవర్షన్ : బల్మూర్ వెంకట్

తమ ప్రభుత్వం, కాంగ్రెస్ నేతలు ఆధారాల తో బయటపెట్టిన భూముల వ్యవహారంపై సమాధానం చెప్పకుండా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రజల దృష్టిని మళ్లించేందుకు విద్యుత్, కరువు అంశాలను తెరపైకి తెస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్ పేర్కొన్నారు. కరు వు, విద్యుత్‌పై కెటిఆర్ చేస్తున్న వ్యాఖ్యల్లో అవగాహన, ఆలోచన లేదని విమర్శించారు. దేశవ్యాప్తంగా ఎల్ నినో పరిస్థితులు ఉన్నాయని, ఇవి ప్రభుత్వాలు తీసుకొచ్చేవి కావని పేర్కొన్నారు.

### కెటిఆర్ చరిత్ర తెలుసుకుని మాట్లాడాలి: ఎంపి చామల

కెసిఆర్ విద్యుత్ ఛార్జీల కోసం పోరాడారని కెటిఆర్ చెప్పడం అవాస్తవమని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. 2000లో బషీర్‌బాగ్ కాల్పులు జరిగినప్పుడు కెసిఆర్ టిడిపిలోనే ఉన్నారని, 2001లో ఆ పార్టీని వీడారని గుర్తుచేశారు. కెటిఆర్ చరిత్ర తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. బిఆర్ఎస్ హయాంలో డిస్కంలపై రూ.81 వేల కోట్ల అప్పులు చేశారని, ఛత్తీస్‌గఢ్ నుంచి వెయ్యి మెగావాట్ల విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. భద్రాద్రి, యాదాద్రి పవర్ ప్రాజెక్టుల కాంట్రాక్టుల్లోనూ అక్రమాలు జరిగాయని పేర్కొన్నారు. రైతులను రెచ్చగొట్టి బిఆర్ఎస్ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్, ప్రాజెక్టుల పేరుతో జరిగిన అవకతవకల వివరాలను త్వరలో ఒక్కొక్కటిగా బయటపెడతామని చామల తెలిపారు.

### కెటిఆర్ రాజకీయ శకం ముగిసింది: మెట్టు సాయికుమార్

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ గతి, మతి లేకుండా మాట్లాడుతున్నారని టిపిసిసి ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్ విమర్శించారు. సిరిసిల్లలో కెటిఆర్ ఓటమి ఖాయమని, గత పదేళ్ల పాలనలో తెలంగాణ ప్రజలను మోసం చేసి రాష్ట్రాన్ని ఆగం చేశారని ఆ రోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రో జుల పాలనలో సంక్షేమ పథకాలు అమలు చేస్తుండటాన్ని ఓర్వలేకే కెటిఆర్ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు గత ప్రభుత్వ హయాంలో జరిగిన విషయాలను మర్చిపోలేదని, బిఆర్ఎస్ రాజకీయ శకం ముగిసిందని సాయికుమార్ అన్నారు.

# సొంతూరులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన బాధ్యత

**రాష్ట్ర పౌరసరఫరాల, భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**ప్రజాపక్షం/సూర్యాపేట:** పుట్టి పెరిగిన గ్రామంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకోవడం బాధ్యతగా భావిస్తున్నానని రాష్ట్ర పౌరసరఫరాల, భారీ నీటి పారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌తో కలిసి తిరుమలగిరి మండలం తాటిపాములలో రూ.5కోట్ల సిఎస్ఆర్ నిధులతో జెడ్ పి హైస్కూల్ బలోపేతం పనులకు, రూ.2కోట్ల జెన్‌కో నిధులతో ప్రైమరీ స్కూల్ బలోపేతం పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.16కోట్లతో యశ్వంత్‌పూర్ వాగుపై నిర్మిస్తున్న చెక్ డ్యామ్ కమ్ బ్రిడ్జి పనులను పరిశీలన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో మెరుగైన విద్య అందించడానికి రూ.7 కోట్ల నిధులతో హైస్కూల్, ప్రైమరీ స్కూల్‌లో అదనపు గదులు నిర్మించడం జరుగుతుందన్నారు. ఇట్టి పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వీలైనంత త్వరగా ఒక సంవత్సరంలోపు పనులు పూర్తి చేసి ఇవ్వాలని గుత్తందారులను ఆదేశించారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందిస్తూ అంగన్‌వాడీ కేంద్రానికి రూ.20లక్షల చొప్పున మొత్తం 4 అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.80లక్షలు మంజూరు చేసి మంచి నాణ్యతతో చుట్టూ ప్రహరీ గోడ, టాయిలెట్స్‌తో ఆధునిక పద్ధతిలో నిర్మించాలన్నారు. రూ.16కోట్లతో యశ్వంత్‌పూర్ వాగుపై నిర్మిస్తున్న చెక్‌డ్యామ్ కమ్ బ్రిడ్జి పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలన్నారు. దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేసి తుంగతుర్తి నియోజక వర్గానికి నీరు అందిస్తామని అలాగే సమ్మక్క సారలమ్మ ప్రాజెక్టును కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ రాబోవు రోజుల్లో తుంగతుర్తి నియోజక వర్గంలోని అన్ని గ్రామాలకు రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, స్త్రీ శక్తి భవనాలు, పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్, జిల్లా ఎస్‌పి కె. నరసింహ, సూర్యాపేట మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, ఆర్‌డిఓ వేణుమాధవరావు, డిసిసి ప్రెసిడెంట్ గుడిపాటి నర్సయ్య, సర్పంచ్ కిషన్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.




# కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్ల రాష్ట్రంలో విద్యు త్ సంక్షోభం

**బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లనే రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభం ఏర్పడిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. రాష్ట్రంలో ఒక వైపు థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు కొరతతో ఉత్పత్తి పడిపోతుంటే, మరోవైపు నీటి లభ్యత లేక జల విద్యుత్ కేంద్రాలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలోని వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు ఆరు బిఆర్ఎస్ బృందాలు రాష్ట్రంలోని ఆరు థర్మల్ పవర్ ప్లాంట్లను, సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని గురువారం సందర్శించనున్నాయని వెల్లడించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్రంలో 7,778 మెగావాట్ల స్థాపిత విద్యుత్ సామర్థ్యం ఉండగా, బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేళ్లల్లో 19,472 మెగావాట్లకు పెంచామని, విద్యుత్ రంగంలో దాదాపు రూ.లక్ష కోట్లు పెట్టుబడి పెట్టామని వివరించారు. కొంతమంది పారిశ్రామికవేత్తలు తమ విద్యుత్ అవసరాల నిమ్మితం సుమారు 30 శాతం వరకు జనరేటర్ల ద్వారా విద్యుత్‌ను సమకూర్చుకుంటున్నాయన్నారు. రాష్ట్రంలో 1980 కాలం నాటి విద్యుత్ పరిస్థితులు తిరిగి వచ్చాయన్నారు. రానున్న వేసవిలో పరిస్థితి మరింత తీవ్రమైతే తాగు, సాగు నీరు, యాసంగి పంటలు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా వంటి అంశాలపై ప్రభుత్వం ఏం ప్రణాళికతో ముందుకెళ్తున్నదో చెప్పాలన్నారు. జెన్‌కోకు నాణ్యమైన బొగ్గు అందించాల్సిన సింగరేణి సంస్థ, తక్కువ నాణ్యత కలిగిన జి13, జి14 గ్రేడ్ బొగ్గును సర ఫరా చేస్తున్నదని, ఆ నాసిరకం బొగ్గు వినియోగంతో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం తగ్గడంతో రూ.2,900 కోట్ల ప్రజాధనం నష్టపోయిందన్నారు. బొగ్గు ఉత్పత్తి, సరఫరా, ఆర్థిక వ్యవహారాలు, పవర్ ప్లాంట్ల నిర్వహణపై ప్రభుత్వం సమగ్రంగా దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

### బిఆర్ఎస్ బృందాలు..

యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్‌ను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను మాజీ మంత్రి పువ్వాడ అజయ్, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, భూపాలపల్లిలోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌ను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యేలు కోవాలక్ష్మి , అనిల్ జాదవ్, మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దివాకర్ రావు, హైదరాబాద్‌లోని సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే వివేకానంద గౌడ్, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, శంభీపూర్ రాజు పరిశీలిస్తారని కెటిఆర్ వెల్లడించారు.

# పోలీసుల పహారా మధ్య ఎర్రవల్లిలో భూ సర్వే

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్ :** మర్కూక్ మండలంలోని ఎర్రవల్లిలో వివాదస్పదంగా మారిన సర్వే నంబర్ 325లో బుధవారం పోలీసుల పహారా నడుమ సర్వే అధికారులు క్షేత్రస్థాయి లో భూమి సర్వే నిర్వహించారు. జిల్లా సర్వే అధికారి సుదర్శన్ ఆధ్వర్యంలో నాలుగు బృందాలుగా ఏర్పడిన సర్వే బృంధం సభ్యులు రైతుల వారిగా వారి వద్ద ఉన్న భూమి పత్రాల ఆధారం గా కొలతలు నిర్వహించి, వారు సాగు చేసిన భూమికి హద్దులు ఏర్పాటు చేశారు. నిన్న నోటీసులు అందుకున్న రైతులు తెల్లావారు జామున తమ వద్ద ఉన్న భూ ఆధారిత హక్కుల పత్రాలతో అసైన్డ్ భూమి వద్దకు హాజరయ్యారు. 325లో అసైన్డ్ పట్టాలు పొందిన 224 మంది రైతులకు గాను 200 మందికి నోటీసులు జారి చేయగా, మిగిలిన 24 మందికి నోటీసులు జారి చేయాల్సి ఉందని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇప్పటికే 80 శాతం భూమి సర్వే పూర్తి కావస్తుందని అన్నారు. త్వరలోనే సర్వేను పూర్తి చేసి కబ్జాలో ఉన్న రైతుల పేర్లతో కూడిన నివేధికను తయారు జిల్లా కలెక్టర్‌కు అనంతరం సిసిఎల్‌కు అందజేయనున్నారు.

# శశి థరూర్‌తో మధుయాష్కీ గౌడ్ భేటీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఎఐపిసి) వ్యవస్థాపక చైర్మన్, మాజీ కేంద్ర సహాయ మంత్రి, ఎంపి శశి థరూర్‌ను ఎఐపిసి ప్రస్తుత చైర్మన్ మధుయాష్కీ గౌడ్ న్యూఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎఐపిసి కార్యకలాపాల విస్తరణ, సంస్థ భవిష్యత్ కార్యక్రమాలపై ఇరువురు చర్చించారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాలకు చెందిన ప్రొఫెషనల్స్‌ను కాంగ్రెస్‌తో మరింతగా అనుసంధానం చేసే అంశంపై అభిప్రాయాలను పంచుకున్నారు. ఎఐపిసిను మరింత బలోపేతం చేయడంతో పాటు వైద్యం, న్యాయ, విద్య, సాంకేతిక, వ్యాపార తదితర వృత్తి రంగాలకు చెందిన నిపుణుల భాగస్వామ్యాన్ని పెంచే దిశగా చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు తెలిపారు.

# ఎల్‌నినోపై కెటిఆర్ రాజకీయ రాద్ధాంతం తగదు: మల్లు రవి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొని కరువు ఏర్పడటంతో విద్యుత్ సమస్యలు తలెత్తితే దానిని రాజకీయంగా రాద్ధాంతం చేయడం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు తగదని నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి అన్నారు. వర్షాలు లేకపోవడంతో దేశవ్యాప్తంగా కరువు పరిస్థితులు ఏర్పడ్డాయ ని, జలాశయాల్లో నీటి లభ్యత తగ్గడంతో జలవిద్యుత్ ఉత్పత్తిపై ప్రభావం పడిందని బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఫలితంగా విద్యుత్ కొరత ఏర్పడిన విషయం తెలిసినప్పటికి కెటిఆర్ రాజకీయ విమర్శలకు దిగడం సమంజసం కాదన్నారు.దేశవ్యాప్తంగా విద్యుత్ కొరత ఉన్న సమయంలో అవసరమైన విద్యుత్‌ను ఇతర ప్రాంతాల నుంచి కూడా కొనుగోలు చేయలేని పరిస్థితులు ఏర్పడతాయని మల్లు రవి పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకోకుండా రాష్ట్రంలో విద్యుత్ సమస్యలకు రాజకీయ దురుద్దేశాలను ఆపాదించడం సరికాదని ఆయన పేర్కొన్నారు. ఎల్‌నినో కూడా కాంగ్రెస్ వల్లే వచ్చినట్టుగా కెటిఆర్ ప్రచారం చేయడం దారుణమని,న ప్రకృతి వైపరీత్యాలను కూడా రాజకీయాలకు ఉపయోగించుకోవడం తగదు అని మల్లు రవి హితవు పలికారు. విద్యుత్ సమస్యలపై ప్రజలకు వాస్తవ పరిస్థితులు తెలుసని, కెటిఆర్ చేస్తున్న రాజకీయ విమర్శలను ప్రజలు విశ్వసించరని ఆయన పేర్కొన్నారు.

# మారెళ్లపాడు 'ఎత్తిపోతలు' ప్రారంభం

**భారీ జనసందోహం మధ్య నీటిని విడుదల చేసిన మంత్రులు**

**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలం మారెళ్లపాడులో సీతారామ ప్రాజెక్టు అనుబంధంగా నిర్మించిన మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ఎత్తిపోతల పథకానికి నీటిని విడుదల చేశారు. కార్యక్రమానికి భారీగా రైతులు, ప్రజలు తరలిరావడంతో మారెళ్లపాడు జనసందోహంగా మారింది. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రైతులు ఎదురుచూస్తున్న కల నెరవేరడం సంతోషంగా ఉందన్నారు. మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభం రైతులకు దసరా, దీపావళి పండుగలతో సమానమ ని పేర్కొన్నారు. సీతారామ ప్రాజెక్టు పరిధిలోని డిస్ట్రిబ్యూటరీ పనులకు సం బంధించి పలు మండలాల్లో సర్వే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. సీతమ్మ సాగర్‌కు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ కూడా తుది దశకు చేరుకుందని వివరించారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసాతో పాటు పంటలకు మద్దతు ధర, బోనస్ అందిస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సీతారామ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడంతో పాటు అశ్వాపురం నుంచి పాలేరు వరకు సాగునీరు అందించేలా చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ అంకిత్, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ కార్యక్రమంలో ప్రసంగించారు. ఎత్తిపోతల పథ కం ద్వారా ఈ ప్రాంత రైతులకు సాగునీటి సౌకర్యం మరింత మెరుగుపడనుంది. ఈకార్యక్రమంలో అశ్వాపురం మండల అధ్యక్షుడు ఓ రుగంటి రమేష్, సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఉసా అని ల్, పలువురు నాయకులు, కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ప్రభుత్వం
**జిల్లా పంచాయత్‌రాజ్ ఇంజనీర్, రాజన్న సిరిసిల్ల**

ఎన్ఐటి నెంబర్ 21-23/డిపిఆర్ఇ/ఆర్ఎస్/టెండర్లు/2026-27, తేదీ: 22.09.2026

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ICDS, CBF మరియు SAND FUND నిధుల నుండి (03) పనులకి అంచనా విలువ రూ.14.50 లక్షలకు గాను (1,2,8వ పిలుపు), బిడ్ అప్‌లోడింగ్ ప్రారంభ తేది: 24.09.2026 నుండి, ముగింపు తేది: 29.09.2026, తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.tenders.telangana.gov.in నుండి పొందవచ్చు.

సం/- జిల్లా పంచాయత్‌రాజ్ ఇంజనీర్, రాజన్న సిరిసిల్ల.

DIPR R.O. No. : 10505-PP/CL/ADVT/2026-27, Date: 23-09-2026

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

షార్ట్ టెండర్ 'ఇ'ప్రొక్యూర్‌మెంట్ NIT No. 46/EE/Cir 40/SBZ/GHMC/2026-27, dt: 22.09.2026

| S. No. | NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|---|
| 1 | NIT No. 46/ EE/Cir 40/ SBZ/ GHMC/ 2026-27, dt: 22.09.2026 | 1 నెం. పని | రూ. 13.20 లక్షలు | డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 23.09.2026 మ.3.00గం.ల నుండి, డౌన్‌లోడ్ ఆఖరి తేది: 26.09.2026 మ.3.00గం.ల వరకు, బిడ్ ప్రారంభం: 26.09.2026 మ.3.15 గం.లకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-40, జిహెచ్ఎంసి, సెల్ నెం. 7995007437 |

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-40, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 10526-PP/CL/ADVT/2026-27, Date: 23-09-2026

## గద్వాల జిల్లా కలెక్టర్‌కు కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ప్రత్యేక ఆహ్వానం

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల :** జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్‌కు ఈ నెల 24 ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న ప్రత్యేక సెషన్‌కు ఆహ్వానం లభించింది. ఈ సందర్భంగా బెస్ట్ వాటర్ మేనేజ్మెంట్ ప్రాక్టీసేస్ అంశంపై జిల్లా కలెక్టర్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో అమలు చేస్తున్న ఉత్తమ నీటి నిర్వహణ విధానాలు, అనుభవాలను తెలుసుకునే అవకావం ఈ కార్యక్రమం ద్వారా లభించనుంది. తద్వారా ఆయా ఉత్తమ పద్ధతులను జిల్లాలో, ముఖ్యంగా పిఎండిడికేవై కార్యక్రమం కింద చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు అన్వయించుకునేందుకు ఉపయోగపడుతుంది. జాతీయ స్థాయి వేదికపై జిల్లా తరపున ప్రజెంటేషన్ ఇవ్వడానికి లభించిన ఈ అవకాశంతో జిల్లా ప్రాధాన్యతను సంతరించుకుంది.

## మద్యం అక్రమ నిల్వలపై దాడులు



**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ మండల పరిధిలో అక్రమంగా మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్న వారిపై టాస్క్‌ఫోర్స్, మక్తల్ పోలీసులు దాడులు నిర్వహించి భారీగా మద్యం స్వాధీనం చేసుకున్నారు. మక్తల్ మండలం చందాపూర్ గ్రామంలోని కిరాణా దుకాణాల్లో అక్రమంగా మద్యం నిల్వ చేసిన వారిపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ గౌడ్ వద్ద నుంచి 13.5 లీటర్ల మద్యం, విలువ రూ.9,000 పి.వెంకటేష్ వద్ద నుంచి 17.5 లీటర్ల మద్యం, విలువ రూ.10,600 స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా సంగం బండ రోడ్డులో కాలువ సమీపంలోని దాబాల వద్ద అక్రమంగా మద్యం నిల్వ చేసిన వారిపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మక్తల్ పట్టణానికి చెందిన మోహన్ నాయక్ వద్ద నుంచి 21 లీటర్ల మద్యం, విలువ రూ.7,900 కొత్తగార్లపల్లి గ్రామానికి చెందిన ఓ.లక్ష్మణ్ వద్ద నుంచి 7.5 లీటర్ల మద్యం, విలువ రూ.2,040 స్వాధీనం చేసుకున్నారు. ఈ నాలుగు కేసుల్లో మొత్తం 59.5 లీటర్ల మద్యం, సుమారు రూ.29540 విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నట్లు మక్తల్ ఎస్ఐ రాజు తెలిపారు. అక్రమంగా మద్యం నిల్వ చేసి విక్రయించే వారిపై నిరంతరం నిఘా ఉంచి, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మక్తల్ ఎస్సై రాజు హెచ్చరించారు.

## ఎన్‌హెచ్‌ఎంలో 13 పోస్టులు

కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్ఎం)లో వివిధ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.జయచంద్రమోహన్ తెలిపారు. నారాయణపేట్ జిల్లాలో మొత్తం 13 పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. విసిపిఎం 1, పల్లె దవాఖానా ఎంఎల్ హెచ్‌పి/సిహెచ్ఒ/వైద్యాధికారి 6 వైద్యుడు (ఎంబిబిఎస్/ఎండి)1 స్టాఫ్‌నర్స్ (ఎన్‌సిడి) 1 ఫీజియోథెరపిస్ట్ (ఎన్‌పిహెచ్ఇ) 1 ఫార్మసిస్ట్ (ఆర్‌బిఎస్‌కే)1 ల్యాబ్ టెక్నిషియన్(ఆర్‌బిఎస్‌కే)1 ల్యా టెక్నిషీయన్ (ఆర్‌ఎన్‌టిసిపి)1 పోస్టులు ఉన్నాయి. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను సమర్పించవచ్చని తెలిపారు. అన్ని పనిదినాల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా వైద్య , ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. పోస్టు ద్వారా పంపే దరఖాస్తులు గడువు తర్వాత కార్యాలయానికి చేరితే వాటికి కార్యాలయం బాధ్యత వహించదని స్పష్టం చేశారు. పోస్టుల వారీగా అర్హతలు, ఇతర పూర్తి వివరాల కోసం నారాయణపేట్ జిల్లా అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు.

## నవోదయలో 9,11వ తరగతులకు ప్రవేశాలు

ఈ నెల 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
ఏప్రిల్ 10న లిస్ట్-2027 పరీక్ష



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2027–28 విద్యా సంవత్సరానికి 9,11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి నిర్వహించే లాటరల్ ఎంట్రీ సెలక్షన్ టెస్ట్ (లిస్ట్ 2027)కు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక తెలిపా రు. సెప్టెంబర్ 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నా రు. జవహర్ నవోదయ విద్యాలయ సమితి, హైదరాబాద్ ప్రాంతం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ప్రవేశ పరీక్షకు సెప్టెంబర్ 1 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందన్నారు. అర్హులైన విద్యార్థులు సంబంధిత ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్షను 2027 ఏప్రిల్ 10న నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, గుర్తింపు పొందిన ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల విద్యాధికారులు అర్హులైన విద్యార్థులకు ఈ అవకాశంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు ప్రవేశ పరీక్షకు సంబంధించిన వివరాలను తెలియజేసి గరిష్ఠంగా దరఖాస్తులు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. జవహర్ నవోదయ విద్యాలయాల్లో 9,11వ తరగతుల్లో ప్రవేశం పొందేందుకు అర్హత ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రియాంక సూచించారు.

## కొత్తకోట ఆర్‌టిసి బస్టాండ్‌లో సమస్యలు పరిష్కరించండి

**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట ఆర్‌టిసి బస్టాండ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించి ప్రయాణికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని వనపర్తి డిపో ఆర్‌టిసి అధికారులు కృష్ణయ్య, వెంకటయ్యలకు సిపిఎం మండల కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ కోరారు. బుధవారం నాడు వనపర్తి డిపో ఆర్‌టిసి అధికారులు కొత్తకోట బస్టాండ్‌కు రావడం జరిగింది. ఈ సందర్భంగా బస్టాండ్‌లో ఉన్న సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు బస్టాండ్ ఆవరణలో దుర్వాసనతో వెదజల్లుతుందని మరుగుదొడ్లు మూత్రశాలలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఆర్‌టిసి బస్టాండు అభివృద్ధి చెందితే ప్రయాణికులు ఎక్కువ సంఖ్యలో రావడానికి ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అన్నారు. వర్షం వస్తే చాలు బస్టాండ్ మొత్తం వర్షం నీరు నిండుతుందని ప్రయాణికులు కూర్చోలేని పరిస్థితి ఏర్పడుతుందని ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియదని బిక్కుబిక్కు మంటూ ప్రయాణికులు ఉంటున్నారని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఉన్న మరుగుదొడ్లలో దుర్వాసన మురుగు నీరు బయటికి వెళ్లకపోవడం ద్వారా నీరు నిల్వ ఉండడం వలన దుర్వాసనతో బస్టాండ్ ఆవరణ అంతా వ్యాపిస్తుందని ప్రయాణికులకు ఇబ్బందిగా ఉందని ఆయన చెప్పారు. కొత్తకోట బస్టాండ్ ద్వారా 13 షాపుల నుండి సంవత్సరానికి కోటి రూపాయల పైగా అద్దె రూపంలో ఆర్‌టిసికి లాభం చేకూరుస్తుందని వెంటనే ఖాళీ స్థలంలో మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టాలని కోరారు.



# కాంగ్రెస్ కార్యకర్తలకు సముచిత గుర్తింపు

పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం : చల్లా వంశీచంద్‌రెడ్డి



**ప్రజాపక్షం/నారాయణపేట :** పార్టీ కోసం పదేళ్లుగా కష్టపడి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేసిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు పార్టీ అధిష్టానం సముచిత స్థానం కల్పిస్తుందని కాంగ్రెస్ సిడబ్ల్యుసి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే డా.చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. పార్టీ కోసం కష్టపడుతున్న వారికి గుర్తింపు వచ్చేలా అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని తెలిపారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యవర్గం, బ్లాక్, మండల, పట్టణ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చల్లా వంశీచంద్‌రెడ్డి నూతనంగా ఎన్నికైన జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులను సన్మానించి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి వాట్సాప్ యూనివర్సిటీ ద్వారా చేస్తున్న మత రాజకీయాలను కాంగ్రెస్ శ్రేణులు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజలకు వాస్తవాలను వివరించి మత రాజకీయాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. గత బిఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ కొత్త పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కార్యకర్తలు చొరవ చూపాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. రాష్ట్రంతో పాటు కేంద్రంలోనూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. డిసిసి అధ్యక్షుడు కే.ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా నిర్వహిస్తూ ప్రజలతో నిరంతరం మమేకం కావాలని సూచించారు.

**పిఎసి సమావేశంలో అంతర్గత వ్యవహారాలపై చర్చ**

అంతకుముందు డిసిసి అధ్యక్షుడు కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జిల్లా కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ (పిఎసి) సమావేశం నిర్వహించారు. పార్టీ అంతర్గత వ్యవహారాలపై చర్చించారు. ఎమ్మెల్యేలు, మంత్రులతో సమన్వయం చేసుకుంటూ పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేసేలా పిఎసి సభ్యులు చొరవ తీసుకోవాలని చల్లా వంశీచందర్ రెడ్డి సూచించారు. ప్రతి నెల రెండో శనివారం జిల్లా, మండల, గ్రామస్థాయిలో పిఎసి సమావేశాలు తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. వరుసగా మూడు సమావేశాలకు ఎలాంటి కారణం లేకుండా గైర్హాజరయ్యే సభ్యులకు నోటీసులు జారీ చేసి, కమిటీ నుంచి తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, మక్తల్, కోస్గి, మున్సిపల్ చైర్మన్లు వాకిటి మానస, నరేందర్, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ సలీం, వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు ఎండీ గౌస్, గొల్ల కృష్ణయ్య, ప్రసన్నరెడ్డి, గాజుల శివకుమార్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## కల్వరాలలో యునాని మెగా వైద్య శిబిరం

ప్రజలు ఆయుర్వేద, యునాని వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి : ఎస్ఐ నరేష్ కుమార్




**ప్రజాపక్షం/వీపనగండ్ల :** అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా వీపనగండ్ల మండలం కల్వరాల గ్రామ పంచాయతీ ఆవరణలో బుధవారం ప్రభుత్వ ఆయుష్ యునాని వైద్యాధికారి డా.బ్యాగరి సరిత ఆధ్వర్యంలో మెగా యునాని వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్యసేవలను పొందారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీపనగండ్ల ఎస్ఐ నరేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు ఆయుర్వేద, యునాని వైద్య విధానాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో అందుబాటులో ఉన్న యునాని వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ మాట్లాడుతూ ఆయుర్వేద, యునాని వైద్య విధానాల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు, వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అల్చూరు శ్రీనివాస్ రెడ్డి, గ్రామ పంచాయితీ కార్యదర్శి నాగరాజు, వెటర్నరీ వైద్యుడు మధుసూదన తదితరులు మాట్లాడుతూ ఆయుర్వేద, యునాని వైద్య విధానాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా డా.బ్యాగరీ సరితను అభినందించారు. అనంతరం ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచు తడకల రంగమ్మ వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు చింత దయాకర్, ఆంజనేయులు, భరత్ చారి,దితరులు పాల్గొన్నారు.

## నాలుగు కోట్ల నిధులతో బిటి రోడ్డు పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/నర్వ :** 75 ఏళ్లుగా కొత్తపల్లి గ్రామ ప్రజలు ఎదురుచూస్తున్న బిటి రోడ్డు చిరకాల స్వప్నం నేడు సాకారమైంది. నారాయణపేట జిల్లా నర్వ మండలం పెద్దకడుమూర్ గ్రామం నుంచి కొత్తపల్లి గ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరం గల దయటి రోడ్డు పనులకు నాలుగు కోట్ల నిధులతో శంకుస్థాపన చేసి రోడ్డు పనులను ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి డా.వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు సంబంధిత పంచాయితీ అధికారులు, నర్వ మండల కాంగ్రెస్ పార్టీ బాధ్యులు గీసం చెన్నయ్య సాగర్ ఆధ్వర్యంలో కొత్తపల్లి గ్రామానికి బిటి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించడం జరిగింది. ప్రజల అవసరాలను గుర్తించి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ రాజ డిఈ ఉపేందర్ రెడ్డి , ఎంపిడిఓ శ్రీనివాస్, నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్, జగన్మోహన్ రెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, కొత్తపల్లి గ్రామ సర్పంచు జనార్ధన్ చారి, పంచాయితీ కార్యదర్శి కృష్ణ నర్వ గ్రామ సర్పంచు టి.హనుమంతు రెడ్డి, పెద్ద కడుమూరు సర్పంచు గోవింద్ చిత్తనూరు సర్పంచు మురళి, డైరెక్టర్ మార్క్ నరేష్, మండల ఉపాధ్యక్షులు శరణప్ప, మండల జనరల్ సెక్రెటరీ నాగన్న, వివేకవర్ధన్ రెడ్డి, ప్రచార కార్యదర్శి బీసం రవికుమార్, బీసం రామకృష్ణ, నర్వ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పి.అశోక్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## డిజె శబ్దానికి ఇద్దరు యువకులు మృతి

**ప్రజాపక్షం/మక్తల్ :** నారాయణపేట్ జిల్లా మక్తల్ మండలాల్లో తొమ్మిది రోజుల గణేష్ నిమజ్జనాలకు భాగంగా గణేష్ విసర్జన ఉత్సవాల్లో కాట్రపల్లి గ్రామంలో, మల్లె పల్లి గ్రామంలో వినాయకుల ఊరేగింపు చేయడం జరిగినది. అందులో గ్రామ యువకులు భక్తులు అందరూ పాల్గొని కార్యక్రమంలో డీజే పెట్టడం వల్ల యువకులు ఉత్సాహంతో డ్యాన్సులు చేయడంతో ఇద్దరు వ్యక్తులు డీజే యొక్క సౌండ్ తట్టుకోలేక హఠాత్ మరణం చెందినారని సమాచారం తెలుస్తున్నది. సుప్రీంకోర్టు ఆర్డర్ ప్రకారం డీజేలను నిషేధించామని సంబంధిత శాఖ చెప్పిన గాని చాలా గ్రామాల్లో డీజేలు నిర్వహణ చేస్తున్నారు. వీటిపై సంబంధిత శాఖ చర్యలు తీసుకోవాలని ప్రజల ప్రాణాలను కాపాడలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఘనంగా గణేష్ నిమజ్జన మహోత్సవం..



**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ పట్టణంలోని 9వ వార్డు బసవేశ్వర కాలనీలో గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం గణేష్ నిమజ్జన మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఎంతో ఉత్సాహభరితంగా కొనసాగిన వేడుకల్లో మంత్రి సోదరుడు మాజీ ఉప సర్పంచ్ వాకిటి శేషగిరి పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎంతో పవిత్రంగా నవరాత్రులు పూజించిన లడ్డు ప్రసాదానికి వేలం పాటు నిర్వహించారు. వేలంపాటలో లడ్డును దక్కించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. చివరికి గుడెబల్లూర్ వెంకటగిరి 17,200 లకు లడ్డూను కైవసం చేసుకుంటున్నారు. స్వామివారి కలశాన్ని పొర్ల మహేష్ 3500లకు దక్కించుకోగా స్వామివారి పండ్లను రాందాస్ రాము 3000 లకు కైవసం చేసుకున్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ గావించారు. అనంతరం జరిగిన నిమజ్జన కార్యక్రమంలో, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణపతి బొప్పా మోరియా అంటూ నినాదాలు చేస్తూ గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం రిపోర్టర్ సురేష్, రాందాస్ అంజి, టైలర్ బాబురావు, రఘువేంద్ర చారి, తరుణ్ కుమార్, అశోక్ కుమార్, కార్తీక్, నాని, మల్లికార్జున్, జనార్ధన్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.


## ఎడ్ల బండిపై గణేష్ నిమజ్జనం



**ప్రజాపక్షం/దామరగిద్ద :** దామరగిద్ద మండలంలోని గడిముంకనపల్లి గ్రామంలో వినూత్న రీతిలో గ్రామ యువకులు ఎడ్ల బండిపై శ్రీ గణేష్ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం నిర్వహించారు. డీజేలు, వాహనాలకు బదులుగా సంప్రదాయ ఎడ్ల బండిని వినియోగించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామ వీధుల గుండా భక్తి శ్రద్ధలతో సాగిన ఊరేగింపులో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచు లాలప్ప, మాజీ సర్పంచు ఎస్.మొగులప్ప, లింగం గోపాల్, మాజీ ఎంపిటిసి పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గణనాథులకు గోలి ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని వివిధ కాలనీలలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఏడ్మ సత్యంతో కలిసి దర్శించుకుని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# బీచుపల్లి ఆయిల్ మిల్లులో ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్

- యూనిట్ ఏర్పాటుకు ఫ్యాక్టరీ లేఅవుట్ పరిశీలన
- త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి ప్రాసెసింగ్ యూనిట్ పనులు ప్రారంభం
- జిల్లా ఉద్యానశాఖ అధికారి రాజ్‌కుమార్



**ప్రజాపక్షం/గద్వాల్ రూరల్ :** జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం బీచుపల్లిలోని ఆయిల్ మిల్లులో ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సంబంధించి ఫ్యాక్టరీ లేఅవుట్‌ను ఖరారు చేసేందుకు టీజీ అయిల్‌ఫెడ్, హైదరాబాద్‌కు చెందిన సాంకేతిక బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు జిల్లా ఉద్యాన శాఖ అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. బుధవారం బీచుపల్లి ఆయిల్ మిల్లును టీజీ ఆయిల్‌ఫెడ్ కు చెందిన టి.సుధాకర్ రెడ్డి, జే.సత్యనారాయణ మేనేజర్ (మార్కెటింగ్), శ్రీకాంత్‌రెడ్డి మేనేజర్ (ప్లాంట్స్ అండ్ ప్రాజెక్ట్స్), ఆకుల బాలకృష్ణ, మేనేజర్ (టెక్నికల్) తదితరులతో కూడిన సాంకేతిక బృందం పూర్తిగా పరిశీలించినట్లు రాజ్ కుమార్ తెలిపారు. ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులు, యంత్రాల ఏర్పాటు, ఉత్పత్తి ప్రక్రియకు అనుగుణంగా ఫ్యాక్టరీలోని అనుగుణంగా తదుపరి పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సాంకేతిక బృందం తెలిపిందని రాజ్ కుమార్ వెల్లడించారు. ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సంబంధించిన టెండర్ ప్రక్రియను త్వరలోనే పూర్తి చేసి, ప్రాజెక్టు పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని సాంకేతిక బృందం తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ యూనిట్ అందుబాటులోకి రావడం ద్వారా జిల్లాలో అయిల్‌పామ్ సాగు విస్తరణకు మరింత ప్రోత్సాహం లభించడంతో పాటు రైతులక గెలల సేకరణ, తూకం, రవాణా, ప్రాసెసింగ్ సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని రాజ్ కుమార్ తెలిపారు. అనంత రం అయిజ మండలం వెంకటాపురం స్టేజి వద్ద ఏర్పాటు చేయనున్న ఆయిల్‌పామ్ గెలల సేకరణ కేంద్రాన్ని సాంకేతిక బృందం పరిశీలించినట్లు జిల్లా ఉద్యాన శాఖ అధికారి రాజ్ కుమార్ తెలిపారు కేంద్రంలో వెయ్‌బ్రిడ్జి, రైతు సేవా కేంద్రం తదితర సౌకర్యాలు ఏర్పాటు నిధులు, అనుమతులు మంజూరైనట్లు పేర్కొన్నారు. రైతులకు సులభతరంగా గెలల సేకరణ, తూకం, రవాణా సౌకర్యాలు కల్పించేలా పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేష్ సివిల్ ఇంజనీర్, టీజీ ఆయిల్‌ఫెడ్, ఉద్యాన శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేదలు, బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తున్న సర్పంచ్



**ప్రజాపక్షం/ వెల్దండ :** ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నా స్థానిక సర్పంచ్ మట్ట యాదమ్మవెంకటయ్యగౌడ్‌లపై స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నా రు. పదవీ ఉన్నా లేకపోయినా ప్రజల మధ్యనే ఉండాలనే ఆలోచనతో గ్రా మంలోని వాడవాడలా పర్యటిస్తూ ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. గ్రామంలో ఎక్కడ సమస్య తలెత్తినా, ఎవరికి ఇబ్బంది ఎదురైన వెంటనే స్పందిస్తూ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సాధ్యమైనంత త్వరగా పరిష్కారం లభించేలా చర్యలు చేపడుతున్నారని స్థానికులు తెలిపారు.ముఖ్యంగా పేద కుటుంబాలు, ఆపదలో ఉన్న వారు మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తూ మనవత దృక్పథంతో తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన దండుగుల నారయ్య అనారోగ్యంతో బాధపడుతూ మరణించిన విషయం తెలుసుకున్నా గ్రామ సర్పంచ్ మట్టయాదమ్మ వెంకటయ్యగౌడ్ బుధవారం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఆధైర్య పడకుండా, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మారేపల్లి శ్రీనివాస్, మట్ట భరత్, రేవల్లి దర్గయ్య, రేవల్లి బాలరాజు, కానుగులు వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నడిగడ్డ రైతులకు సాగునీటి అన్యాయం

డికె అరుణ, ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డిలపై గొంగళ్ల రంజిత్ కుమార్ ధ్వజం



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల్ :** జోగులాంబ గద్వాల్ జిల్లాలో టిఆర్ఎస్ నాయకుడు గొంగళ్ల రంజిత్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కృష్ణానది సాక్షిగా నడిగడ్డ ప్రాంతంలో పారుతున్న జలాలున్నా, స్థానిక రైతులకు సాగునీరు అందక పంటలు ఎండిపోతుండటానికి పాలమూరు ఎంపి డీకే అరుణ, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి నిర్లక్ష్యమే కారణమని టిఆర్ఎస్ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి గొంగళ్ల రంజిత్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం గద్వాలలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల ప్రాతిపదికన ఏర్పడిన తెలంగాణలో, వర్షాలు తగ్గుముఖం పట్టగానే నడిగడ్డ రైతాంగం తీవ్ర సాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో సుదీర్ఘకాలం మంత్రిగా పనిచేసిన డీకే అరుణ ఇక్కడి సాగునీటి ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేకపోయారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండు చేశారు. నియోజకవర్గ అభివృద్ధి పేరు చెప్పి పార్టీలు మారిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డికి, నేడు పంటలు ఎండిపోతూ రైతులు పడుతున్న గోస ఏమాత్రం పట్టకపోవడం దారుణమన్నారు. నడిగడ్డ ప్రాంతంలో పెండింగులో ఉన్న రిజర్వాయర్లు, కాలువలు, డిస్ట్రిబ్యూటరీ పనులను తక్షణమే పూర్తి చేయడానికి ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు బుచ్చిబాబు, ప్రేమరాజు, మల్దకల్ తదితరులు పాల్గొన్నారు.

## గడువులోగా 'సర్' ప్రక్రియ పూర్తి చేయాలి

అదనపు కలెక్టర్ జెఎల్‌బి హరిప్రియ



**ప్రజాపక్షం/జడ్చర్ల :** రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష 75జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ 2026 ప్రక్రియను నిర్ణీత గడువులోగా పారదర్శకంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జెఎల్‌బి హరిప్రియ అధికారులను ఆదేశించారు. బుధవారం జడ్చర్ల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఇఆర్ఒ), రెవెన్యూ అదనపు అదనపు కలెక్టర్ జెఎల్‌బి హరిప్రియ జడ్చర్ల తాహసీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ 2026 ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసుల పంపిణీ, విచారణల పురోగతిని సమీక్షించారు. నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు 93.59 శాతం నోటీసుల పంపిణీ, 45.33 శాతం విచారణలు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన విచారణలను నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అదే విధంగా ఎఇఆర్ఒ లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్న ఫారం6 (కొత్త ఓటరు నమోదు), ఫారం 7 (ఓటరు తొలగింపు), ఫారం8 (ఓటరు వివరాల సవరణ) దరఖాస్తులను పరిశీలించి, నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్2026 ప్రక్రియకు సంబంధించి ఏవైనా సమస్యలు లేదా అభ్యంతరాలు ఉంటే రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఓటర్లకు అవసరమైన అవగాహన కల్పించి, విచారణలకు వారు హాజరయ్యేలా సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో జడ్చర్ల తాహసీల్దార్/ఏఇఆర్ఓ నర్సింగరావు, అదనపు తాహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ తాహసీల్దార్ (ఎం), ఎన్నికల డీటీ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌ను వేగవంతం చేయాలి

అదనపు కలెక్టర్ బి.చెన్నయ్య

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** జిల్లాలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ బి.చెన్నయ్య సూచించారు. కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఇప్పటివరకు 96,911 మంది ఓటర్లకు హియరింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఇంకా 18,700 మంది ఓటర్లు హియరింగ్ కు హాజరు కావాల్సి ఉందన్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత సమయంలో హియరింగ్ కు హాజరయ్యేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. అర్హులైన పట్టభద్రులు ఫారం 18 ద్వారా ఓటర్లుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన ఓటర్లు ఎవరూ జాబితాలో తప్పిపోకుండా అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీ ల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.





## ఇబ్రహీంపేటలో 'అందర్-బహార్' పేకాట స్థావరంపై పోలీసులదాడి

### 9మంది అరెస్ట్..రూ.8,100 నగదు,52 పేకముక్కలు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం

**ప్రజాపక్షం/హాలియా:** మండల పరిధిలోని ఇబ్రహీంపేట గ్రామంలో డబ్బులు పందెంగా పెట్టి అందర్‌బహార్ పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని హాలియా పోలీసులు పట్టుకున్నారు.వారి వద్ద నుంచి పేకాటకు వినియోగిస్తున్న 52 పేకముక్కలు, పందెం డబ్బులుగా ఉన్న రూ.8,100 నగదు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సాయి ప్రశాంత్ తెలిపారు. వివరాల ప్రకారం సెప్టెంబర్ 23న ఇబ్రహీంపేట గ్రామంలోని విశ్వనాధుల వెంకటాచారి ఇంటి ఆవరణలో కొంతమంది వ్యక్తులు డబ్బులను పందెంగా పెట్టి అందర్‌బహార్ పేకాట ఆడుతున్నట్లు హాలియా పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది.సమాచారం మేరకు హాలియా ఎస్ఐ బి.సాయి ప్రశాంత్ తన సిబ్బందితో కలిసి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని దాడి నిర్వహించారు.పోలీసులను గమనించిన పేకాట నిర్వాహకులు,ఆటగాళ్ళ అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని వెంబడించి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుంచి పేకముక్కలు,నగదు,సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.పాతనబోయిన సైదులు,అనుముల మధు,చాపల మహేష్ ,వజ్జ యాదయ్య ,విశ్వనాధుల సైదాచారి,కంభంపాటి సైదులు,నాగిళ్ల ఆంజనేయులు,ఈగల ప్రశాంత్,అనుముల దుర్గయ్యలు పట్టుబడిన్నటు పోలీసులు తెలిపారు.ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తదుపరి చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయి.

**పేకాట, జూదానికి దూరంగా ఉండాలి**

పేకాట,జూదం,బెట్టింగ్ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు ప్రజలు దూరంగా ఉండాలని హాలియా పోలీసులు సూచించారు. తమ పరిసర ప్రాంతాల్లో ఇటువంటి కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సాయి ప్రశాంత్ హెచ్చరించారు.

## న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని న్యాయవాదులు ధర్నా




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** న్యాయవాదులకు రిటైర్మెంట్,డెత్ బెనిఫిట్ రూ.25 లక్షలు ఇవ్వాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి అనంతుల శంకరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కోర్టు ఎదుట న్యాయవాదులు ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా శంకరయ్య మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమం కోసం రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు న్యాయవాదుల ప్రధాన డిమాండ్ల సాధన కోసం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.కేంద్ర న్యాయవాదుల సంక్షేమ నిధి చట్టం2001ను సవరించి,న్యాయవాదుల మరణం లేదా పదవీ విరమణ సందర్భంలో రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.న్యాయవాదులకు వైద్య సహాయంగా రూ.5 లక్షలు, జూనియర్ న్యాయవాదులకు కనీసం ఐదు సంవత్సరాల పాటు నెలకు రూ.10 వేల స్టైపెండ్ మంజూరు చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్ష కార్యదర్శులు ఏ.సతీష్ కుమార్,బి.అశోక్ కుమార్,సీనియర్ న్యాయవాదులు జి.వెంకటేశ్వర్లు,పి.శ్రీనివాస్ రెడ్డి,ఐలు జిల్లా నాయకులు పి.బ్రహ్మచారి,సత్తయ్య,యాదయ్య,వంశీకృష్ణ, నాగిరెడ్డి, దుర్గాప్రసాద్, సింగం శ్రీనివాస్, ఠాగూ ర్, సత్తయ్య, లాలయ్య, రాములు పాల్గొన్నారు.

## సకాలంలో రుణాలు చెల్లించి అభివృద్ధికి తోడ్పాటు అందించాలి



పిఏసిఎస్ చైర్మన్ యాస లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** రైతులు,వ్యాపారులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో తీసుకున్న పంట రుణాలు,ఇతర రుణాలు చెల్లించి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి తోడ్పడాలని పిఏసిఎస్ చైర్మన్ యాస లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం సంఘ కార్యాలయంలో 51వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సకాలంలో రుణాలు చెల్లించి సంఘ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. లింగరాజుపల్లి గ్రామంలో సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన పెట్రోల్ బంకును నెలరోజుల్లోపు ప్రారంభిస్తామని తెలిపారు. సర్వేపల్లి గ్రామంలో 8000 మెట్రి టన్నుల ధాన్య నిల్వకు గోదాం నిర్మించడానికి 5 కోట్ల మంజూరయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ ,సీఈఓ యాస కిరణ్ రెడ్డి డైరెక్టర్ లు పోతగాని మల్లేశంగౌడ్, శ్రీరాముల భావనరుషి, హరిబాబు భాషబోయిన సత్యనారాయణ,జెట్ట ధనుంజయ,బీసు వెంకటయ్య,బాలయ్య, నర్సింహా సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు కల్వకుంట్ల ఉపేందర్ రెడ్డి,సర్పంచ్ లు సోలిపురం యల్లారెడ్డి,ఆంజయా, శ్రీనివాస్,అఖిల పక్ష నాయకులు కందటి అనంతరెడ్డి,దిగోజు నర్సింహా చారి, సిద్దులు గౌడ్, హన్మంత్ గౌడ్,దశరథ రెడ్డి,సత్తిరెడ్డి,లాల్ రెడ్డి ఆత్మకూర్ ఉపసర్పంచ్ మజ్జిగ నరేష్, దొంతరబోయిన భాస్కర్,ఎండీ యూసుబ్, రైతు లు తదితరులు పాల్గొన్నారు.

# గణనాథుడికి వీడ్కోలు : భక్తిశ్రద్ధలతో సాగిన శోభాయాత్ర

- డప్పు చప్పుళ్లు..కోలాట నృత్యాలు..బ్యాండ్ మేళాలతో వీధుల్లో సందడి
- జిల్లా కేంద్రంలోని హనుమాన్‌నగర్‌లో ఒకటో నంబర్ వినాయక విగ్రహం వద్ద శోభాయాత్రను ప్రారంభించిన కలెక్టర్ బి.చంద్రశేఖర్







**ప్రజాపక్షం/నల్లగొండ:** వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో గణేశుని శోభాయాత్ర ఉత్సాహపూరిత వాతావరణంలో ఘనంగా ప్రారంభమైంది.డప్పు చప్పుళ్లు,కోలాట నృత్యాలు,బ్యాండ్ మేళాలు,భక్తుల జైజై నినాదాలతో ప్రధాన వీధులు సందడిగా మారాయి.భక్తులు పెద్ద సంఖ్యలో శోభాయాత్రలో పాల్గొని గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు.నల్లగొండ జిల్లా కేంద్రంలోని హనుమాన్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఒకటో నంబర్ వినాయక విగ్రహం వద్ద జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించి శోభాయాత్రను ప్రారంభించారు. అనంతరం వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా నిమజ్జన ప్రదేశానికి తరలించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో గణేశుని నామస్మరణ చేస్తూ శోభాయాత్రను ముందుకు సాగించారు.

**6 వేలకుపైగా వినాయక విగ్రహాలు**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నల్లగొండ మేయర్,ఇతర ప్రజాప్రతినిధుల సూచనల మేరకు జిల్లాలో వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 6 వేల వినాయక విగ్రహాలు ఉన్నాయని చెప్పారు.గత ఐదు రోజులుగా వివిధ ప్రాంతాల నుంచి నిమజ్జన ప్రదేశాలకు వినాయక విగ్రహాలు తరలివస్తున్నాయని,బుధవారం నుంచి శుక్రవారం వరకు మరో 2 వేల విగ్రహాలు నిమజ్జనం అయ్యే అవకాశం ఉందని తెలిపారు.శోభాయాత్ర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు.

**నిమజ్జన ప్రదేశాల్లో ప్రత్యేక ఏర్పాట్లు**

శాంతి కమిటీలు,గణేష్ ఉత్సవ కమిటీల సహకారంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.అన్ని నిమజ్జన ప్రదేశాల వద్ద వైద్య బృందాలతో పాటు రెవెన్యూ,పోలీసు,ఇతర శాఖల అధికారులు,సిబ్బందిని అందుబాటులో ఉంచారు.భక్తులందరూ భక్తిశ్రద్ధలతో శోభాయాత్రలో పాల్గొని,శాంతియుత వాతావరణంలోఉత్సవాలను విజయవంతం జరిగింది.

**8 నిమజ్జన ప్రదేశాల్లో భద్రత**


జిల్లా ఎస్‌పి శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ బుధవారం ఒక్కరోజే జిల్లాలోని 8 నిమజ్జన ప్రదేశాల్లో సుమారు 2 వేల వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగే అవకాశం ఉందని తెలిపారు.గణేశుని శోభాయాత్ర,విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు.శోభాయాత్ర శాంతియుత వాతావరణంలో కొనసాగేందుకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.నిమజ్జన ప్రదేశాల వద్ద భద్రతా చర్యలు చేపట్టామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. 14 మైలురాయి వద్ద నీరు అందుబాటులో ఉందని, వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బంది లేదని ఎస్పీ తెలిపారు.

**భక్తులతో కిక్కిరిసిన ప్రధాన వీధులు**

కలెక్టర్ ప్రారంభించిన తొలి వినాయక విగ్రహ శోభాయాత్రతో నల్లగొండ జిల్లా కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది.డప్పు చప్పుళ్లు, బ్యాండ్ మేళాలు, కోలాట బృందాల నృత్యాలు,భక్తుల నినాదాలతో ప్రధాన వీధులు మార్మోగాయి. యువత,మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో శోభాయాత్రలో పాల్గొన్నారు. పలుచోట్ల భక్తులు గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి,పూలతో స్వాగతం పలికారు.గణేశుని విగ్రహాలను నిమజ్జన ప్రదేశాలకు తరలించే క్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో నిమజ్జన కార్యక్రమాలను పర్యవేక్షించారు.కార్యక్రమంలో నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, అదనపు ఎస్‌పి రమేష్, నల్లగొండ ఆర్‌డిఓ వై. అశోక్ రెడ్డి,గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు,ఇతర ప్రజాప్రతినిధులు,వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చౌటుప్పల్ దర్బార్‌బార్‌లో సంచలన చోరీ

- రూ.3లక్షలు దోచుకెళ్లిన దుండగులు
- కిచెన్ నుంచి ప్రవేశించిన గుర్తుతెలియని దుండగులు
- ఆధారాలు లేకుండా చేయడానికి డివిఆర్‌తో పరార్
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు




**ప్రజాపక్షం/చౌటుప్పల్:** చౌటుప్పల్ పట్టణంలోని వలిగొండ క్రాస్‌రోడ్డు వద్ద హైవేపై ఉన్న దర్బార్ బార్ అండ్ రెస్టారెంట్‌లో మంగళవారం అర్ధరాత్రి సంచలన చోరీ జరిగింది.చోరీ జరిగిన తీరు చూస్తే గుర్తుతెలియని దుండగులు పక్కా ప్రణాళికతో దొంగతనానికి పాల్పడ్డట్లు తెలుస్తుంది.బార్ కౌంటర్‌లో ఉన్న రూ.1,50లక్షలతో పాటు ఆఫీస్ రూం బీరువాలో ఉన్న రూ.2లక్షల నగదును ఎత్తుకెళ్ళినట్లు సమాచారం.నేరం బయటపడకుండా ఉండేందుకు సీసీ కెమెరాలను ధ్వంసం చేసి,హర్డ్ డిస్క్‌ను కూడా ఎత్తుకెళ్ళారు.

**అర్ధరాత్రి పక్కా స్కేచ్....**

పోలీసులు,బార్ యాజమాన్యం తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రాత్రి బార్ సమయం ముగిసిన తర్వాత బార్‌లో పనిచేసే సిబ్బంది బార్‌కు తాళం వేసి వెళ్ళిపోయారు.అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు.బార్ వెనక వైపు ఉన్న కిచెన్ డోర్‌లను ధ్వంసం చేసి బార్‌లోకి ప్రవేశించారు.ముందుగా అక్కడ ఉన్న సిసి కెమరాలను ధ్వంసం చేసినట్లు పోలీసులు గుర్తించారు.ఆ తర్వాత బార్ కౌంటర్‌లోకి వెళ్ళి కౌంటర్‌లో ఉన్న నగదుతో పాటు రూంలో బీరువాలో ఉన్న నగదును దొంగిలించారు.ఆ తర్వాత సిసి ఫుటేజ్ రికార్డు అయ్యే డివిఆర్‌లోని హర్డ్‌డిస్క్‌ను పీకి ఎత్తుకుని పరారయ్యారు.ముందస్తుగా బార్ పరిసరా ప్రాంతాలలో రెక్కి నిర్వహించి అర్ధరాత్రి చోరీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

**-క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించిన పోలీసులు...**

బుధవారం ఉదయం బార్ సిబ్బంది వచ్చి యదావిధిగా బార్‌ను తెరిచారు.బార్ కౌంటర్‌లో వస్తువులు చిందరవందరగా ఉండడంతో లోపలికి వెళ్ళి చూడగా కిచెన్ డోర్ పగులగొట్టి ఉంది.దీంతో దొంగతనం జరిగిందని భావించి బార్ యాజమాన్యానికి సమాచారం ఇచ్చారు.వెంటనే యాజమాన్యం చౌటుప్పల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సిఐ మన్మథకుమార్,ఎస్సైలు కె.యాదగిరి,అజయ్‌భార్గవ్ లు తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు.అనంతరం క్లూస్‌టీం ను రప్పించి కిచెన్‌తో పాటు బార్‌లో పలు చోట్ల ఉన్న దుండగుల పాదముద్రలు,వేలిముద్రలు సేకరించారు.దొంగతనానికి పాల్పడిన ముఠా ప్రొఫెషనల్ ముఠా అయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ మన్మథకుమార్ తెలిపారు.




## డిజిటల్ చెల్లింపులపై రుసుముల భారం తగదు

### యాదగిరిగుట్టలో ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో బృహత్ సంతకాల సేకరణ

### చిన్న వ్యాపారులు, యువత ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట:** దేశంలో సామాన్య ప్రజలు, యువత, విద్యార్థులు, కార్మికులు మరియు చిన్న వ్యాపారుల రోజువారీ జీవితంలో భాగమైన ఏకీకృత చెల్లింపుల వ్యవస్థ (యూపీఐ)పై కొత్తగా ప్రకటించిన వ్యాపారి రుసుముల (ఎండిఆర్) భారాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) డిమాండ్ చేసింది. యూపీఐ చార్జీలను నిరసిస్తూ బుధవారం యాదగిరిగుట్టలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో వినూత్నంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ పేరబోయిన మహేందర్ మాట్లాడుతూ డిజిటల్ ఇండియా పేరుతో ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన విధానం ప్రకారం రూ.2,000కు మించిన వ్యక్తి వ్యాపారి లావాదేవీలపై 0.4 శాతం వ్యాపారి రుసుము, అలాగే రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువ లావాదేవీలపై గరిష్ఠంగా రూ.300 వరకు వర్తింపజేయడం దారుణమన్నారు.

వ్యక్తిగత లావాదేవీలు , రూ.2,000 లోపు వ్యాపారి లావాదేవీలు ఉచితంగానే కొనసాగుతాయని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఈ రుసుముల విధానం భవిష్యత్తులో చిన్న వ్యాపారులు, స్వయం ఉపాధి పొందుతున్న యువతపై తీవ్ర ఆర్థిక ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం నుండి స్పష్టమైన హామీ, పారదర్శకత అవసరమని స్పష్టం చేశారు. సుమారు 96 శాతం లావాదేవీలపై ప్రభావం ఉండదని ప్రభుత్వం పేర్కొన్నప్పటికీ, మిగిలిన లావాదేవీలపై రుసుము విధించే విధానాన్ని ప్రజా ప్రయోజనాల కోణంలో పునఃసమీక్షించాలని కోరారు. అనే నినాదంతో అందరికీ అందుబాటులో ఉండే డిజిటల్ చెల్లింపు వ్యవస్థ కోసం ప్రజా చర్చను ముందుకు తీసుకెళ్తామని ఏఐవైఎఫ్ పిలుపునిచ్చింది.

ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి, కౌన్సిలర్ బబ్బూరి శ్రీధర్, సహాయ కార్యదర్శి పేరబోయిన బంగారు, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి కంబాల వెంకటేష్, నాయకులు ఆనంతుల నర్సింహా, శెట్టి నర్సింహా, సంగి అరవింద్, బండ రామచందర్, ఒంటెద్దు సంజీవ, పేరబోయిన సత్యనారాయణ, ప్రశాంత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డ లయన్స్ క్లబ్ ఐ హాస్పటల్‌లో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ రోజు నాటిన మొక్కలే రేపటి భవిష్యత్తు తరానికి జీవనాధారాన్ని అందిస్తాయన్నారు. పర్యావరణ పరిరక్షణలో లయన్స్‌క్లబ్ ఐ హాస్పటల్ చేతులు కలుపుతూ మార్పుకు మనమే నాంది పలుకుదామన్నారు. రేపటి నుండి వివిధ హోటల్స్‌లో ప్లాస్టిక్ వస్తువుల వాడకాలను నిర్మూలించాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఐ హాస్పటల్ చైర్మన్ మీలా మహదేవ్, గవర్నర్ గుడిపూడి వెంకటేశ్వరరావు, సెక్రటరీ పెండెం చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీ మిర్యాల సుధాకర్, మిర్యాల వెంకటేశ్వర్లు, పెద్దిరెడ్డి గణేష్, మొరిశెట్టి లక్షాది, కౌన్సిలర్లు కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కొండపల్లి దిలీప్ రెడ్డి, ఎలిమినేటి అభినయ్ పాల్గొన్నారు.

# నీటిని పొదుపుగా వాడుకోవాలి


- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి
- మేడారం గ్రామంలో రూ.26.93 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** మండలంలోని మేడారం గ్రామంలో రూ.26.93 కోట్లతో నిర్మించిన అభివృద్ధి పనులను బుధవారం రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. రూ.26.93 కోట్ల వ్యయంతో నిర్మించిన నేరేడుచర్లదూపాడు రోడ్డును, జానలదిన్నె గ్రామంలో 20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని, నేరేడుచర్ల పట్టణంలో 33 లక్షలతో నిర్మించిన గ్రంధాలయ భవనాన్ని శిలఫలకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణం పూర్తవడం ద్వారా నేరేడుచర్ల పరిసర గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయని అన్నారు. రైతులు ట్రాక్టర్ ఫుల్‌వీల్స్‌తో రోడ్డుపైకి వచ్చి రోడ్డును ధ్వంసం చేయకూడదని హెచ్చరించారు. విద్యార్థులు, యువతతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు గ్రంధాలయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. మండల అభివృద్ధికి మరింత కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షభావ పరిస్థితులు నెలకొన్న వేళ రైతులకు భరోసా కల్పించాల్సిన ప్రధాన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక సాగర్ నిండక ఇబ్బందులు పడుతుంటే ప్రతిపక్ష పార్టీలు అనవసర రాద్ధాంతాలు చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో అనేది తెలంగాణలో పుట్టిన పదం కాదు, ప్రపంచ వ్యాప్తంగా వాతావరణాన్ని ప్రభావితం చేసే శాస్త్రీయ పరిణామం అని అన్నారు. జలశాయాల్లో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తూ ఉన్న నీటిని పంటలను కాపాడటం, రాబోయే వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చూడటం కోసం ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో పనిచేస్తుందన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి డికె శివకుమార్‌తో మంతనాలు జరిపినట్లు ఉత్తమ్ వెల్లడించారు. తనకున్న వ్యక్తిగత స్నేహాన్ని తెలంగాణ రైతుల ప్రయోజనాల కోసం వినియోగించానని చెప్పారు. సాగు చేసిన పంటలను ఎట్టి పరిస్థితుల్లో నూ ఆనాధలుగా వదిలిపెట్టామని, రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, జి ల్లా ఎస్‌పి కె.నర్సింహా, మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి, వైస్ చైర్మన్ నూకల సందీప్‌రెడ్డి, ఆర్డీవో శ్రీనివాసులు, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు,మేడారం సర్పంచ్ సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నల్లగొండ– వరంగల్– ఖమ్మం పట్టభద్రుల బరిలో 'లోకేశ్ యాదవ్?'

### పిసిసి అధికార ప్రతినిధి లోకేష్ యాదవ్ పేరును ప్రముఖంగా పరిశీలన చేస్తున్న అధిష్టానం



**ప్రజాపక్షం/యాదాద్రి:** రాష్ట్రంలో త్వరలో జరగనున్న నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వేడి అప్పుడే ప్రారంభమైంది. మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలోని గ్రాడ్యుయేట్ స్థానంపై ప్రధాన రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. కాంగ్రెస్ పార్టీలో ఈ స్థానానికి సంబంధించి అభ్యర్థిత్వాల ఎంపికపై కసరత్తు ముమ్మరంగా సాగుతుండగా ఖమ్మం జిల్లా వైరా మండలానికి చెందిన టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ జి. లోకేశ్ యాదవ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. సుదీర్ఘ కాలంగా పార్టీ కోసం పనిచేస్తూ విద్యార్థి, యువజన ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్న ఆయనకు అభ్యర్థిత్వం ఖరారయ్యే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

**ఒయు జెఎసి నుంచి ఉద్యమ పోరాటాలు..**

ఉస్మానియా విశ్వవిద్యాలయం వేదికగా తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడిన రోజుల్లో లోకేశ్ యాదవ్ కీలక పాత్ర పోషించారు. ఒయు జెఎసి అధ్యక్షుడిగా విద్యార్థులను సమన్వయం చేస్తూ నిరసనలు, పాదయాత్రలు, సైకిల్ యా త్రలు, బస్సు యాత్రల రూపంలో తెలంగాణ ఉద్యమాన్ని ఉధృతం చేశారు. ఉద్యమ సమయంలో ఆయనపై పలు కేసులు నమోదవడమే కాకుండా, జైలు జీవితాన్ని కూడా అనుభవించారు. ఓయూలోనే ఎంఎ, పీహెచ్‌డి పూర్తి చేసి ఉన్నత విద్యాభ్యాసం కలిగిన నాయకుడిగా గుర్తింపు పొందారు.

**పాతికేళ్ల విశ్వసనీయత.. పదవుల కంటే పార్టీకే పెద్దపీట**

గడిచిన 26 ఏళ్లుగా కాంగ్రెస్ అనుబంధ సంస్థలైన ఎన్ఎస్యూఐ, యూత్ కాంగ్రెస్ నుండి ప్రారంభించి టిపిసిసి జాయింట్ సెక్రటరీ, సెక్రటరీ, అధికార ప్రతినిధి వరకు పలు పదవుల్లో పనిచేశారు. తెలంగాణ వచ్చిన తర్వాత గతంలో ఖమ్మం అసెంబ్లీ స్థానం నుండి పోటీ చేసే అవకాశం వచ్చినా, పార్టీ సిద్ధాంతాలకే కట్టుబడి కాంగ్రెస్‌లోనే కొనసాగారు. పదేళ్ల ప్రతిపక్ష హోదాలో నిరుద్యోగ సమస్యలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగ నియామకాలు, గ్రూప్స్ పరీక్షల నిర్వహణ, పేపర్ లీకేజీల అంశాలపై పోరాటాలు నిర్వహించారు. ఈ క్రమంలో జరిగిన ఆందోళన కార్యక్రమాల్లో పలు కేసులు నమోదు కాగా జైలు జీవితాన్ని కూడా అనుభవించి కాంగ్రెస్ పార్టీకి నిబద్ధత గల సైనికుడిగా పని చేశారు.

ప్రస్తుతం మధిర, వైరా నియోజకవర్గాల కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్న లోకేశ్ యాదవ్, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క ఆనాటి సీఎల్‌పి నేతగా చేపట్టిన 1,360 కిలోమీటర్ల సుదీర్ఘ 'పీపుల్స్ మార్చ్' పాదయాత్రలో ప్రారం టభం నుండి ముగింపు వరకు (4 నెలల పాటు) భాగస్వామ్యమయ్యారు. అధిష్ఠానంతో పాటు సీనియర్ నేతలతో మంచి సంబంధాలు కలిగిన ఈ యువ నేతకు పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యలపై స్పష్టమైన అవగాహన ఉంది. మరో వైపు ఉమ్మడి ఖమ్మం జిల్లాల వ్యాప్తంగా బిసి వర్గాలకు దక్కాల్సిన ప్రాతినిధ్యంపై చర్చ జరుగుతుండటంతో, యాదవ సామాజిక వర్గానికి చెందిన లోకేశ్ యాదవ్ అభ్యర్థిత్వానికి బీసీ సమీకరణలు కూడా కలిసివచ్చే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు.

**ఉత్కంఠగా కాంగ్రెస్ నిర్ణయం..**

ఇప్పటికే సెప్టెంబర్ 5న మూడు ఉమ్మడి జిల్లాల ముఖ్య నాయకులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమావేశమై ఎన్నికల వ్యూహం, అభ్యర్థుల ఎంపికపై చర్చించారు. కాంగ్రెస్ పరిశీలనలో పలువురి పేర్లు ఉన్నప్పటికీ.. ఉద్యమ నేపథ్యం, విద్యార్హతలు, పార్టీ విశ్వసనీయత, బీసీ వర్గానికి చెందిన అభ్యర్థి కావడం లోకేష్ యాదవ్కు ప్రధాన సానుకూల అంశాలుగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే జనసేన పార్టీ డాక్టర్ గడల శ్రీనివాసరావును బరిలోకి దించగా, కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించే అధికారిక నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# గడువులోగా 'సర్' పెండింగ్ ప్రక్రియ పూర్తి

### రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశం






**ప్రజాపక్షం/రంగారెడ్డి:** క్షేత్రస్థాయిలో పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, ప్రతి దరఖాస్తు, అభ్యంతరం, నోటీసు, ఫైల్ డిస్పోజల్ వివరాలను రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. బుధవారం రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ సి.నారాయణ రెడ్డి,ఎల్‌బినగర్ ఇఆర్ఓ అండ్ జోనల్ కమిషనర్ వికాస్ మహ తో కలిసి నాగోల్ వార్డు కార్యాలయం,కుర్మి కాలనీ,శాతవాహన నగర్ కమ్యూనిటీ హాల్‌లను సందర్శించి క్షేత్రస్థాయిలో సర్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా సిఇఒ మాట్లాడుతూ..సర్ 2026 ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా,పూర్తి పారదర్శకతతో,ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని తెలిపారు. ఓటర్ల వివరాల పరిశీలన, పాత ఓటర్ల జాబితాలతో మ్యాపింగ్,నో మాపింగ్,అనామలీస్ వంటి కేటగిరీలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరు కూడా అనవసరంగా జాబితా నుంచి తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అదే సమయంలో అనర్హులు,డూప్లికేట్ ఎంట్రీలు,చిరునామా మార్పులు తదితర అంశాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, ప్రతి దరఖాస్తు, అభ్యంతరం, నోటీసు, ఫైల్ డిస్పోజల్ వివరాలను రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయాలని పేర్కొన్నారు.అవసరమైన సందర్భాల్లో సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేసి, వారి అభ్యంతరాలు, వివరణలను నిబంధనల ప్రకారం పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ప్రతి బిఎల్ ఒ,క్షేత్రస్థాయి సిబ్బంది తమ పరిధిలోని ఓటర్ల వివరాలను బాధ్యతాయుతంగా పరిశీలించాలని సిఇఒ ఆదేశించారు.అడితేకాకుండా డోర్‌టుడోర్ వెరిఫికేషన్, డాక్యుమెంట్ల పరిశీలన,డేటా ఎంట్రీ,మ్యాపింగ్ తదితర ప్రక్రియల్లో ఖచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సర్ ప్రక్రియలో ఎదురయ్యే సాంకేతిక లేదా క్షేత్రస్థాయి సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి దశను సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. నిర్దేశిత కాలపరిమితిలో ప్రక్రియను పూర్తి చేసేందుకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. సంబంధిత ఎన్నికల అధికారులు, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

## గమ్యస్థానాలకు సురక్షితంగా, సౌకర్యవంతంగా

# చేరుకునేలా మెట్రో కారిడార్




### ప్రత్యేక ప్రధానకార్యదర్శి జయేష్ రంజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జెఎన్‌టియు మియాపూర్ రాయదుర్గం మెట్రో కారిడార్‌లోలో ట్రాఫిక్ మొబిలిటీ, లాస్ట్‌మైల్ కనెక్టివిటీ అంశాలపై ప్రత్యేక ప్రధానకార్యదర్శి జయేష్ రంజన్ అధ్యక్షతన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) ప్రధాన కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో సిఎంసి కమిషనర్ సృజన, ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డి, సైబరాబాద్ సిపి రమేష్, సైబరాబాద్ జాయింట్ పోలీస్ కమిషనర్(ట్రాఫిక్), సైబరాబాద్ జోనల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిపాదిత ట్రాఫిక్ మొబిలిటీ, లాస్ట్ మైల్ కనెక్టివిటీ స్టడీపై సమీక్షించారు. మెట్రోస్టేషన్ల నుంచి ప్రయాణికు లు, పాదచారులు, విద్యార్థులు తమ గమ్యస్థానాలకు సురక్షితంగా, సౌకర్యవంతంగా చేరుకునేలా కారిడార్‌లో సమగ్ర మొబిలిటీ వ్యవస్థను అభివృద్ధి చేయడంపై చర్చించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. నిరంతర ఫుట్‌పాత్ కనెక్టివిటీ సుమారు 8.5 కి.మీ. కారిడార్లో ఫుట్‌పాత్‌కు సంబంధించిన మిస్సింగ్ లింకులు, పాదచారుల క్రాసింగ్లు, ఆక్రమణలు, సురక్షితం కాని ప్రాంతాలను గుర్తించి అవసరమైన మెరుగుదలలను పరిశీలించాలని నిర్ణయించారు. అలాగే మెట్రో స్టేషన్లు, ప్రధాన జంక్షన్ల వద్ద ప్రత్యేక పికప్ డ్రాప్ పాయింట్లు, ఫీడర్ ఆటో స్టాండ్ల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను గుర్తించాలని, ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలు, ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రదేశాలు, పాదచారుల క్రాసింగ్‌లను,, సైన్‌బోర్డులను, బారికేడింగ్, ట్రాఫిక్ నియంత్రణ అవసరాలను సమీక్షించారు.

## 'యుపిఐ'తో వ్యాపారులపై భారం

### టిపిసిసి అధికార ప్రతినిధి సయ్యద్ నిజాముద్దీన్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అధిక విలువైన యుపిఐ లావాదేవీలపై విధించనున్న మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండిఆర్) భారం చివరకు హోల్‌సేల్ నుంచి రిటైల్ వరకు సరఫరా గొలుసుపై ప్రభావం చూపి వస్తువుల ధరల పెరుగుదలకు దారితీసే అవకాశం ఉందని టిపిసిసి అధికార ప్రతినిధి సయ్యద్ నిజాముద్దీన్ అన్నారు. ఎండిఆర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 15 నుంచి రూ.2 వేలకుపైగా అర్హత కలిగిన యూపీఐ వ్యాపారి చెల్లింపులపై 0.4 శాతం ఎండిఆర్ అమలవుతుందని తెలిపారు. ఒక్కో లావాదేవీపై గరిష్ఠంగా రూ.300వరకు ఛార్జీ ఉంటుందని చెప్పారు. వ్యాపారి అదనపు ఖర్చును భరించాల్సి వస్తే మార్జిన్లు తగ్గించడం, డిస్కౌంట్లు తగ్గించడం లేదా ధరలు పెంచడం వంటి మార్గాలను అనుసరించాల్సి వస్తుందన్నారు. బేగంబజార్, లాడ్‌బజార్, పాతర్‌ఘట్టి వంటి వాణిజ్య ప్రాంతాల్లో అధిక విలువైన లావాదేవీలు ఎక్కువగా ఉండటంతో ప్రభావం కనిపించే అవకాశం ఉందన్నారు. నెలకు రూ.లక్ష యూపీఐ రసీదుల పరిమితిని కూడా పునః పరిశీలించాలని కోరారు. 96శాతం లావాదేవీలు ప్రభావితం కావని చెబుతున్న కేంద్రం.. మిగిలిన లావాదేవీలు మొత్తం వ్యాపారి చెల్లింపుల విలువలో ఎంత వాటా కలిగి ఉన్నాయో వెల్లడించాలని నిజాముద్దీన్ డిమాండ్ చేశారు.

## ఆరోగ్య సేవల్లో అలసత్వం వద్దు

### అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అన్ని స్థాయిలోని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి సూచించారు. బుధవారం రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో స్థానిక డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ డి.స్వర్ణ కుమారితో కలిసి డిప్యూటీ డిఎంహెచ్ఒలు, ప్రోగ్రాం ఆఫీసర్లు, మెడికల్ ఆఫీసర్లతో శాఖ కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలని అధికారులు ఆదేశించారు. ఆసుపత్రుల్లో సిబ్బంది రోస్టర్ ప్రకారం విధులు నిర్వహించేలా పర్యవేక్షించాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత పటిష్టం చేసి,వైద్య సేవల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. అదేవిధంగా జూనియర్ వైద్యులు, సిబ్బందికి విధుల నిర్వహణలో ఎదురయ్యే సందేహాలను అధికారులు ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని సూచించారు. జిల్లాలో అమలవుతున్న అన్ని ఆరోగ్య కార్యక్రమాల్లో రంగారెడ్డి జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే, సహకరించని ఉద్యోగులపై నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు అందాల్సిన వైద్య సేవలు సక్రమంగా అందేలా ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ డిఎంహెచ్ఒలు, ప్రోగ్రాంఆఫీసర్లు, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## గ్రామాల సమగ్రాభివృద్ధికి పక్కా ప్రణాళికలు

### వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికల రూపకల్పనకు శిక్షణ



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి అవసరమైన వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలు (వికసిత్ గ్రామ పంచాయతీ ప్లాన్స్ (విజిపిపి ) 2026–27 రూపకల్పనపై అధికారులు,ప్రజాప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.అక్టోబర్ 2026 నుంచి జూన్ 2027 వరకు గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలను రూపొందించే విధానంపై అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, మంచాల్, యాచారం, మాడ్గుల్, శంషాబాద్, మహేశ్వరం, కందుకూరు, ఆమనగల్, తలకొండపల్లి, కడ్తాల్ మండలాలకు చెందిన మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపిడిఒలు), ప్రోగ్రాం అధికారులు, సర్పంచులు, అదనపు ప్రోగ్రాం అధికారులు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు (ఇసి), టెక్నికల్ అసిస్టెంట్లు, ఎంజైరేగ్స్ ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులకు శిక్షణ అందించారు. గ్రామాల అవసరాలను గుర్తించి, అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రణాళికలను రూపొందించాలని ఈ సందర్భంగా సూచించారు. గ్రామీణ మౌలిక వసతులు, ఉపాధి, పారిశుధ్యం, తాగునీరు, విద్య, ఆరోగ్యం తదితర రంగాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రణాళికలు రూపొందించే విధానంపై అధికారులు వివరించారు. విజిపిపిల రూపకల్పనలో గ్రామస్థాయి నుంచి అవసరాలను గుర్తించి, వాటికి అనుగుణంగా అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. ప్రణాళికల తయారీ,అమలు ప్రక్రియలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎల్.శ్రీలత, జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సిహెచ్ కృష్ణరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వి.సురేష్ మోహన్, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సుభాషిణి, ఎపిడిలు, తదితరులు పాల్గొన్నారు.

## పదేళ్లుగా ఇష్టారాజ్యంగా భూ ఆక్రమణలు

### బిఆర్ఎస్ నేతలపై ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఆగ్రహం

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** నీళ్ళు..నిధులు..నియామకాల కోసం సాధించుకున్న తెలంగాణలో బిఆర్ఎస్ నేతలు అధికారం అడ్డం పెట్టుకొని పదేళ్ళల్లో ఇష్టారాజ్యంగా అక్రమంగా భూములను అక్రమించుకొని ఫామ్ హౌజ్‌లు నిర్మించుకున్నారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెర్ వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భం గా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ బంగారు తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పి మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కుటుంబమే బంగారుమయంగా మారి పోయిందన్నారు. 2004లో ఎలాంటి ఆస్తులు లేవని అఫిడవిట్ ఇచ్చిన కెసిఆర్ 2023 వచ్చే సరికి వేల కోట్ల ఆస్తులు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, మాజీ మంత్రులు కెటిఆర్, హరీష్‌రావులకు ఎలా వచ్చాయో తెలంగాణ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ నాయకులు చేసిన అక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని వివరించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మెన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప, లింగారెడ్డిగూడ ఉప సర్పంచ్ ఎర్రోళ్ళ అశోక్ తదితరులు పాల్గొన్నారు.





### సంచార జాతి పిల్లలకు బడి స్థలం కేటాయించడం అభినందనీయం

**ఫరూఖ్‌నగర్:** సంచార జాతి పిల్లల చదువు కోసం ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి గ్రామ పంచాయతీ తీర్మాణం చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండలం హాజీపల్లి గ్రామ శివారు సిండికేట్ కాలనీలో సంచార జాతుల పిల్లల కోసం ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు. దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గ్రామ శివారులోని సిండికేట్ కాలనీ వెంచర్‌లో పంచాయతీకి కేటాయించిన 10శాతం స్థలంలో ప్రభుత్వ పాఠశాల భవనం నిర్మించేందుకు విద్యాశాఖకు అనుమతులు ఇస్తూ తీర్మాణం చేశారని వివరించారు. త్వరలోనే పాఠశాల భవన నిర్మాణం పూర్తి చేసి సంచార జాతుల పిల్లలకు విద్యను అంధించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ అప్ప, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, సర్పంచ్ కుమార్, మండల విద్యాధికారి మనోహర్, కౌన్సిలర్లు చాకలి పెంటయ్య, కొప్పునూరి ప్రవీణ్, దిలీప్, నాయకులు శ్రీధర్, ఎండి ఇబ్రహీం, సర్పంచ్ చందునాయక్, రాయికల్ శ్రీనివాస్, చందులాల్, రఘునాయక్, బాల్‌రాజ్ గౌడ్, సిద్దార్థ, మార్కెట్ డైరెక్టర్ కరుణాకర్, నక్క బాల్‌రాజ్, మాధవులు, మనీష్, నీరటి వాసు, మంగ ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులు రోగులకు అందుబాటులో ఉండి

# మెరుగైన సేవలందించాలి

### అదనపు కలెక్టర్ కిరణ్మయి

### యాచారం ప్రభుత్వ అసుపత్రి, పాఠశాల సందర్శన



**ప్రజాపక్షం/యాచారం :** వైద్యులు రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలందించాలని జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి అన్నారు. బుధవారం యాచారం మండల కేంద్రంలోని ప్రభుత్వ అసుపత్రిని అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి సిబ్బంది అందుబాటులో ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. రోగులకు అంకితభావంతో వైద్యసేవలు అందించాలని అదేశించారు. గ్రామీణ ప్రాతాల్లోని పేదలు కార్పొరేటు అసుపత్రుల్లో వైద్యం చేయించుకునే స్థోమత లేక వైద్యం కోసం వస్తారు, వారికి సేవ చేయాల్సిన భాద్యత మనపై ఉందన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహిచేదిలేదని హెచ్చరించారు. రాత్రి వేళల్లో వైద్యులు అందుబాటులో ఉండాలని గ్రామ సర్పంచ్ అనిత శరణం, వార్డు సభ్యులు జాయింట్ కలెక్టరును కోరగా వైద్యులు ఉండేటట్లు చూడాలని సూపరిండెంట్ నవీన్‌ను అదేశించారు. అనంతరం అసుపత్రిలో ఆయుర్వేద గదిని పరిశీలించి అందులో ఉన్న వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అపరేషన్ థియేటర్, రోగులు ఉండే బెడ్లు, వైద్య పరీక్షలు చేసే గదులను పరిశీలించారు. అసుపత్రిని ఎప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో క్లాసు రూంలో కూర్చోని విద్యార్థులకు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను విన్నారు. విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల చదువు పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని ఉపాధ్యాయులను హెచ్చరించారు. ఎలాంటి సమస్యలున్న తన దృష్టికి తెస్తే పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమాల్లో డిప్యూటీ డిఎంహెచ్ఒ సత్యరత్నం, అసుపత్రి సూపరిండెంట్ నవీన్‌కుమార్, తహసీల్దారు అయ్యప్ప, ఎంఇఒ పాండురంగారెడ్డి, డాక్టర్లు రాజ్యలక్ష్మి, మృదుల, ఉమారాణి, లక్ష్మి, శివకుమార్, నీతు, రెవెన్యూ అర్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలు



**ప్రజాపక్షం/యాచారం :** గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందించే బాండాగారాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సిఐ సత్యనారాయణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్ అధ్వర్యంలో నూతన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దెంది మధుకర్‌రెడ్డి, సహకారసంఘం డైరెక్టర్ మక్కపల్లి స్వరూప, వార్డు సభ్యులు అలంపల్లి మహేశ్, అడాల శ్రీకాంత్, ముచ్చర్ల మాధవి, నల్లోల్ల మమత, ఎరుకలి జ్యోతి, అండెకార్ అనిల్, మక్కపల్లి మహేశ్, బూరె కళమ్మ, కలకోండ పద్మ, వంగేరి మనోహర, బూరె సురేందర్, మోటే శ్రీశైలం, అలంపల్లి నర్సింహ్మ,అడాల గణేశ్ పాలొన్నారు.

## శబరిమల పాదయాత్రకు విరాళం



**ప్రజాపక్షం/కేశంపేట:** శబరిమల పాదయాత్ర చేపడుతున్న శ్రీరుద్ర ఆర్యనాథన్ గోసేవా ట్రస్ట్ బృందానికి కేశంపేట మండలం కొండా రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పల్లె బ్రదర్స్ ఆర్థిక సహాయం చేశారు. పాదయాత్ర ఖర్చుల నిమిత్తం పల్లె ఆనంద్‌కుమార్, పల్లె బాలేశ్వర్‌లు కలిసి ఒక లక్ష రూపాయలు విరాళాన్ని అందజేశారు.

## పెన్షన్ దరఖాస్తుల పరిశీలన



**ప్రజాపక్షం/కొందుర్గు:** పెన్షన్ల కోసం లబ్దిదారులు చేసుకున్న దరఖాస్తులను అధికారులు పరిశీలించారు. బుధవారం కొందుర్గు మండల కేంద్రంలో ఎంపిడిఒ శ్రీరాములు ఆధ్వర్యంలో పెన్షన్ దరఖాస్తు ఫారాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీరాములు, ఎంపిఒ రాఘవేందర్, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు ఉన్నారు.

## పంచాయతీ భవన పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/కొందుర్గు:** గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి స్లాబ్ పనులు సర్పంచ్ శ్రీలత రాములు ప్రారంభించారు. బుధవారం కొందుర్గు మండల పరిధిలోని విశ్వనాథ్‌పూర్ గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా మంజురైన నిధులతో పంచాయతీ భవన నిర్మాణ పనులను సర్పంచ్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీలత రాములు, ఉప సర్పంచ్ రాజ నర్సింహ్మారెడ్డి, ఏఈ మధు, వార్డు సభ్యులు సుందు శ్రీలత రమేష్, శ్యామలమ్మ, సునీత, మల్లయ్య, సుక్కమ్మ, అనురాధ పాల్గొన్నారు.

## గణనాథుడిని దర్శించుకున్న కెటిఆర్



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ బిఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని బిఎన్‌రెడ్డి నగర్ కాలనీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని బుధవారం ఎంఎల్‌ఏ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఏ పాడి కౌశిక్‌రెడ్డి, బిఆర్ఎస్ బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, చింతల రవికుమార్‌గుప్తా, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

## వినాయక లడ్డూల వేలం



**యాచారం :** మండల పరిధిలోని బొల్లిగుట్టతండాలో ప్రతిష్టించిన వినాయకుడి వద్ద ఉన్న లడ్డును నందివనపర్తి గ్రామ మాజీ సర్పంచ్ రాజునాయక్ 68 వేల రూపాయలకు కైవసం చేస్తున్నారు.

**షాద్‌నగర్:** ఏమి విల్లాస్‌లో ప్రతిష్టించిన విఘ్నేశ్వర స్వామి లడ్డు రికార్డు స్థాయిలో ధర పలికింది. మంగళవారం రాత్రి షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని ఆరవ వార్డు ఏబి విల్లాస్‌లో వినాయకుడి లడ్డు రూ.6,66,666లక్షలకు కౌన్సిలర్ రాజునాయక్ దక్కించుకున్నారు. రాజీవ్‌నగర్ కాలనీ పరిగి రోడ్డులోని కుబోటా ట్రాక్టర్ షోరూమ్, శ్రీసాయి బాలాజీ మెస్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన వినాయక స్వామి లడ్డును రూ.2,27,100కు బెజ్జ రాఘవేందర్ దక్కించుకున్నారు.

## ఆస్తి కోసం కన్న తండ్రిపై దాడి

**ప్రజాపక్షం/రంగారెడ్డి/శంకర్‌పల్లి:** పూర్వీకుల ఆస్తి వివాదం నేపథ్యంలో కన్న తండ్రిపైనే దాడికి పాల్పడ్డాడన్న ఆరోపణలపై ఓ వ్యక్తిని శంకర్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. 70 ఏళ్ల తండ్రిపై గ్రానైట్ రాయితో దాడి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 35 ఏళ్ల అమ్రోధి శ్రీనివాస్‌పై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. సంఘటనకు సంబందించి రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం లక్ష్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన 65 ఏళ్ల అమ్రోధి అంజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు వివరాల ప్రకారం.. కుటుంబానికి చెందిన సుమారు ఐదు ఎకరాల పూర్వీకుల వ్యవసాయ భూమిని తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయాలని శ్రీనివాస్ గత మూడేళ్లుగా తన తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నారు. ఈ విషయమై పెద్దల సమక్షంలో పలుమార్లు చర్చలు జరిగినప్పటికీ వివాదం పరిష్కారం కాలేదు. ఈ క్రమంలో శ్రీనివాస్ తన తండ్రి అమ్రోధి రాములుపై గ్రానైట్ రాయితో దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడిలో రాములు తలకు తీవ్ర గాయం కావడంతో ఆసుపత్రికి తరలించగా, వైద్యులు 13 కుట్లు వేసినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసిన శంకర్‌పల్లి పోలీసులు నిందితుడు శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

భార్య, ఇద్దరు పూజారులను చంపి.. పిల్లలను బందీలుగా మార్చి..

# ఎన్‌కౌంటర్‌లో హతం

### ఉత్తరప్రదేశ్‌లోని అజంగఢ్ జిల్లాలో దారుణ ఘటన

**అజంగఢ్:** ఉత్తర్‌ప్రదేశ్‌లో దారుణ ఘటన జరిగింది. భార్యతో పాటు ఇద్దరు పూజారులను తుపాకీతో కాల్చి చంపిన వ్యక్తి, అనంతరం తన ముగ్గురు పిల్లలను గదిలో బంధించి పోలీసులకు సవాల్ విసిరాడు. దాదాపు ఏడు గంటల పాటు సాగిన హైడ్రామా చివరకు కాల్పులకు దారితీసింది. పోలీసుల ఎదురుకాల్పుల్లో తీవ్రంగా గాయపడిన నిందితుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన అజంగఢ్ జిల్లా అహ్రౌలా ప్రాంతంలోని శంభూపూర్ గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అహ్రౌలా ప్రాంతంలోని శంభూపూర్ గ్రామానికి చెందిన అరవింద్ సింగ్ తన కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. అతనికి భార్య బబితా సింగ్ (32), కుమార్తె పరి (5), కుమారుడు లక్కా (6), ఏడు నెలల వయసున్న మరో కుమార్తె ఉన్నారు. గత కొన్ని రోజులుగా అరవింద్ మతిస్థిమితం సరిగ్గా లేదని కుటుంబసభ్యులు భావించారు.




దీంతో అతడి భార్య బబితా సింగ్, భర్త కోసం పూజ నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పూజారులు మహేంద్ర పాఠక్ (60), అఖిలేశ్ మిశ్రా (50)లను ఇంటికి పిలిపించింది. మంగళవారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో ఇంట్లోనే పూజ నిర్వహించారు. అదే సమయంలో అరవింద్ ఇంటికి తిరిగి వచ్చాడు. ఇంట్లో తన భార్య ఇద్దరు పూజారులతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండటాన్ని చూశాడు. పూజ జరుగుతున్న సమయంలో పూజారులను ఆచారాల గురించి అరవింద్ ప్రశ్నించాడు. అంతేకాకుండా వారి ఆధార్ కార్డులు అడిగాడు. ఈ విషయంలో మాటామాటా పెరగడంతో తన వద్ద ఉన్న లైసెన్స్ పిస్టల్ బయటకు తీసి కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో అరవింద్ భార్య బబితాతో పాటు పూజారులు మహేంద్ర పాఠక్, అఖిలేశ్ మిశ్రా అక్కడికక్కడే మృతి చెందారు. కాల్పులు జరిపిన అనంతరం అరవింద్ తన ముగ్గురు పిల్లలను తీసుకుని ఓ గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు.

**రంగంలోకి ఏటిఎస్ బృందం**

ఇంట్లో అతడి తల్లి సబ్లా దేవి (70), ఐదేళ్ల కుమార్తె పరి, ఆరేళ్ల కుమారుడు లక్కా, ఏడు నెలల పాప కూడా ఉన్నారు. కాల్పుల ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. అరవింద్‌ను లొంగిపోవాలని హెచ్చరించారు. అయితే అరవింద్ లొంగిపోవడానికి నిరాకరించడంతో పాటు పోలీసులను బెదిరించాడు. పైగా పిల్లలను చంపేస్తానని పదేపదే బెదిరించినట్లు చెప్పారు. అంతేకాకుండా వారిపై కాల్పులు కూడా జరిపినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనలో ఓ చిన్నారి గాయపడ్డారు. సుమారు ఏడు గంటల పాటు లొంగిపోవాలని నచ్చజెప్పినా అరవింద్ గది నుంచి బయటకు రాలేదు. దీంతో అర్ధరాత్రి 12.20 గంటల సమయంలో యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటిఎస్) బృందాన్ని రంగంలోకి దించారు. అరవింద్ ఉదయం అధికారులతో మాట్లాడతానని చెప్పినట్లు ఎడిజి నవీన్ అరోరా తెలిపారు. పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు తదుపరి చర్యలకు సిద్ధమవుతున్న సమయంలో ఇంటి లోపల నుంచి అకస్మాత్తుగా కాల్పుల శబ్దం వినిపించింది. తలుపులు బద్దలు కొట్టి లోపలికి గదిలో ముగ్గురు పిల్లలు ఉన్నందున పోలీసులు వెంటనే చర్యలు చేపట్టారు. స్టన్ గ్రెనేడ్లు, టియర్ గ్యాస్ గ్రెనేడ్లు ప్రయోగించిన అనంతరం తలుపులు బద్దలు కొట్టి లోపలికి ప్రవేశించారు. ఎస్‌పి అనిల్ కుమార్ కూడా స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ (ఎస్ఒజి) బృందంతో కలిసి గదిలోకి వెళ్లారు. పోలీసులు లోపలికి ప్రవేశించిన సమయంలో అరవింద్ వారి వైపు ఐదు రౌండ్లు కాల్పులు జరిపినట్లు అధికారులు తెలిపారు. దీంతో పోలీసులు ఎదురుకాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో అరవింద్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన అరవింద్‌ను వెంటనే చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. అయితే బుధవారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్పీ అనిల్ కుమార్ వెల్లడించారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన చిన్నారికి ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతోంది. మిగిలిన ఇద్దరు పిల్లలు సురక్షితంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# జ్ఞానేశ్ కుమార్‌కు పదవిలో కొనసాగే హక్కు లేదు



**న్యూఢిల్లీ:** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు కుమార్ పదవిలో కొనసాగే హక్కు లేదని, ఆయన రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. తమకు తెలియకుండా లేదా తమ ఆమోదం లేకుండా ఎన్నికల కమిషన్ పేరుతో జారీ చేసిన నిర్ణయాలు, ఉత్తర్వులపై 10 నెలల వ్యవధిలో కనీసం 14 సార్లు ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి, అభ్యంతరాలు నమోదు చేశారని 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' తన కథనంలో పేర్కొంది. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున మండిపడ్డాయి. 'కొన్నేళ్లుగా, కాంగ్రెస్ పార్టీ, అనేక ప్రతిపక్ష పార్టీలు దేశంలో ఎన్నికల నిష్పాక్షికతపై ప్రశ్నలు లేవనెత్తుతూనే ఉన్నాయి. ఎన్నికల కమిషన్ పాత్రపై మాకు నిరంతరం అనుమానం కలుగుతూనే ఉంది. మేము ప్రశ్నలు లేవనెత్తినప్పుడు, వాటిని ఒక జోక్‌గా కొట్టిపారేశారు. కమిషన్ తలుపులు మా కోసం మూసివేయబడ్డాయి' అని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఎక్స్‌లో పోస్ట్‌లో చేశారు. నేడు, అదే సమస్య స్వయంగా ఎన్నికల కమిషన్ నుండే వెలుగులోకి వచ్చిందని, ముగ్గురు ఎన్నికల కమిషనర్లలో ఇద్దరు 14 సార్లు లిఖితపూర్వకంగా అభ్యంతరాలు వ్యక్తం చేశారని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ దేశం ముందు నిరంతరం లేవనెత్తిన 'ఓట్ల చోరీ' 'సర్' అంశాలు ఇప్పుడు సరైనవేనని రుజువవుతున్నాయని, ఇది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని ఖర్గే అన్నారు. '2026 ఏప్రిల్ 24న, 73 మంది ప్రతిపక్ష రాజ్యసభ ఎంపిలు సిఇసి కుమార్‌ను తొలగించాలని కోరుతూ సెక్రటరీ జనరల్‌కు ఒక కొత్త 'నోటీస్ ఆఫ్ మోషన్' సమర్పించారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఇంకా ముగియలేదు. ఇప్పుడు గౌరవనీయులైన రాజ్యసభ చైర్మన్ ఆ పెండింగ్‌లో ఉన్న నోటీసుపై నిర్ణయం తీసుకుంటారా? అని ఖర్గే ప్రశ్నించారు. ఈ రోజు ప్రశ్న కేవలం 'ఓట్ల చోరీ'కి సంబంధించినది మాత్రమే కాదు, భారత ప్రజాస్వామ్యాన్ని, దాని వ్యవస్థలను ప్రభుత్వం తన గుప్పిట్లోకి తీసుకోవడానికి సంబంధించినదని ఆయన అన్నారు. ప్రధాన మంత్రి మోదీ నుండి దేశం సమాధానం కోరుతుందని ఆయన అన్నారు. భారత ప్రజల నుండి ప్రజాస్వామ్యాన్ని లాక్కోవాలని కుట్ర పన్నుతున్న వారికి తగిన సమాధానం లభిస్తుందని ఖర్గే స్పష్టం చేశారు. కుమార్‌కు పదవిలో కొనసాగే అర్హత లేదన్న విషయంలో ఎలాంటి సందేహం లేదని కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ పేర్కొన్నారు. 'తమ యజమాని (అధికార పక్షం) ఆదేశాల మేరకు ఒక వ్యక్తి తన ఇష్టానుసారం ఓటర్ల పేర్లను ఎలా తొలగిస్తారు? ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేసే స్పష్టమైన చట్టవిరుద్ధమైన చర్యలు తీసుకోవడానికి తోటి రాజ్యాంగబద్ధ అధికారులను ఎలా పక్కన పెడతారు?' అని ఆయన ప్రశ్నించారు.



**'సర్' నిలిపివేయాలి : సిపిఐ(ఎం)**

'సర్'ను ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలి, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తక్షణే పదవి నుంచి తొలగించాలని సిపిఐ (ఎం) డిమాండ్ చేసింది. సర్‌లో ఇద్దరు కమిషనర్ల అభ్యంతకరమైన విషయాలు కేవలం సర్ ప్రక్రియ గురించే కాకుండా, అంతకంటే ముఖ్యంగా భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) విశ్వసనీయతపైనే తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయని పేర్కొంది. ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ ప్రారంభమైనప్పటి నుండి సిపిఐ(ఎం), ఇతర ప్రతిపక్ష పార్టీలు, పౌర సమాజ సంస్థలు వ్యక్తం చేసిన అనుమానాలను, ఆందోళనలను ఈ వెల్లడైన విషయాలు మరింత బలపరిచాయి' అని సిపిఐ(ఎం) పేర్కొంది. చట్టం ప్రకారం ముగ్గురు ఎన్నికల కమిషనర్లు సమానమని, ఏవైనా భిన్నాభిప్రాయాలు ఉంటే మెజారిటీ లేదా ఏకాభిప్రాయం ద్వారా వాటిని పరిష్కరించుకోవాలని ఆ వామపక్ష పార్టీ పేర్కొంది. 'సిఇసి ఈ నియమాన్ని పాటించలేదు, పైగా తన తోటి ఎన్నికల కమిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాలను పట్టించుకోకుండా తన అభిప్రాయాలను రుద్దుతూ వచ్చారు' అని ఆ పార్టీ తెలిపింది.

**'సర్' చట్ట విరుద్ధం చేస్తున్నారు : ఆప్**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఎన్నికల సంఘాన్ని తన సొంతంగా నడుపుతూ, దేశవ్యాప్తంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ మొత్తాన్ని 'చట్టవిరుద్ధం' చేస్తున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. 'గత కొన్ని నెలలుగా ఎన్నికల సంఘం సమావేశాలు జరగడం లేదు, అయితే జ్ఞానేష్ కుమార్ తన సొంతంగా ఉత్తర్వులు జారీ చేస్తూనే ఉన్నారు. అందువల్ల, దేశవ్యాప్తంగా 13 కోట్ల పేర్లను తొలగించిన మొత్తం ఎస్ఐఆర్ ప్రక్రియ చట్టవిరుద్ధం, ఎందుకంటే ఎన్నికల సంఘం దీనిని అధికారికంగా ఆమోదించలేదు' అని ఆయన ఒక పత్రికా సమావేశంలో అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేసి మూడేళ్ల క్రితం నాటి ఓటర్ల జాబితాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 'ఈ దేశంలో ఇంతకంటే పెద్ద కుంభకోణం ఉండదు. ఒకవేళ మొత్తం ఓటర్ల జాబితాను ఎన్నికల కమిషన్ కేంద్ర కార్యాలయం నుంచే తయారు చేస్తుంటే, ఆ ఓటర్ల జాబితాను ఇఆర్ఒ లేదా ఎస్‌డిఎం తయారు చేయకపోతే, అప్పుడు దేశం మొత్తం ఓటర్ల జాబితా వాస్తవంగా రాజీపడినట్లే' అని ఆయన అన్నారు.



**జ్ఞానేష్‌పై తీర్మానం మళ్లీ తెరపైకి తేవాలి : టిఎంసి**



ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని కోరుతూ ఐదు నెలల క్రితం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మళ్లీ తెరపైకి తీసుకురావాలని తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు డెరెక్ ఓ బ్రియన్ పిలుపునిచ్చారు. సిఇసి తీసుకున్న అనేక చర్యలను ఇద్దరు ఎన్నికల కమిషనర్లు వ్యతిరేకించారన్న ఈ పెద్ద వార్త వెలుగులోకి వచ్చిన తర్వాత, ఆయనను అభిశంసించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని రాజ్యసభ నోటీసు జారీ చేయాల్సిన సమయం ఆసన్నమైందని ఎక్స్‌లో పేర్కొన్నారు.

**సిఇసి జైలుకు వెళ్తారు : శివసేన (యుబిటి)**



'సర్' విషయంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్ జైలుకు వెళ్తారని శివసేన (యుబిటి) ఎంపి సంజయ్ రౌత్ పేర్కొన్నారు. ఇక వారి యజమానులు దేశం విడిచి పారిపోతారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీకి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనే కోరిక కనీసం ఒక శాతం ఉన్నా సరే, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుండి తొలగించాలని రౌత్ న్యూఢిల్లీలో విలేకరులతో అన్నారు. 'జ్ఞానేష్ కుమార్‌ను కూడా తొలగించి, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఒకవేళ మోదీ జ్ఞానేష్ కుమార్‌పై చర్యలు తీసుకోకపోతే, సిఇసిని తొలగించాల్సిందిగా రాష్ట్రపతిని కోరుతున్నాను' అని ఆయన అన్నారు. ఒకవేళ రాష్ట్రపతి ఏమీ చేయకపోతే, ప్రజాస్వామ్యాన్ని, దేశాన్ని కాపాడటానికి ఆర్మీ చీఫ్ (సైన్యాధిపతి) ముందుకు రావాలని ఆయన పేర్కొన్నారు.

**తక్షణమే అఖిలపక్షం ఏర్పాటు చేయాలి : ఎన్‌సిపి (ఎస్‌పి)**



ఎన్నికల సంఘంలో విభేదాలు తలెత్తుతున్నాయన్న వార్తలపై చర్చించేందుకు తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి (ఎస్‌పి) పిలుపునిచ్చింది. ఈ విషయం ప్రతి పౌరుడి రాజ్యాంగ హక్కులకు సంబంధించినదని, దీనిని రాజకీయ అంశంగా పరిగణించకూడదని పేర్కొంది. ఎన్నికల సంఘంలో విభేదాలు ఉన్నాయన్న వార్తలపై ఢిల్లీలో విలేకరులు అడిగినప్పుడు, 'వ్యవస్థే కుప్పకూలుతుంటే మనం ఎవరిని నమ్మాలి?' అని సూలే అన్నారు. ఈ విషయం 'చాలా చాలా తీవ్రమైనదని, దీనిపై అన్ని రాజకీయ పార్టీల భాగస్వామ్యంతో బహిరంగ చర్చ జరగాలని ఆమె అన్నారు. 'ఇది కేవలం రాజకీయ సమస్య కాదు. ఇది దేశంలోని ప్రతి పౌరుడి హక్కులకు సంబంధించినది. ఇది ఇప్పుడు జాతీయ సమస్యగా మారింది' అని సూలే అన్నారు. ఆరోపణలలో నిజం ఉందో లేదో నిర్ధారించుకోవడానికి వాటిపై బహిరంగంగా చర్చ జరగాలని ఆమె డిమాండ్ చేశారు.

**ఎన్నికల సంఘంలో జోక్యం ప్రజాస్వామ్యాన్ని కాలరాయడమే : ఎస్‌పి**

ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించని సమయంలో ఏర్పడిన ప్రభుత్వాలు 'రాజ్యాంగ విరుద్ధం' అని, ఎన్నికల సంఘం పనితీరులో జోక్యం చేసుకోవడం ప్రజాస్వామ్యాన్ని 'కాలరాయడమే' అని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ అన్నారు. లక్నోలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికల సంఘం ఒక నిష్పక్షపాత సంస్థగా పరిగణించబడుతుందని, అది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుందని ఆశిస్తారని యాదవ్ పేర్కొన్నారు. 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' నివేదికను ప్రస్తావిస్తూ, ఎన్నికల సంఘం 'ఎవరి తరపున' పనిచేస్తోందనే ప్రశ్నలను ఈ పరిణామం లేవనెత్తిందని ఆయన అన్నారు. 'ఇది మన ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. ఇది మన ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ప్రయత్నం,' అని ఆయన అన్నారు.



'ఇప్పుడు మీరు ఏమని ఊహించగలరు? ఎన్నికల సంఘం న్యాయంగా వ్యవహరించి ఉంటుందా? అది నిష్పక్షపాతంగా ఉండి ఉంటుందా?' అని ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ప్రశ్నించారు.

# కర్నాటకలో కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజీనామా

**బెంగళూరు:** కరువు ప్రాంతాల జాబితాలో తన నియోజకవర్గాన్ని చేర్చకపోవడంపై కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి చెందారు. ప్రభుత్వానికి పదేపదే విజ్ఞప్తి చేసినప్పటికీ ఫలితం లేకపోకపోవడంతో కీలక నిర్ణయం తీసుకున్నారు. కర్ణాటకలోని విజయపుర జిల్లాకు చెందిన ఇండి నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే యశ్వంతరాయగౌడ పాటిల్ తన పార్టీ అధికారంలో ఉన్న ప్రభుత్వానికి పదేపదే విజ్ఞప్తి చేశారు. ఫలితం లేకపోవడంతో మంగళవారం తన ఎమ్మెల్యే సభ్యత్వానికి యశ్వంతరాయగౌడ పాటిల్ రాజీనామా చేశారు.

కర్ణాటక అసెంబ్లీ స్పీకర్ జి.ఎస్. పాటిల్‌కు తన రాజీనామా లేఖను ఆయన పంపారు కాగా, ఖరీఫ్ సీజన్‌లో ఇండి తాలూకా తీవ్ర కరువు బారిన పడిందని యశ్వంతరాయగౌడ పాటిల్ తెలిపారు. కరువు ప్రాంతంగా ప్రకటించాలని కోరుతూ ఆగస్ట్ 28న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించినట్లు చెప్పారు. అయితే విజయపుర జిల్లాలోని 13 తాలూకాలలో ఇప్పటి వరకు 11 తాలూకాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించారని, కేవలం ఇండి, చడచన్ తాలూకాలను మాత్రమే మినహాయించారని ఆయన విమర్శించారు. అయితే ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ప్రభావవంతమైన వ్యక్తులకు, ఒత్తిడి తెచ్చే పద్ధతులను అనుసరించే వారికే ప్రాధాన్యత లభిస్తోందని యశ్వంతరాయగౌడ పాటిల్ ఆరోపించారు. 'అందువల్ల, నా నియోజకవర్గ ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చలేకపోతున్నందున, నేను స్వచ్ఛందంగా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తున్నా' అని రాజీనామా లేఖలో ఆయన పేర్కొన్నారు. మరోవైపు సిఎం డికె శివకుమార్ నేతృత్వంలోని మంత్రివర్గ విస్తరణలో తనకు చోటు దక్కకపోవడంతో యశ్వంతరాయగౌడ పాటిల్ గతంలో ఆగస్ట్ 3న కూడా తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. అయితే పార్టీ నాయకత్వం నచ్చజెప్పడంతో దానిని ఉపసంహరించుకున్నారు.


## R.B.V.R.R. COLLEGE OF EDUCATION

SEETHARAMPUR, KARIMNAGAR Dist.
Ph: 0878-2222829, Email: principalrbvrrcoeknr@gmail.com

### SPOT ADMISSION NOTIFICATION

The following unreported /cancelled of B.Ed Should report on or before 25-09-2026 by 4-00pm otherwise their seats will be cancelled and the same may be filled with spot admissionson27-09-2026 at 10.00 A.M at our college campus as per guidelines of TGCHE/Ed-CET-2026 Convener

| S.No. | H.T.No. | RANK | NAME | CATEGORY | ALLOTED CATEGORY | METHODOLOGY |
|---|---|---|---|---|---|---|
| 1 | 2615008245 | 13159 | IRUMALLA RAJITHA | OC | REG_OPEN_OU_GE | BIO |
| 2 | 2614304770 | 13591 | BHAGATH BHAVYADEEP | SC Group - 3 | REG_OPEN_OU_GEN | BIO |
| 3 | 2625003051 | 13784 | THALARI SHAILAJA | SC Group - 3 | REG_OPEN_OU_GEN | BIO |
| 4 | 2615008234 | 13898 | ZARA KOUNAIN | BC-E | REG_BCE_UNR_FEMALE | BIO |
| 5 | 2615011050 | 15636 | BANDI SWETHA SRI | BC-B | REG_BCB_OU_FEMALE | BIO |
| 6 | 2625102046 | 18289 | BORRA CHANDANA | BC-B | REG_BCB_OU_FEMALE | BIO |
| 7 | 2625008087 | 18367 | JOGA BHAVANA | BC-B | REG_BCB_OU_GEN | BIO |
| 8 | 2625608108 | 18711 | PERUKA VIGNESHWARI | BC-D | REG_BCD_OU_GEN | BIO |
| 9 | 2615601619 | 21191 | KOTTEM KRISHNAVENI | ST | REG_ST_OU_GEN | BIO |
| 10 | 2615602140 | 10638 | MEKALA SRIHARI | SC Group - 3 | REG_OPEN_OU_GEN | MATHS |
| 11 | 2625010027 | 16047 | SIRIPURAM SAGARIKA | BC-B | REG_OPEN_OU_FEMALE | MATHS |
| 12 | 2624103153 | 17013 | MANGARAPU MAMATHA | BC-D | REG_OPEN_OU_GEN | MATHS |
| 13 | 2624108424 | 17141 | GUGLOTH KAVERI | ST | REG_OPEN_OU_FEMALE | MATHS |
| 14 | 2614107378 | 18283 | NASPURI APARNA | BC-B | REG_BCB_OU_GEN | MATHS |
| 15 | 2615008062 | 20765 | BHAKTHU MANISHA | SC Group - 3 | REG_SC2_OU_FEMALE | MATHS |
| 16 | 2614102002 | 20923 | KALVA NAVITHA | BC-B | REG_BCB_OU_GEN | MATHS |
| 17 | 2614301562 | 21361 | PASULA VAISHALI | BC-D | REG_SC3_UNR_GEN | MATHS |
| 18 | 2615602185 | 21949 | JAKKULA SHIVANI | SC Group - 3 | REG_SC2_OU_GEN | MATHS |
| 19 | 2624306631 | 22124 | AKULA VIDYA | BC-D | REG_BCC_OU_GEN | MATHS |
| 20 | 2615401093 | 22399 | THAKRE SHUBHAM | BC-B | REG_BCC_OU_GEN | MATHS |
| 21 | 2625010022 | 23519 | RAGI SOUMYA | BC-D | REG_ST_OU_GEN | MATHS |
| 22 | 2625001297 | 23800 | MOHAMMAD SAMREEN | BC-B | REG_ST_OU_FEMALE | MATHS |
| 23 | 2625001614 | 24179 | GULLAPELLI PRANAVI | BC-B | REG_BCD_OU_GEN | MATHS |
| 24 | 2615608072 | 26011 | ADEPU SHAMILI | BC-B | REG_BCA_OU_GEN | MATHS |
| 25 | 2615601484 | 19930 | GAJJELA SUSHMITHA | BC-D | REG_BCD_OU_GEN | PHY SCIE |
| 26 | 2615006092 | 21945 | ANDE REVATHI | SC Group - 2 | REG_SC2_OU_FEMALE | PHY SCIE |
| 27 | 2615601942 | 24967 | GUTOJU MAMATHA | BC-B | REG_BCB_OU_GEN | PHY SCIE |
| 28 | 2615006246 | 26426 | PABBA HEMALATHA | SC Group - 3 | REG_ST_OU_GEN | PHY SCIE |
| 29 | 2615003063 | 13610 | BOINI SPANDANA | SC Group - 2 | REG_SC2_UNR_FEMALE | SOCIAL |
| 30 | 2615606180 | 22026 | GURRALA RAKSHITH | BC-D | REG_BCD_OU_GEN | SOCIAL |
| 31 | 2615010117 | 22258 | ADIBA FIRDOUS | OC | REG_BCA_OU_FEMALE | SOCIAL |
| 32 | 2625001695 | 22767 | JAVERIYA FATHIMA | BC-E | REG_BCE_OU_GEN | SOCIAL |
| 33 | 2625002083 | 22809 | MAMIDIPALLI HEMANTH KUMAR | SC Group - 2 | REG_SC2_OU_GEN | SOCIAL |
| 34 | 2625601405 | 23877 | MAMIDALA KASTURI | SC Group - 2 | REG_SC1_OU_GEN | SOCIAL |
| 35 | 2615008059 | 23985 | MANDA RAJESH | SC Group - 2 | REG_BCE_OU_GEN | SOCIAL |
| 36 | 2625001227 | 24152 | AMMULA PRAVALIKA | SC Group - 3 | REG_SC3_OU_GEN | SOCIAL |
| 37 | 2624305261 | 24285 | S SWAPNA | BC-D | REG_BCB_OU_FEMALE | SOCIAL |
| 38 | 2615010055 | 25935 | LOKINI PUJA | ST | REG_ST_OU_FEMALE | SOCIAL |
| 39 | 2615008125 | 26257 | YENAGANTI PRAVALIKA | BC-B | REG_BCB_OU_FEMALE | SOCIAL |
| 40 | 2625003068 | 26356 | BHUKYA AKHILA | ST | REG_ST_OU_GEN | SOCIAL |
| 41 | 2625010117 | 26620 | CHINTHAKINDI SRAVANTHI | BC-B | REG_BCB_OU_GEN | SOCIAL |
| 42 | 2625608067 | 26726 | JAGARI NAGAMANI | BC-D | REG_BCD_OU_FEMALE | SOCIAL |
| 43 | 2625008186 | 26836 | PADAKANTI ABHINAYA | BC-B | REG_BCB_OU_FEMALE | SOCIAL |

Note: SIXTEEN (16) Left over Seats not filled by Convener TS.Ed CET-2026

Sd/- secretary &correspondent



# ఆదివారమూ బ్యాంకులు ఓపెన్

- ప్రతిపాదిత బ్యాంకుల సమ్మెతో ముందస్తు చర్యలు
- ఖాతాదారులకు ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రం నిర్ణయం

**న్యూఢిల్లీ:** బ్యాంకు ఖాతాదారులకు కేంద్ర ఆర్థిక శాఖ కీలక ప్రకటన చేసింది. సెప్టెంబర్ 27 ఆదివారం దేశవ్యాప్తంగా బ్యాంకులు సాధారణంగానే పనిచేయనున్నాయి. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ) అనుమతితో ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు మాత్రమే కాకుం డా, బ్యాంకు శాఖలు, కార్యాలయాలు, ఎటిఎం లింక్ శాఖలు, కరెన్సీ చెస్ట్‌లు పూర్తి స్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకున్నారు. వరుస సెలవులు, ప్రతిపాదిత బ్యాంకు సమ్మె కారణంగా ఖాతాదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం వెల్లడించింది. సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల దేశవ్యాప్త సమ్మెకు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) పిలుపునిచ్చింది. దీనికి ముందు సెప్టెంబర్ 26 నాలుగో శనివారం, 27 ఆదివారం కావడంతో సాధారణంగా బ్యాంకులకు వరుసగా సెలవులు ఉండేవి. అదే సమయంలో సెప్టెంబర్ 30 బ్యాంకుల అర్ధ సంవత్సర ముగింపు తేదీ కావడంతో, వరుసగా బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉందన్న ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రజల అత్యవసర బ్యాంకింగ్ అవసరాలకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. సెప్టెంబర్ 27న అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు సాధారణంగా పనిచేస్తాయని ఆర్థిక శాఖ తెలిపింది. ఆ రోజు బ్యాంకు శాఖలు, కార్యాలయాలు, ఎటిఎం లింక్ బ్రాంచ్ లు, కరెన్సీ చెస్ట్‌లు పనిచేసేందుకు ఆర్‌బిఐ అనుమతి ఇచ్చినట్లు వెల్లడించింది. బ్యాంకు ఖాతాదారుల సంక్షేమం, సౌకర్యానికే అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేసింది. అత్యవసర బ్యాం కింగ్ సేవలకు ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపింది.

**అసలు సమ్మె ఎందుకు?:** బ్యాంకు ఉద్యోగుల సంఘాల సమాఖ్య యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బి యు) ఆధ్వర్యంలో సమ్మెకు పిలుపునిచ్చారు. ఐదు రోజుల పని విధానం అమలు చేయాలన్నదే ప్రధా న డిమాండ్ అని ఆల్ ఇం డియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ((ఎఐబిఇఎ) ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటాచలం తెలిపారు. గతంలో ప్రభుత్వం, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్‌తో కుదిరిన ఒప్పందంలో ఐదు రోజుల పని విధానం అంశం ఉందని పేర్కొన్నారు. ఈ డిమాండ్‌పై సెప్టెంబర్ 22న కేంద్ర కార్మిక శాఖ చీఫ్ లేబర్ కమిషనర్‌తో చర్చలు జరిగినట్లు తెలిపారు. సమ్మెను విరమించాలని ఆర్థిక శాఖ చేసిన విజ్ఞప్తిపైనా యూనియన్లు సానుకూలంగా స్పందించలేదని వెంకటాచలం చెప్పారు. తమ డిమాండ్‌పై స్పష్టమైన హామీ వచ్చే వరకు సమ్మెను విరమించే ప్రసక్తి లేదని ఆయన పేర్కొన్నారు.

# ఢిల్లీ విమానాశ్రయంలో భారీగా బంగారం పట్టివేత



**న్యూఢిల్లీ:** ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బంగారం అక్రమంగా తరలిస్తున్న ఎనిమిది మంది ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.9 కోట్ల విలువైన 6.5 కిలోల బంగారం స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడినవారిలో ఒక మహిళ ఉన్నారు. ప్రయాణికులు ఒక ప్రదర్శన నిమిత్తం దుబాయ్ వెళ్లి ఈనెల 21న ఢిల్లీ చేరుకున్నారని అధికారులు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు వారు ప్రయాణించిన విమానంలో తనిఖీలు చేయగా రెండు సీట్ల కింద మూడు సంచుల్లో ఆభరణాల రూపంలో ఉన్న బంగారం గుర్తించామని, దానిని గుర్తించకుండా ఉండేందుకు వెండి, నలుపు రంగులు పూసారని వెల్లడించారు. పట్టుబడిన ఎనిమిది మంది ప్రయాణికులకు వైద్య పరీక్షలు నిర్వహించి పటియాలా హౌస్ కోర్టులో ప్రవేశపెట్టగా, కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది.


**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR WARANGAL,**

**ARB.NO. 32 of 2026**

Between:

**KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED., NAKKALAGUTTA CAO Branch, R/o.WARANGAL.**

**.... Disputant**

AND

**Sri.Shivani Pathi & others**

**... Opponents**

1. Sri.Shivani Pathi, D/o. Sadanandam, aged about : 25 years, Occ: Private Employee R/o: 1-1-931/303, Siddartha Nagar, Road No. 11/2, Kazipet, Beside Flyovewr Bridge, Hanamkonda, Warangal, Warangal, Telangana, India - 506004 Mobile: 9866275101.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on **09-10-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATION WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR WARANGAL,**

**ARB.NO. 48 of 2026**

Between:

**KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED., NAKKALAGUTTA CAO Branch, R/o.WARANGAL.**

**.... Disputant**

AND

**Mr. Rajender Mandala & others**

**... Opponents**

1. Mr.Rajender Mandala, S/o. Ilaiah, aged about : 48 years, Occ: Business, R/o: H.NO. 2-243, PENCHIKALPET, ATMAKUR, Warangal, Telangana, India - 506342 Mobile:9963271613.
2. Mrs.Thirupathi Kanche, S/o. Narsaiah, aged about :48 years, Occ: Conductor,O/o. TGRTC, Bhupalpally Depot. R/o: H.No. 3-4, PENCHIKALAPETA, ATMAKUR, Warangal, Telangana, India - 506001 Mobile: 9701654737.
3. Mr.Ramya Krishna Gotte, D/o. Sarangam, aged about : 39 years, Occ: Sr Asst O/o. Deputy Dt Medical & Health Hasanparthy. R/o: H.No. 6-75, NEERUKULLA, ATHMAKUR, Warangal, Telangana, India - 506342 Mobile:9652533223.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on **09-10-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATION WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR WARANGAL,**

**ARB.NO. 50 of 2026**

Between:

**KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED., NAKKALAGUTTA CAO Branch, R/o.WARANGAL.**

**.... Disputant**

AND

**Mrs.Bharathi Nethakani & others**

**... Opponents**

1. Mrs.Bharathi Nethakani, D/o. Sammaiah, aged about : 47 years, Occ:Business,R/o:1-9-1655, Deendayal Nagar, Hanamkonda, Warangal., Hanam konda, WARANGAL, Warangal (Urban), Telangana, India - 506001 Mobile: 9652063585
2. Mr.Bandi Ashok, S/o. Srihari,aged about :57 years,Occ:ASST. ENGINEER, O/o. Northern Power Distribution Company Of Telangana Ltd. Tharigoppula, R/o:H.No.2-3 Ladella, Warangal, Telangana, India - 506006 Mobile: 9440814114
3. Mr.Madasi Manohar, S/o. Ellaiah,aged about :33 years,Occ: SUB ENGINEER,O/o. Npdcl Jangaon Divistion. R/o:H.No.3-6/1 Pogallapalle Kothaguda Warangal, Telangana, India - 506135 Mobile:8500037630
4. Mr.Ankam Manideep, S/o. Sambaiah, aged about :30 years,Occ: SUB ENGINEER, O/o. Npdcl Jangaon Division, R/o: H.No. 1-8-1/93 suryanagar Chikkadapally, Hyderabad, CHIKKADA PALLY, HYDERABAD, Hyderabad, Telangana, India - 500020 Mobile:8374903001.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on **09-10-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATION, WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR WARANGAL,**

**ARB.NO. 93 of 2026**

Between:

**KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED., NAKKALAGUTTA CAO Branch, R/o.WARANGAL.**

**.... Disputant**

AND

**Mr.Venkataswamy Are & others**

**... Opponents**

2. Mr.Erraiah Arsam, S/o. Mallaiah, aged about : 55 years, Occ: GENERAL MAZDOOR, O/o. Singareni Collories Company Ltd SRP-3 Incline,. R/o: H.No. 1-55, Thimmapur, Laxettipeta, Adilabad, Telangana, India - 504207 Mobile: 9398345602
4. Mr.Shravan Gaddam, S/o. Shankar Reddy, aged about : 40 years, Occ: GENERAL MAZDOOR, O/o. Singareni Collories Company Ltd., Kasipet, R/o: H.No. 5, BALAJI RESIDENCY, MANCHERIAL, Mancherial, Telangana, India - 504251 Mobile:7207630048.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on **09-10-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATION WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR WARANGAL,**

**ARB.NO. 107 of 2026**

Between:

**KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED., NAKKALAGUTTA CAO Branch, R/o.WARANGAL.**

**.... Disputant**

AND

**Mr.Narsaiah Engalal & others**

**... Opponents**


1. Mr.Narsaiah Engalal, S/o. Muthaiah, aged about : 48 years, Occ: Business, R/o:H.No-1-87/2,Repaka- Regonda-Jayashankar, REGONDA-JAYA SHANKAR, Warangal (Rural), Telangana, India - 506348 Mobile:9848848406
2. Mrs.Samarla Bixapathi, S/o. Peddaramaiah,aged about :42 years,Occ:ARTISAN II, O/o. TGNPDCL,Repaka, R/o: 3-92, REGONDA, Warangal, Telangana, India - 506348 Mobile: 9346635462
3. Mrs.Aldandi Nagaraju, S/o. Sudharshanam, aged about :45 years, Occ: MECHANIC, O/o.Sccl Mines, Bhupalpally, R/o:1-34, DAMMANNAPET, REGONDA, Warangal, Telangana, India - 506164 Mobile:9908143741
4. Mrs.Yeldandi Purna Prasad, S/o. Sudarshan, aged about :49 years, Occ: JPA, O/o.TS GENCO, Ktpp Chelpur. R/o: 1-34, DAMMANNAPET, REGONDA WGL, Warangal, Telangana, India - 506164 Mobile: 9949723825.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on **09-10-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATION, WARANGAL**

# జిన్‌పింగ్‌కు ఘనమైన స్వాగత ఏర్పాట్లు

## 500 మంది సైనికులతో ఆహ్వానం



**వాషింగ్టన్ :** చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఆయన సతీమణి పెంగ్ లియువాన్‌లకు వాషింగ్టన్ బేస్ రన్ వే వద్ద అరుదైన స్వాగతం పలికేందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బ్రహ్మాండ మైన సన్నాహాలు చేశారు. దాదాపు దశాబ్దం కంటే ఎక్కువ సంవత్సరాల తర్వాత మొదటిసారి చైనా అధ్యక్షుడు అమెరికాలో పర్యటిస్తున్నారు.
జిన్‌పింగ్ విమానం దిగి వైట్‌హౌస్‌కు వచ్చే వరకూ వేచి చూడకుండా ఆండ్రూ ఎయిర్‌ఫోర్స్ బేస్ రన్ వే వద్ద ఎర్ర తివాచీ పరచి అక్కడ ట్రంప్ సిద్ధంగా నిలబడి ఉంటారు. 500 మంది సైనికులు ఎంతో ఘనంగా ఈ ఆహ్వాన కార్యక్రమంలో పాల్గొంటున్నారు. మూడు రోజులపాటు అమెరికాలో జిన్‌పింగ్ పర్యటన ఎంతో ఆడంబరంగా కొనసాగేందుకు ఏర్పాట్లు చేశారు. ఐతే జిన్‌పింగ్ న్యూయార్క్‌లో జరిగే ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాలలో మాత్రం పాల్గొనడంలేదు. మే నెలలో ట్రంప్ చైనా పర్యటన సందర్భంగా ఎతో వైభవంగా ఆయనకు స్వాగత సత్కారాలు, విందు కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అందుకు తగ్గట్టుగానే వైట్‌హౌస్‌లో కూడా బుధవారంనాడు ట్రంప్ బ్రహ్మాండమైన విందు జిన్‌పింగ్,ఆయన పరివారం కోసం ఏర్పాటు చేశారు. కానీ వాణిజ్య వివాదాలు, కృత్రిమ మేధస్సు విషయంలో అగ్రదేశాలమధ్య కుట్రలతో కూడిన పోటీ, ఇరాన్‌లో ట్రంప్ యుద్ధం, అమెరికా చెబుతున్నట్టుగా తైవాన్ పై చైనా దురాశ, మార్కెట్ పోటీ,అమెరికాకు సరఫరా చేయకుండా కీలక ఖనిజాల సరఫరా చైనా నిలిపివేయడం వంటి అనేక విషయాలలో ఉన్న విభేదాల మధ్య ఈ స్వాగత సత్కారాలన్నీ కేవలం పైపైన కనిపించే ఆర్భాటాలు మాత్రమే. మౌలిక సమస్యలను ఈ రెండు దేశాలు శాశ్వత ప్రాతిపదికపై పరిష్కరించుకుని ప్రపంచ శాంతికి అగ్రదేశాలు ఎలా దోహదపడతాయన్న విషయమే ప్రపంచ ప్రజలకు, దేశాలకు ప్రధానాంశంగా మారింది. ఈ పర్యటన ద్వారా రెండు దేశాల మధ్యా ఒక వ్యూహాత్మక స్థిరత్వాన్ని కాపాడే చర్యలపై ఎక్కువ దృష్టి పెట్టకుండా ఆర్భాటాలు, ఆడంబర ప్రదర్శనల ఎత్తుగడలకే ట్రంప్ ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనిపిస్తున్నది.
జిన్‌పింగ్ గొప్ప నాయకుడనీ, తాను స్నేహితుడని పిలుచుకునే ఆత్మీయత ఉందని ట్రంప్ పొగడ్తలలో ముంచెత్తుతున్నారు. ఐతే సెనేట్ సాయుధ సేనల కమిటీ రిపబ్లికన్ చైర్మన్ రోజర్ వికర్ ఈ ఆర్భాటాలన్నింటినీ తీవ్రంగా విమర్శించారు. జిన్‌పింగ్‌తో ఉన్న అనేక సమస్యల దృష్ట్యా ఆ కమ్యూనిస్టు నాయకుణ్ణి దేశానికి ఆహ్వానించి ఉండకూడదని ఆయన అన్నారు. ఇరాన్‌కు చైనా స్పష్టమైన మద్దతు, అమెరికాకు వ్యతిరేకంగా చైనా ఎక్కుపెట్టి దాచి ఉంచిన భారీ ఆయుధాలు వంటి అనేక విషయాలను ట్రంప్ ప్రతి నిమిషం గుర్తుంచుకోవాలని ఆయన హెచ్చరించారు.

# గాజా కోసం 2.45 బిలియన్ల ప్రణాళిక

### మౌలిక సదుపాయాలు, సొరంగాల పూడ్చివేత
### పూర్తి అమలుకు సౌదీ అరేబియా పిలుపు



**దుబాయ్ :** గాజాలో పునర్నిర్మాణానికి ట్రంప్ నాయకత్వంలో ఉన్న గాజా శాంతి మండలి బుధవారంనాటి సమావేశంలో 2.45 బిలియన్ డాలర్లతో ఒక ప్రణాళికను ఆవిష్కరించడానికి ఏర్పాట్లు సిద్ధం చేసింది. గాజాలో యుద్ధం కారణంగా సర్వ వినాశనం జరిగింది. ఈ వినాశనం నుండి తిరిగి గాజాను సాధారణస్థితికి పునర్నిర్మించడానికి రాబోయే దశాబ్దకాలానికిగాను 71.40 బిలియన్ డాలర్లు అవసరం అవుతాయని శాంతిమండలి అంచనా వేసింది.
అదేవిధంగా 35.20 బిలియన్ డాలర్ల మేరకు భౌతిక నష్టం జరిగిందని కూడా శాంతిమండలి అంచనావేసింది. ఐతే ప్రస్తుతం తాత్కాలికంగా సిద్ధంచేసిన 2.45 బిలియన్ డాలర్లు రాబోయే ఆరునెలలపాటు ప్రాథమిక నిర్మాణ కార్యక్రమాలు,శిథిలాల తొలగింపునకు ఉపయోగిస్తారు. ముందుగా ఆసుపత్రలను పునర్నిర్మించడం, శిథిలాలు తొలగించడం, ఉగ్రవాదుల సొరంగాలను శాశ్వత ప్రాతిపదికపై పూడ్చిపెట్టడం,ఆర్థిక మద్దతు, బహుళజాతి భద్రతా దళాల మోహరింపు, విద్యుత్ ఏర్పాట్లు, 25,000 పోర్టబుల్ సోలార్ కిట్స్ మోహరింపు, సరిహద్దు క్రాసింగ్‌లకు మరమ్మతులు వంటి అనేక చర్యలు తీసుకుటారు. ప్రాథమికంగా 66 ప్రాజెక్టులను చేపడతారని ఆక్సియోస్ సంస్థ ప్రకటించింది. తాత్కాలిక గృహనిర్మాణం, శిథిలాల తొలగింపు, ఆసుపత్రలకు మరమ్మతులు, మౌలిక సదుపాయాల ఏర్పాటు ప్రధానమైనవి.

**గాజాపై న్యూయార్క్ డిక్లరేషన్ :**
ఇదిలా ఉండగా, ట్రంప్ ప్రకటించిన గాజా శాంతి ప్రణాళికను పూర్తిస్థాయిలో అమలు చేయాలని సౌదీ అరేబియా విదేశాంగ మంత్రి ప్రిన్స్ ఫైజల్ బిన్ ఫర్హాన్ పిలుపు ఇచ్చారు. అదేవిధంగా ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయెల్ స్థావరాల విస్తరణ సమస్యను కూడా పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. పాలస్తీనా ప్రతిపత్తి సాధనకోసం న్యూయార్క్ తీర్మానం ప్రకటించడానికి ఫ్రాన్స్, బ్రిటన్, కెనడా దేశాలతో కలిసి సౌదీ అరేబియా నిర్వహించిన సమావేశంలో ఫైజల్ బిన్ ఫర్హాన్ పైవిధంగా కోరారు. గాజా స్ట్రిప్, వెస్ట్‌బ్యాంక్‌లను గాజా అథారిటీ కింద ఏకీకరణ చేసేందుకు వీలుగా ఒక సమగ్ర ప్రణాళికను అమలు చేసేందుకు డోనాల్డ్ ట్రంప్ తగిన చర్యలు తీసుకోవాలని కూడా ఆయన పిలుపు ఇచ్చారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఈ నాలుగు దేశాలూ న్యూయార్క్ డిక్లరేషన్ ప్రకటించాయి.

# యెమెన్ రెడ్ సీ కోస్ట్ హౌతీల స్వాధీనం

### సూత్రధారి ఐఆర్‌జిసి ప్రత్యక్ష జోక్యం : ఇంధనంపై ప్రభావం
### అమెరికా, మిత్రదేశాలకు గట్టి ఎదురుదెబ్బ
### అంతర్యుద్ధంలో లక్షమంది నిరాశ్రయం

**సనా :** యెమెన్‌లో ఎర్ర సముద్ర తీర ప్రాంతాన్ని హౌతీ తిరుగుబాటుదారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ చర్య ప్రపంచ ఇంధన ధరల మరింత పెరుగుదలకు దారితీస్తుంది. ఇరాన్‌కు చెందిన ఐఆర్‌జిసి దళాలు వెనక సలహాదారులుగా క్షేత్రస్థాయిలో నిలబడ్డారు. 2014లో యెమెన్‌లో అంతర్యుద్ధం ప్రారంభమైనప్పటి నుండీ తన చిరకాల మిత్రదేశానికి ఇరాన్ ప్రత్యక్షంగా ముందునిలబడి జోక్యం చేసుకుని చేసిన కీలకమైన సహాయం ఇదే. ఐఆర్‌జిసి సహాయంతో యెమెన్ ప్రభుత్వ దళాలను హౌతీ ఉగ్రవాద సైన్యాలు తరిమికొట్టి విస్తారమైన భూభాగాన్ని తమ అధీనంలోకి తెచ్చుకున్నాయి. హోర్ముజ్ జల సంధి స్వాధీనానికి అమెరికా ప్రయత్నాలు, ఇరాన్‌పై తీవ్ర ఆర్థిక ఆంక్షలు అమలు చేస్తున్న తరుణంలో ఈ కీలక పరిణామం సంభవించింది. అమెరికాను పెద్ద దెబ్బ తీసేందుకు, యుద్ధాన్ని విస్తరించేందుకు ఇదొక కీలక పరిణామంగా మారింది. ఐఆర్‌జిసి సహాయంతో ఈ తీర ప్రాంతాన్ని వారు స్వాధీనం చేసుకోవడంతో అమెరికా దాని మిత్రదేశాలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తిరుగుబాటుదారులు సౌదీ అరేబియా పైప్‌లైన్‌ను మూసివేశారు. కీలకమైన చమురు ఎగుమతులను అడ్డుకున్నారు. దీంతో ఆ దేశాన్ని ఆర్థికంగా దెబ్బతీసే స్థాయికి చేరుకున్నారు. ఈ విషయంలో అమెరికా నుండి ఎలాంటి సహాయం లభించకపోవడంతో సౌదీ అరేబియా తీవ్ర అసంతృప్తితో ఉంది. కానీ బ్రిటన్ మాత్రం ముందుకు వచ్చి సహాయం చేస్తోంది. కేవలం 48 గంటల వ్యవధిలో హౌతీ దళాలు ఎర్ర సముద్ర తీర ప్రాంతాన్ని అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన యెమెన్ ప్రభుత్వ దళాల నుండి స్వాధీన చేసుకున్ని అందరినీ ఆశ్చర్యపరచాయి. అంతర్యుద్ధం కొనసాగుతోంది. ఇరాన్ మద్దతుగల హౌతీలు సముద్ర తీర ప్రాంతాలను స్వాధీనం చేసుకునే దిశగా ముందుకు సాగుతున్నారు. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన సౌదీ అరేబియా మద్దతుగల యెమెన్ ప్రభుత్వ దళాలతో హౌతీల ఘర్షణలు ఆగకుండా కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో గడచిన నెలరోజులుగా యెమెన్‌లో 1,00,000 మంది ప్రజలు ఇళ్ళు వదిలి సురక్షిత ప్రాంతాలకు పారిపోయారు. అంతకుముందు కూడా అంతర్యుద్ధం వల్ల ఆ దేశంలో ఇప్పటికే 52 లక్షల మంది ప్రజలు ఇళ్ళు కోల్పోయి నిరాశ్రయులుగా మారారు.

# వెనిజులాలో స్వేచ్ఛాయుత ఎన్నికలకు డిమాండ్

### న్యూయార్క్‌లో రోడ్రిగ్జ్ వ్యతిరేక ప్రదర్శన

**న్యూయార్క్ :** ఐక్యరాజ్యసమితి సమావేశాలకు హాజరైన వెనిజులా తాత్కాలిక అధ్యక్షుడు డెల్సీ రోడ్రిగ్జ్‌కు నిరసన ఎదురైంది. ఒక చిన్న ప్రదర్శకుల బృందం ఐరాస కార్యాలయం వెలుపల ఆమెకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన జరిపారు. వెనిజులాలో స్వేచ్ఛాయుత ఎన్నికలకు అవకాశం ఇవ్వాలని ప్రదర్శకులు డిమాండ్ చేశారు. చమురు వద్దు, కొత్త ముఖం, పాత పాలన'' అని రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శిస్తూ వెనిజులా జాతీయ జెండాలను ప్రదర్శకులు ప్రదర్శించారు. దేశంలో స్వేచ్ఛాయుత ఎన్నికలకు ట్రంప్ కృషి చేయాలని వారు కోరారు. వారంతా వెనిజులా జాతీయ గీతాన్ని ఆలపించారు.''డెల్సీ ఒట్టు, మదురోతో పాటు నువ్వు కూడా బ్రూక్లిన్ జైలుకు వెళుతున్నావు'' అని నినాదాలు చేశారు. మదురోను అరెస్టుచేసిన వారితో వెనిజులాలో ఒకనాటి పాలకవర్గంలో భాగస్వాములు సమావేశాలు జరపడం అతిదారుణంగా ఉందని వారు నినాదాలు చేశారు. ఈ అమెరికా ప్రభుత్వం వల్లనే మన దేశం స్వేచ్ఛకు దూరమైందని కారకస్ నుండి వలస వచ్చిన 34 ఏళ్ళ సోషల్ మీడియా మేనేజర్ మిగెల్ ఎడ్వర్డో మార్టినెజ్ విమర్శించారు. ఇదిలా ఉండగా, అమెరికా–వెనిజులా మధ్య వాణిజ్య భాగస్వామ్యాన్ని వివిధ రంగాలలో విస్తరించేందుకు న్యూయార్క్ వేదికగా చర్చలు జరిగాయి.
వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ మొదటిసారి ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాలలో పాల్గొనేందుకు న్యూయార్క్ వెళ్ళిన సందర్భంగా ట్రంప్‌తో సమావేశమయ్యారు. విదేశాంగ మంత్రి మార్కో రుబియో, ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్, వైట్‌హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ సూసీ వైల్స్, అధ్యక్షుడి సహాయకుడు స్టీఫెన్ మిల్లర్ తదితరులు పాల్గన్నారు. ట్రంప్ ఏర్పాటు చేసిన విందులో ఇరు దేశాల అధ్యక్షుల మధ్యా ఏకాంత సమావేశం జరిగింది. అన్నివిధాలుగా పెట్టుబడులు పెట్టేందుకు వెనిజులా ఎంతో సానుకూలమైన దేశమని చెప్పేందుకు వివిధ శాఖాధికారులు డెల్సీ రోడ్రిగ్జ్ వెంట వెళ్ళారు. ఇంధనం, మైనింగ్, భద్రతారంగాలలో రెండు దేశాల మధ్యా సంబంధాలను బలోపేతం చేయడంలో ఈ సమావేశం చరిత్రాత్మకమైనదని రోడ్రిగ్జ్ అన్నారు. ఈ కొత్త దశలో ఇరుదేశాల మధ్యా ఉన్న చారిత్రక అనుబంధాన్ని ముందుకు నడిపించాల్సి ఉంటుందని టెలిగ్రామ్ ద్వారా ఆమె ఒక సందేశాన్ని అప్‌లోడ్ చేశారు.




## ఫలవంతం!

**(మొదటి పేజీ తరువాయి)**

చెప్పారు.''వారు (ఇరాన్) విజయంతంగా చర్చల దశను పూర్తిచేశారు, మధ్యవర్తులు తమ బాధ్యతలను కొనసాగిస్తారు,ఈ ప్రక్రియ నిర్మాణాత్మకంగా,ఆశాజనకంగా ఉంటుందని భావిస్తున్నాను'' అని ఎక్స్ వేదికగా విట్‌కాఫ్ పేర్కొన్నారు. విట్‌కాఫ్‌ను అరాఘ్చీ కలిశారని ఇరాన్ ప్రభుత్వ టీవీ ధృవీకరించింది.
మంగళవారంనాడు డోనాల్డ్ ట్రంప్ ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో మాట్లాడుతూ, గతంలో తరహాలోనే ఇరాన్‌కు తీవ్ర హెచ్చరిక చేశారు. అదేరోజు అబ్బాస్ అరాఘ్చీ–విట్‌కాఫ్ మధ్య సంభాషణలు జరిగాయి. పశ్చిమాసియా నుండి సైన్యాన్ని తగ్గించుకుని వెనక్కి మళ్ళించేందుకు అమెరికా చొరవ చూపించి సానుకూల చర్యలు ప్రారంభిస్తే వారంరోజుల వ్యవధిలోనే హోర్ముజ్ జలసంధిని తెరుస్తామని ఇరాన్ ఉన్నతస్థాయి అధికారి ఒకరి ద్వారా సందేశం బయటకు వచ్చిన వెంటనే ఈ చర్చలు జరిగాయి. హోర్ముజ్ జల సంధి
తెరచుకోవాలంటే తాము విధించిన ఏడు షరతులు అంగీకరించడం తప్ప అమెరికాకు మరోమార్గం లేదని ఇరాన్ ప్రకటించిన ఐదు రోజుల తర్వాత ఈ సమావేశం జరిగింది.
ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా దాడిచేసి ఆ దేశ సుప్రీం అధినేత ఆయొతొల్లా అలీ ఖమేనీ, ఆయన కుటుంబ సభ్యులు, ఇతర ఉన్నతాధికారులను హతమార్చింది. ఆ తర్వాత పశ్చిమాసియాలో అమెరికా మిత్రదేశాలపై ఇరాన్ దాడులతో తీవ్ర నష్టం కలగజేసింది. ఐఆర్‌జిసి సైనికులు హోర్ముజ్ జలసంధిని తమ అధీనంలోకి తెచ్చుకుని పూర్తిగా మూసివేశారు. దీంతో ప్రపంచదేశాలు తీవ్ర చమురు సంక్షోభంలో మునిగిపోయాయి.

**దురాక్రమణ అపేయమని చెప్పాం**
**నిరాశానిస్పృహతోనే ట్రంప్ హెచ్చరిక**

ఇరాన్‌పై ఎనిమిది నెలలుగా సాగిస్తున్న దురాక్రమణ చర్యలను తక్షణం ఆపేయాలని మధ్యవర్తి ఖతార్ ద్వారా అమెరికా ప్రతినిధిని కోరినట్లు ఇరాన్ విదేశీ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయీ చెప్పారు. ''అన్ని రంగాలలోనూ యుద్ధాన్ని ఆపేయాలి, ఆర్థిక యుద్ధాన్ని నిలిపివేయాలి,దురాక్రమణ ఇకమీదట కొనసాగకూడదు, ఇరాన్ అభిప్రాయాలను, షరతులను చాలా స్పష్టంగా వారికి తెలియజేశాం''అన్నారు. న్యూయార్క్‌లో మూడు గంటలసేపు అమెరికా–ఇరాన్ ప్రతినిధులమధ్య జరిగిన సమావేశ వివరాలను టెహ్రాన్‌లో ఆయన బుధవారం ప్రభుత్వ మీడియా''ఇర్నా''కు తెలియజేశారు. హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఓడరేవులకు ఎలాంటి నౌకలనూ రానివ్వకుండా సెంట్‌కామ్ అమలుచేస్తున్న దిగ్బంధన చర్యలు నిలిపివేయాలని, స్తంభింపజేసిన ఆస్తులను విడుదల చేయాలని, అమెరికా సైన్యాలను పశ్చిమాసియా నుండి వెలుపలికి తరలించాలనే డిమాండ్‌లతోపాటు ఇతర ముఖ్యాంశాలను కూడా అమెరికా ప్రతినిధికి తెలియజేసినట్లు చెప్పారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ట్రంప్ నిరాశానిస్పృహఅలతోనే ఇరాన్‌కు హెచ్చరికలు చేశారని బఖాయీ అన్నారు. ఈ వేదికవద్ద ఉన్న అనేక దేశాల దౌత్య వేత్తలు,ప్రతినిధుల అంచనా ప్రకారం, ట్రంప్ హెచ్చరికలు బలం నుండి వస్తున్నవికావు, నిరాశ నుండి,నిస్పృహనుండీ వస్తున్నాయి అన్నారు. అత్యంత బలమైన ఈ వేదికను చట్టవిరుద్ధమైన వ్యాఖ్యలకు ఉపయోగించడం వారి బలానికి నిదర్శనం కాదన్నారు.
కాగా ఇర్నా ప్రతినిధి సమాచారం ప్రకారం న్యూయార్క్‌లో అబ్బాస్ అరాఘ్చీ అనేక దేశాల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించారు. హోర్ముజ్ జలసంధిపైన,పశ్చిమాసియా యుద్ధం గురించి ఇరాన్ అనుసరిస్తున్న వైఖరిని వారికి తెలియజేశారు.ఇరాన్ తన వైఖరిని ప్రపంచదేశాలకు తెలియజేయడంకోసం ఈ కీలకమైన వేదికను సద్వినియోగం చేసుకుంటున్నదని ఇర్నా ప్రతినిధి పేర్కొన్నారు.

**నాశనం చెయ్యాలా? గొప్పదేశంగా మార్చాలా?**
**నాకున్నవి రెండే రెండు మార్గాలు : ట్రంప్**

జనరల్ అసెంబ్లీ సమావేశంలో ప్రసంగించిన డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై తన యుద్ధాన్ని పూర్తిగా సమర్థించుకున్నారు. ఇరాన్ విషయంలో తన ముందు రెండే రెండు మార్గాలున్నాయన్నారు. ఇరాన్‌ను అత్యున్నతమైన దేశంగా మార్చేందుకు ఒప్పందం చేసుకోవడం లేదా ఆ దేశాన్ని సర్వనాశనం చేయడం తన ముందున్న రెండు మార్గాలని ప్రపంచవేదికపై హెచ్చరిక చేశారు. ఇరాన్‌తో శాంతి ఒప్పందం చేసుకోవాలా? లేక ఆ దేశాన్ని నాశనం చేసి నరకతుల్యంగా మార్చాలా? అనే విషయంలో తాను ఇంకా ఒక నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అన్నారు.ఇరాన్ ఒక ఒప్పందానికి రాకపోతే ఆ దేశాన్ని పూర్తిగా నాశనం చేయడమే తనముందున్న ప్రత్యామ్నాయమన్నారు. ''పశ్చిమాసియాలో లేదా ప్రపంచంలోనే ఒక అత్యుత్తమ దేశంగా ఎదిగేందుకు ఒక చారిత్రాత్మక ఒప్పందాన్ని చేసుకోవడం ఒక మార్గం, లేదా భవిష్యత్ తరాలకు ఎంతమాత్రం మనుగడ లేకుండా అత్యంత వేగంగా సర్వనాశనం చెయ్యడం నా ముందున్న రెండు మార్గాలు'' అని ట్రంప్ జనరల్ అసెంబ్లీలో చెప్పారు.అమెరికాలో మధ్యంతర ఎన్నికల తర్వాత ఇరాన్ ఖచ్చితంగా తమతో ఒక ఒప్పందానికి వస్తుందని తాను గట్టిగా నమ్ముతున్నానన్నారు.ఐతే ఒకవైపు ట్రంప్ ఈ విధంగా హెచ్చరించినప్పటికీ రెండు దేశాల మధ్యా న్యూయార్క్ వేదికగా ఆశాజనకమైన పద్ధతిలో చర్చలు జరిగినట్లు అమెరికా ప్రతినిధి స్టీవ్‌విట్‌కాఫ్ స్పష్టం చేశారు.యుద్ధం ద్వారా చమురు ధరల ప్రభావం అమెరికా కాంగ్రెస్‌పై పడకుండా చూసుకునేందుకు ప్రస్తుతం ట్రంప్ ప్రభుత్వం ఇరాన్‌పై తీవ్రమైన ఆర్థిక ఒత్తిడి వ్యూహాన్ని అనుసరిస్తోంది. యుద్ధానికి ముందు ప్రపంచ అవసరాలలో 20 శాతం చమురు,సహజవాయువు హోర్ముజ్ జలసంధి ద్వారా రవాణా అయ్యేద. కానీ జలసంధి మూసుకుపోయిన తర్వాత చమురు మార్కెట్‌లో ధరలు పెరిగిపోవడానికి ట్రంప్ ప్రధాన కారకుడనే ముద్ర పడింది. నవంబరులో అమెరికా ద్వైవార్షిక ఎన్నికల నేపథ్యంలో ఈ సమస్యకు ఒక పరిష్కారం సాధించాలని ట్రంప్‌పై స్వదేశంలో ఒత్తిడి పెరిగింది. జనరల్ అసెంబ్లీలో చేసిన ప్రసంగంలో ఆర్థిక వ్యవస్థ,వలసలు,సరిహద్దు సమస్యలు,నేరాల అదుపుసహా తాను సాధించిన దేశీయ విజయాలను ట్రంప్ వివరించడం ఓటర్లను ఆకర్షించడమేనని విమర్శలు వచ్చాయి.అంతకుముందు ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ ప్రసంగిస్తూ, ప్రపంచంలో విభజనలు పెరుగుతున్నాయని, ప్రజలు ఒకరిపై ఒకరు ఆధారపడే ఐక్యత పెంచుకోవాలని కోరారు. కానీ ట్రంప్ అందుకు విరుద్ధంగా మాట్లాడారు.ఈ యుద్ధం ద్వారా ఇరాన్ అణ్వాయుధం పొందకుండా చేశామన్నారు.బలప్రయోగంతో శాంతికి ఉన్న విలువను నిరూపించామన్నారు. ఇరాన్‌ను గొప్ప దేశంగా తీర్చిదిద్దే ఒప్పందం వీలవుతుందా? లేక వారిని నాశనం చేసి నరకానికి పంపాలా? అని ట్రంప్ ప్రశ్నించారు.

## పట్టించుకోని జ్ఞానేష్ కుమార్

**(మొదటి పేజీ తరువాయి)**

మార్పులపై సంధు, జోషి విడివిడిగా క్యాబినెట్ కార్యదర్శికి లేఖ రాశారు. కొత్త ఓటర్లు తమను తాము నమోదు చేసుకోవడానికి ఉపయోగించే ఫారం 6లో చేసిన మార్పులను కూడా ఈ ఇద్దరు కమిషనర్లు వ్యతిరేకించారు. ఓటర్ల నమోదు నిబంధనలు, 1960కి సవరణలు చేయకుండా చట్టబద్ధమైన ఫారమ్‌ను మార్చడం సాధ్యం కాదని జోషి మే నెలలో నమోదు చేశారు. ఆ తర్వాత సంధు ఆయనతో ఏకీభవించారు. ఫారం 6కు చేసిన మార్పులను సంధు 'అనధికారికమైనవి, చట్టవిరుద్ధమైనవి'గా అభివర్ణించి, వాటిని తక్షణమే తొలగించాలని పిలుపునిచ్చారని ఆ నివేదిక పేర్కొంది. పశ్చిమ బెంగాల్‌లో ప్రత్యేక విస్తృత సవరణ (సర్) ప్రక్రియ సమయంలో ఓటర్ల జాబితాలో చేర్చబడిన ఓటర్లపై అప్పీళ్లు దాఖలు చేయడం, గోవాలో 97 మంది ఓటర్ల అర్హతపై స్థానిక ఎన్నికల అధికారులు నిర్ణయాలు నమోదు చేయకుండా నిరోధించిన సాఫ్ట్‌వేర్ సంబంధిత సమస్యల వంటి అంశాలు కూడా ఈ అభ్యంతరాలలో ఉన్నాయి.
కాగా, ఎన్నికల సంఘం అనేది ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇద్దరు ఎన్నికల కమిషనర్లతో కూడిన ముగ్గురు సభ్యుల రాజ్యాంగబద్ధమైన సంస్థ. కమిషన్‌ను నియంత్రించే 2023 చట్టం ప్రకారం, దాని కార్యకలాపాలు సాధ్యమైనంత వరకు ఏకగ్రీవంగా జరగాలి. భేదాభిప్రాయాలను మెజారిటీతో పరిష్కరించాలి. ఈ అభ్యంతరాల కాపీని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు పంపినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదించింది. ఇద్దరు కమిషనర్లు లేవనెత్తిన ఆందోళనలపై కమిషన్ అడిగిన ప్రశ్నలకు స్పందించలేదని ఆ నివేదిక పేర్కొంది.

**భిన్నమైన అభిప్రాయాలు సాధారణమే : ఇసి**

'సర్' ప్రక్రియపై భారత ఎన్నికల సంఘానికి చెందిన ఇద్దరు కమిషనర్లు అభ్యంతరాలు లేవనెత్తినట్లు కథనాలు రావడంతో ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి.
వాటిపై ఎన్నికల సంఘం స్పందిస్తూ సర్ ప్రక్రియపై నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా తీసుకున్నవే అని, ఈ విషయంలో ఎలాంటి అనుమానాలకుతావులేదని తెలిపింది. ఇవన్నీ ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల చట్టం నిర్దేశించిన చట్టబద్ధమైన విధానాల ప్రకారమే జరుగుతాయని తెలిపింది. ఏ సంస్థలోనైనా చర్చల సందర్భంగా భిన్నమైన అభిప్రాయాలు, పరిశీలనలు సాధారణమేనని, తమ ఆదేశాలన్నీ పూర్తి చట్టబద్ధమైన ఆమోదాన్ని కలిగి ఉంటాయని, నిర్ధారిత శాసనబద్ధమైన విధానాలను అనుసరిస్తాయని స్పష్టం చేసింది. ఎన్నికల వ్యవస్థను మెరుగుపరచడానికి కేవలం ముగ్గురు కమిషనర్లే కాకుండా, కమిషన్‌లోని ప్రతి అధికారికి కమిషన్‌కు తమ సూచనలు ఇచ్చే పూర్తి అధికారం ఉందని కూడా ఇసి ఒక ప్రకటనలో పేర్కొంది.
ముసాయిదా దశలలో కమిషన్ సభ్యులు లేవనెత్తిన ఏవైనా కార్యాచరణపరమైన ప్రశ్నలు లేదా సూచనలు ఓటర్ల హక్కులను పరిరక్షించే లక్ష్యంతో కూడిన ప్రామాణిక పరిపాలనా పద్ధతిలో భాగమేనని, కమిషనర్లు ఇచ్చిన సూచనలు ఎన్నికల ప్రక్రియలను మరింత మెరుగుపరచడానికేనని ఇసి తెలిపింది. ఆమోదాలు, నిర్ణయాలు, సూచనలు, కార్యక్రమాలతో కూడిన విస్తృత పరిధిని విస్మరిస్తూ, 10 నెలల కాలంలోని కొన్ని నిర్దిష్ట అంతర్గత గమనికలు లేదా పరిశీలనలను మాత్రమే హైలైట్ చేయడం మొత్తం చిత్రంలో ఒక భాగాన్ని మాత్రమే చూపిస్తుందని ఇసి పేర్కొంది.

## జూరాలకు నీరు

**(మొదటి పేజీ తరువాయి)**

త్వరగా జూరాలకు నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.కర్ణాటకలోనూ నీటి కొరత, ఇబ్బందులు ఉన్నప్పటికి తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నీటిని విడుదల చేసేందుకు కర్ణాటక ప్రభుత్వం అంగీకరించిందని మంత్రులు తెలిపారు.
ఇందుకు కర్ణాటక సిఎం డీకే శివకుమార్, నీటిపారుదల శాఖ మంత్రి చలువరాయస్వామి, మాజీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్. బోస్‌రాజు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ప్రిన్సిపల్ సెక్రటరీ (ఇరిగేషన్), సిఎం సలహాదారు, ఇతర అధికారులకు తెలంగాణ ప్రభుత్వం తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

**సిఎం ఆదేశాలతో నిరంతర సంప్రదింపులు**

ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 20న తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కర్ణాటక సిఎం డి.కె. శివకుమార్‌కు లేఖ రాశారని మంత్రులు తెలిపారు. అనంతరం కర్ణాటక ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ జూరాలకు నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. జూరాలతో పాటు భీమా, నెట్టెంపాడు, కోయిలాసాగర్ ప్రాజెక్టుల ఆయకట్టు పరిధిలోని రైతులు, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రులు భరోసా ఇచ్చారు. సాగు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

**ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజాప్రతినిధులతో నేడు సమావేశం**

జూరాల సహా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితిపై గురువారంమంత్రులు, ఎమ్మెల్యేలు, సాగునీటి శాఖ అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. జూరాల, భీమా, నెట్టెంపాడు, కోయిలాసాగర్ ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని సాగు, తాగునీటి అవసరాలకు అనుగుణంగా సమర్థవంతంగా వినియోగించుకునే విధానంపైసమావేశంలో సమగ్రంగా చర్చించనున్నట్లు వెల్లడించారు.
అందుబాటులో ఉన్న నీటి వనరులను ప్రణాళికాబద్ధంగా వినియోగిస్తూ ఆయకట్టు రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రులు స్పష్టం చేశారు.

## భిన్నాభిప్రాయాలు

**(మొదటి పేజీ తరువాయి)**

నేతృత్వంలోని డివిజన్ బెంచ్ విచారించింది. ధర్మాసనానికి నేతృత్వం వహించిన జస్టిస్ దీపాంకర్ దత్తా, ఈ పిటిషన్లు రాజ్యాంగ ప్రాముఖ్యత కలిగిన కీలకమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయని, వాటిని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించాలని కేంద్రం చేసిన వాదనను అంగీకరించడానికి నిరాకరించారు. ధర్మాసనంలోని మరో న్యాయమూర్తి జస్టిస్ సతీష్ చంద్రశర్మ, జస్టిస్ దీపాంకర్ దత్తా అభిప్రాయాలతో విభేదించారు. అయితే, సమర్థవంతమైన, అధికారిక తీర్పు కోసం తగినంతమంది సభ్యులతో కూడిన ధర్మాసనాన్ని ఏర్పాటుచేసే నిమిత్తం, ఈ విషయాన్ని పరిపాలనాపరంగా ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ముందు ఉంచాలని ఇద్దరు న్యాయమూర్తులు అంగీకరించారు. రాజ్యాంగపరమైన అంశాలను తేల్చడానికి శాశ్వత ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనాన్ని ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని ధర్మాసనం సిజెఐని కోరింది.
ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్లు (అపాయింట్‌మెంట్, సేవా నిబంధనలు, పదవీకాలం) చట్టం 2023 రాజ్యాంగ బద్ధతను సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్లను ధర్మాసనం విచారిస్తోంది. మార్చి 2, 2023న, కార్యనిర్వాహకవర్గ జోక్యం నుంచి సిఇసి, ఇసిల నియామాకాలను వేరుచేయడమే లక్ష్యంగా ఒక చరిత్రాత్మక తీర్పులో ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం, ప్రధానమంత్రి, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, సిజెఐలతో కూడిన కమిటీ సలహా మేరకు రాష్ట్రపతి వారి నియామకాలు చేస్తారని తీర్పు ఇచ్చింది.

# డిసెంబరులోపు భారత్–కెనడా వాణిజ్య ఒప్పందం

**టొరంటో :** భారత్–కెనడామధ్య వాణిజ్య చర్చలు డిసెంబరులోపే ముగుస్తాయి. జి–20 సమావేశాలు జరగడానికి ముందుగానే డిసెంబరులోపు ఇరు దేశాలమధ్యా వాణిజ్య చర్చలను ముగిస్తామని కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ చెప్పారు. రెండు దేశాలూ గడచిన మార్చి నెలలో సమగ్ర వాణిజ్య భాగస్వామ్య ఒప్పందంపై చర్చలు ప్రారంభించాయి. భారత్‌తో చర్చలలో మంచి పురోగతి సాధిస్తున్నామని చెప్పారు. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ కెనడా పర్యటన ఖరారైనట్లు తెలిసిందని, ఐతే ఖచ్చితమైన తేదీని తమకు తెలియజేయలేదని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా జరిగిన పత్రికాగోష్ఠిలో కార్నీ చెప్పినట్లు టొరంటోలో ఉన్న అధికార వర్గాలు ప్రకటించాయి. నిర్ణీత సమయంలోపే వాణిజ్య చర్చలను ముగించాలని ఇరు దేశాలు లక్ష్య నిర్దేశం చేసుకున్నట్లు చెప్పారు.జి–20 శిఖరాగ్ర సమావేశం మయామీలోని ట్రంప్ డోరల్‌లో డిసెంబరు 14–15 తేదీలలో జరగనున్నదని, ఆ లోపుగానే చర్చలు ముగిస్తామని తాను మోదీకి హామీ ఇచ్చానన్నారు.జస్టిన్ ట్రూడో ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో బ్రిటిష్ కొలంబియాలో 2023లో సిక్కు కార్యకర్త హర్దీప్‌సింగ్ నిజ్జార్ హత్య ఘటన తర్వాత భారత్–కెనడా సంబంధాలు బాగా దెబ్బతిన్నాయి. మార్క్ కార్నీ ప్రధానమంత్రిగా ఎన్నికైన తర్వాత ఈ సంబంధాలను ఆయన పునరుద్ధరించారు. భారత్‌లో పర్యటించారు.

## అరెస్టు చేయాలి

**(మొదటి పేజీ తరువాయి)**

కుమ్మకై దేశద్రోహానికి పాల్పడ్డాయని విమర్శించాయి. రాజ్యాంగంపై జరుగుతున్న ప్రత్యక్ష దాడి : రాహుల్'ఓట్ చోరీ'పై లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'ఓట్ల దొంగతనం' అనేది రాజ్యాంగంపై ప్రత్యక్ష దాడి అని, దీనికి బాధ్యులైన బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్, ఎన్నికల సంఘం దేశద్రోహానికి పాల్పడ్డాయని ఆరోపించారు. దీనికి సంబంధించి తప్పక న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం అధికారులు పాల్పడుతున్న చర్యలు దేశద్రోహంతో సమానమని, వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని తాను గతంలో హెచ్చరించిన వీడియోను బుధవారం ఎక్స్‌లో పంచుకున్నారు.

## రాజీనామా చేయాలి

**(మొదటి పేజీ తరువాయి)**

విడుదల చేసింది. ఎన్నికల సంఘంలో నెలకొన్న తీవ్ర సంక్షోభాన్ని 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' దర్యాప్తు బయటపెట్టిందని గుర్తు చేసింది. సిఇసి జ్ఞానేష్‌కుమార్ తీసుకున్నటువంటి నిర్ణయాలపై, ముఖ్యంగా సమగ్ర ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) 'ఫారం–6'కు, చేసిన 'చట్టవిరుద్ధమైన', 'అనధికారిక' మార్పులు, ఓటర్ల జాబితా సాఫ్ట్‌వేర్ కేంద్రీకరణ వంటి వాటిపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి 10నెలల కాలంలో కనీసం 14సార్లు అభ్యంతరాలు నమోదు చేశారని, నియంత్రణ కేంద్రీకరణపై వారు కేబినేట్ కార్యదర్శిని కూడా సంప్రదించారని సిపిఐ తెలియజేసింది.అయినప్పటికీ ఈ అభ్యంతరాలను వేటినీ పట్టించుకోకుండా ఆయన 'సర్'ను ముందుకు నెట్టారని, ఫలితంగా, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో 13 కోట్లకు పైగా ఓటర్లను తొలగించారని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం విమర్శించింది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు ఓటర్లను తమకు నచ్చినట్లుగా ఎంపిక చేసుకోవడానికి అనుమతించరాదని సిపిఐ నిరంతరం పదేపదే హెచ్చరిస్తూనే ఉందని, ఆయినా జ్ఞానేష్ కుమార్ తన తీరు మార్చుకోలేదని ఆక్షేపించింది.

# బాడ్మింటన్‌లో భారత్‌కు పతకం

## 40 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి




ఆసియా గేమ్స్‌లో భారత్ మరో పతకం సాధించింది. టీమ్ ఈవెంట్లో పురుషుల బాడ్మింటన్ టీమ్ బ్రాంజ్ మెడల్ నెగ్గింది. బుధవారం జరిగిన సెమీ ఫైనల్లో భారత్ 1–3 తేడాతో చైనా చేతిలో ఓటమి పాలైంది. ఈ పరాజయంతో ఫైనల్ చేరే అవకాశం కోల్పోయిన భారత్.. కాంస్యంతో సరిపెట్టుకుంది. అయితే వరుసగా ఆసియా గేమ్స్‌లో భారత్ రెండోసారి పతకం గెలవడం 40 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. 2023 హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో భారత్ రజతం సాధించిన సంగతి తెలిసిందే. అప్పుడూ కూడా ఫైనల్లో చైనా చేతిలోనే భారత్ ఓటమి పాలైంది. 1982, 1986 ఆసియా క్రీడల్లో కాంస్య పతకాలు సాధించిన తర్వాత.. 40 ఏళ్లకు మళ్లీ వరుసగా ఆసియా గేమ్స్‌లో భారత్ పతకాలు సాధించింది.

**లక్ష్యసేన్ ఓడినా...** ప్రపంచ 14వ ర్యాంకర్ లక్ష్యసేన్ తొలి సింగిల్స్‌లో చైనా ఆరో ర్యాంకర్ షి యూకీ చేతిలో ఓటమి పాలయ్యాడు. వరుస గేముల్లో 16–21, 18–21తో పరాజయం చెందాడు. దాంతో చైనా 1–0 ఆధిక్యంలోకి వెళ్లింది. తొలి మ్యాచ్‌లో ఓడినా.. సాత్విక్ చిరాగ్ జోడీ భారత్‌ను ఆదుకుంది. పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేతలు, ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్లు లియాంగ్ వెయ్ కెంగ్‌వాంగ్ చాంగ్‌తో తలపడిన భారత జోడీ అద్భుతంగా ఆడింది. 21–11, 22–20తో చైనా డబుల్స్ జోడీని ఓడించి భారత్‌ను 1–1తో సమం చేసింది. దాంతో ఫైనల్ ఆశలు చిగురించాయి. కానీ మూడో మ్యాచ్‌లో 20 ఏళ్ల ఆయుశ్ శెట్టి ఓటమిపాలై తీవ్రంగా నిరాశపర్చాడు. ప్రపంచ 12వ ర్యాంకర్ లీ షి ఫెంగ్ చేతిలో 19–21, 13–21 తేడాతో ఓటమి పాలయ్యాడు. దాంతో చైనా 2–1 తేడాతో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. చివరి డబుల్స్ మ్యాచ్‌ల్లోనూ భారత్ ఓడిపోవడంతో ఫైనల్ ఆశలు నీరుగారాయి. ప్రపంచ 25వ ర్యాంకులో ఉన్న ఈ జోడీ.. హీ జీ టింగ్‌లియు యీ జోడీ చేతిలో హరిహరన్ అంసకరుణన్ ఎంఆర్ అర్జున్ జోడీ ఓటమిపాలైంది. దాంతో చైనా 3–1తో విజయం సాధించి ఫైనల్లోకి దూసుకెళ్లింది. భారత్ కాంస్య పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

# అక్టోబర్ 1న ఐఎల్‌టి 20 వేలం







ఇంటర్నేషనల్ టి–20 లీగ్ వేలానికి సమయం దగ్గరపడింది. అక్టోబర్ 1వ తేదీన దుబాయ్‌లో ఆక్షన్ జరుగనుంది. ఐసిసి అకాడమీ ఇండోర్ ఫెసిలిటీలో నిర్వహించనున్న వేలంలో 20 దేశాలకు చెందిన ఆటగాళ్లు పేర్లు నమోదు చేసుకున్నారు. అయితే.. ఈసారి ఎనిమిది వందలకు పైగా క్రికెటర్లు రిజిష్టరవ్వగా.. వడబోత అనంతరం రెండొందల మంది మాత్రమే వేలంలో నిలిచారని నిర్వాహకులు వెల్లడించారు. దుబాయ్ వేదికగా ఐఎల్‌టి 20 వేలం జరుగుంది. అక్టోబర్ 1వ తేదీన అక్కడి ఐసిసి అకాడమీ ఇండోర్ ఫెసిలిటీలో ఆక్షన్ ఉండనుంది. వేలానికి మరో తొమ్మిది రోజులే ఉండడంతో.. ప్రతి ఫ్రాంచైజీ వద్ద ఎంత డబ్బుంది? ఎంత మంది క్రికెటర్లు వేలంలో ఉన్నారు? ఎన్ని స్లాట్లు ఖాళీగా ఉన్నాయి? అనేవి కీలకంగా మారాయి. ఈసారి ప్రతి ఫ్రాంచైజీ 13 లక్షల అమెరికన్ డాలర్లు(భారతీయ కరెన్సీలో రూ.12.42 కోట్లు) ఖర్చు చేయనుంది. అయితే.. రిటెన్షన్కు దాదాపు రూ.6 కోట్లు పోగా.. మిగతా ఆరు కోట్లలో అవసరమై ఆటగాళ్లను కొనేందుకు సిద్ధమవుతున్నాయి ఫ్రాంచైజీలు.

**కనీసం 18 మంది...** ఐఎల్‌టి 20 సీజన్ 2026 వేలం కోసం క్రికెటర్లు జులై సెప్టెంబర్ మధ్య పేర్లు నమోదు చేసుకున్నారు. వేలం అనంతరం ప్రతి జట్టులో కనీసం 18మంది.. గరిష్టంగా 23 మంది ప్లేయర్లు ఉండాలి. ఇందులో.. ఐసిసి పూర్తి సభ్య దేశాల నుంచి కనీసం 11 మంది (అఫ్గనిస్థాన్ నుంచి కనీసం నలుగురు, ఐర్లాండ్ నుంచి ఒకరు) ఉండాలని, యూఏఈ నుంచి నలుగురు, కువైట్ నుంచి ఒకరు, సౌదీ అరేబియా నుంచి ఒకరు, ఐసిసి అనుబంధ దేశాలైన యెఎఇ, కువైట్, సౌదీ అరేబియా నుంచి ఒకరిని తీసుకోవాలని ఐఎల్‌టి 20 నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఇక ఆటగాళ్ల అందరి కనీస ధర విషయానికొస్తే.. రూ.9.55 ఉండాలి. అయితే.. కొందరి ధర రూ.38 లక్షల నుంచి రూ.76 లక్షలు ఉండే అవకాశముంది.

# హెలెనా దీవిలో బానిసత్వపు విషాద చరిత్ర






డెన్మార్క్‌లోని కోపెన్‌హాగన్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులతో కూడిన అంతర్జాతీయ బృందం, దక్షిణ అట్లాంటిక్ మహాసముద్రంలోని సెయింట్ హెలెనాదీవిలో లభించిన 152 మంది మాజీ బానిసల అవశేషాలపై కీలకమైన పరిశోధన చేసింది. 2007, 2008 సంవత్సరాల్లో అక్కడ నిర్మాణ పనులకు ముందు జరిపిన తవ్వకాల్లో ఈ మానవ అవశేషాలు బయటపడ్డాయి. 1807లో బ్రిటిష్ సామ్రాజ్యంలో బానిస వ్యాపారాన్ని నిషేధించిన తర్వాత, ఆ నిషేధాన్ని అమలు చేయడానికి బ్రిటిష్ రాయల్ నేవీ బానిస నౌకలను అడ్డుకునే చర్య లు చేపట్టింది. ఆ సమయంలో పట్టుబడిన సుమారు 27,000 మంది ఆఫ్రికన్లను సెయింట్ హెలెనా దీవికి తరలించారు. వీరిలో చాలామంది కాంగో, బెంగ్వేలా వంటి మధ్య ఆఫ్రికా భాషలు మాట్లాడే వారని అప్పటి నేవీ అధికారులు నమోదు చేశారు. అయితే తీవ్రమైన పోషకాహార లోపం, అనారోగ్యం కారణంగా దాదాపు 8,000 మంది అక్కడే మరణించారు. పరిశోధకులు వారి దంతాల్లోని 'స్ట్రాన్షియం ఐసోటోప్' నిష్పత్తులను విశ్లేషించి, వారి బాల్యం ఎక్కడ గడిచిందో తెలుసుకున్నారు. ఈ అధ్యయ నం ప్రకారం చాలామంది పశ్చిమ మధ్య ఆఫ్రికా తీర ప్రాంతాలకు చెందిన వారని తేలింది. మరికొందరు అంతర్భాగ ప్రాంతాల్లో పెరిగినట్లు ఆధారాలు లభించాయి. అంటే వారిని బానిసలుగా పట్టుకుని తీర ప్రాంతాలకు తీసుకురావడానికి ముందు, వారు భూభాగం మీదుగా చాలా దూరం ప్రయాణించాల్సి వచ్చిందని అర్థమవుతోంది. పరిశోధకులు కనుగొన్న వివరాల్లో ఒక వ్యక్తి జీవితం ప్రత్యేకంగా ప్రస్తావించబడింది. 19 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సులో మరణించిన ఆ వ్యక్తి, చిన్ననాట అంగోలాలోని అంతర్భాగ ప్రాంతంలో నివసించాడు. ఏడు నుంచి తొమ్మిది సంవత్సరాల వయస్సులో అతడిని తీర ప్రాంతానికి తరలించారు. పరిశోధకుడు హానెస్ ష్రోడర్ అభిప్రాయం ప్రకారం, ఈ బలవంతపు తరలింపు అతడి బానిసత్వంతో సంబంధం కలిగి ఉండవచ్చు. దంతాల నుంచి సేకరించిన డిఎన్ఏ విశ్లేషణ కూడా ఈ వ్యక్తులు ప్రస్తుత గాబన్, ఉత్తర అంగోలా ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల జన్యు వారసత్వంతో సంబంధం కలిగి ఉన్నారని వెల్లడించింది. ఈ పరిశోధన కేవలం పురావస్తు అధ్యయనం మాత్రమేగాక, అట్లాంటిక్ బానిస వ్యాపారం లక్షలాది ఆఫ్రికన్ల జీవితాలను ఎలా ఛిన్నాభిన్నం చేసిందో చూపించే మానవ చరిత్రకు సంబంధించిన ఆధారం. ఎవరెక్కడి నుంచి వచ్చారు, వారిని ఎలా బలవంతంగా తరలించారు, బానిసత్వం వారి కుటుంబాలు, సంస్కృతులు, జీవన విధానాలను ఎలా ప్రభావితం చేసిందనే విషయాలను శాస్త్రీయ ఆధారాలతో అర్థం చేసుకోవడానికి ఇటువంటి పరిశోధనలు సహాయపడుతున్నాయి.



## అఫ్గాన్ శాసనంలో కనిష్కుడి ప్రస్తావన

అఫ్గానిస్థాన్‌లో లభించిన ఒక శాసనంలో కనిష్కుడి ప్రస్తావన ఉంది. బాక్ట్రియన్ మరియు గ్రీకు లిపిలో రాసిన 23 పంక్తులు గల ఈ శాసనాన్ని రబాటక్‌లో కనుగొన్నారు. అందులో కనిష్కుడితోపాటు అతని తండ్రి, తాత, ముత్తాత పేర్లు కూడా ఉన్నాయి. నారత దేశంలోని ఆరు ప్రధాన నగరాల ప్రస్తావన ఈ శాసనంలో కనిపిస్తుంది. వాటిలో సాకేత ఒకటి. కనిష్కుడి కాలంలో సాకేత ఉన్నత హోదా కలిగిన నగరం. ఆ శాసనంలో సాకేత 'జాగేద'గా జాబితా చేశారు. బాక్ట్రియన్ భాషలో, 'ఎస్' అక్షరం 'జెడ్'గా మారుతుంది. కనిష్కుడి శాసనంలో జాగేద అనే పేరు టోలెమీ భౌగోళికంలో సాగేద అనే పేరుతో సమానంగా ఉంటుంది. టోలెమీ భౌగోళికంలో సాగేద అనే పేరు ఆపేరుతో సమానంగా కనిపిస్తుంది.

## మూడువేల ఏళ్లనాటి చిత్రాలలో వ్యంగ్యం



ప్రాచీన ఈజిప్టులో కూడా హాస్య భావం, చమత్కారం.. వ్యంగ్యం ఉండేవని చూపించే అరుదైన ఉదాహరణ ఇది. 'డీర్ ఎల్‌మెడీనా' అనే రాజభవన శిల్పుల గ్రామం నుండి లభించిన ఒక చిన్న సున్నపురాయి పైచిత్రాన్ని సుమారు మూడు వేల ఏళ్ల నాటి ప్రాచీన మీమ్‌గా పేర్కోవచ్చు. ఈ చిత్రం క్రీస్తుపూర్వం 1295–1069 మధ్యకాలమైన రామెసీడ్ యుగానికి చెందినది. అందులో ఒక నిలుచున్న పిల్లి, చేతిలో ఒక పాత్ర (కలశం), తామరపువ్వుతో, మరో కూర్చొని ఉన్న పిల్లికి సుగంధాన్ని అందిస్తున్నట్లు ఉంది. పక్కన ఒక మేకను కూడా చిత్రించారు. అంటే ఇది మనిషి ప్రవర్తనను జంతువులు అనుకరిస్తూ చేసే వినోదాత్మక చిత్రణ. ఆ చిత్రానికి మూడు పంక్తుల హియరాటిక్ లిపిలో వ్యాఖ్యలు లేదా శీర్షికలు కూడా ఉన్నాయి. అవి చిత్రంలోని చమత్కారాన్ని మరింతగా అర్థమయ్యేలా చేసినట్టు అనిపిస్తుంది. ఇలాంటి చిత్తరువులను ఒస్ట్రకా అని పిలుస్తారు. ఇవి సాధారణంగా చిప్పలపై లేదా సున్నపురాయి ముక్కలపై రాజభవన చిత్రకారులు, శిల్పులు విరామ సమయంలో వేసుకునే హాస్యాత్మక చిట్టచిత్రాలు. ఈజిప్టు కళాకారులు తరచుగా ప్రపంచాన్ని తలకిందులుగా చూపడానికి ఇష్టపడేవారు. సాధారణంగా బానిసలుగా ఉండే జంతువులు ఇక్కడ యజమానులుగా కనిపించేవిపందులు విందులు ఇస్తూ, ఎలుకలు పిల్లులకు సేవ చేస్తూ, లేదా పిల్లులు మానవుల వలె పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉండేవి. ఈ సున్నపురాయి చిత్రరేఖ రామెసీడ్ కాలానికి (19వ, 20వ వంశం, సుమారు క్రీస్తు పూర్వం 1295–1069) చెందినది. ఇది డీర్ ఎల్‌మెడీనా తవ్వకాల్లో బయటపడింది. తరువాత అలెగ్జాండ్ర్ వరిల్ సేకరణలో ఉండి, 2007లో డ్రూయోరి షెల్యూ వేలంలో ఇది అమ్ముడైంది. ప్రస్తుతం ఇది పారిస్‌లోని మ్యూసీ దు లూవ్ర్ భవనంలోని సల్లి విభాగంలో, ది న్యూ కింగ్డమ్: ది ఏజ్ ఆఫ్ ది రామెసైడ్స్ విభాగంలో ప్రదర్శనకు ఉంది.

## మెడికల్ కాంట్రాక్టు కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించాలి

### ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు విలాస్ డిమాండ్




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో బుధవారం నిర్మల్‌లోని జడ్జి ఖానా ఆసుపత్రి ప్రాంగణంలో కాంట్రాక్టు కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.విలాస్ ముఖ్య అతిథిగా హాజరు కాగా, జిల్లా ఉపాధ్యక్షులు భూక్యా రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలాస్ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు ప్రతి నెలా 5న వేతనాలు చెల్లించాలని కోరారు. సెప్టెంబర్ నెల పూర్తవుతున్నప్పటికీ, ఆగస్టు నెల జీతాలు ఇవ్వకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం రూ.26,000 చెల్లిస్తేనే వారి కుటుంబ అవసరాలు తీరుతాయన్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భూక్యా రమేష్ మాట్లాడుతూ వచ్చే సోమవారంలోగా పెండింగ్ జీతాలు చెల్లించకపోతే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. కార్మికులకు సమయానికి జీతాలు చెల్లించలేని కాంట్రాక్టర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు రాజేందర్, సాయి, పోశెట్టి, సరస్వతి, భాగ్యలక్ష్మి, సంగీత తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం, విద్యాహక్కు పరిరక్షణకు నిరంతర పోరాటాలు

### ఎఐఎస్ఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** విద్యార్థుల సమస్యల పరిష్కారం, విద్యాహక్కు పరిరక్షణకు ఎఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని సమాఖ్య నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి బలముల ప్రేమ్ కుమార్ అన్నారు. అచ్చంపేటలోని ప్రగతి జూనియర్ కళాశాలలో ఎఐఎస్ఎఫ్ అచ్చంపేట నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఎఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవ ముగింపు వేడుకల పోస్టర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ మల్లయ్యతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 28,29,30 తేదీల్లో హనుమకొండ జిల్లా కేంద్రంగా నిర్వహించనున్న ఎఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవ ముగింపు వేడుకలకు విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఫెలోషిప్‌లు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల కోసం జరిగే పోరాటాలకు మరింత బలం చేకూర్చేందుకు హనుమకొండలో జరిగే వేడుకలకు విద్యార్థులు, యువత భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు ఫన్నీ అర్జున్, శిల్ప, కళ్యాణి, పవన్, రవి, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ చెల్లింపులపై అదనపు చార్జీలు తగవు

### వెంటనే ఉపసంహరించుకోవాలని
### ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ







**ప్రజాపక్షం/కాప్రా :** కేంద్రప్రభుత్వం అమలులోకి తేనున్న డిజిటల్ పేమెంట్లపై అదనపు చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు కె.ధర్మేంద్ర డిమాండ్ చేసారు. బుధవారం ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఇసిఐఎల్‌లోని అంబేడ్కర్ కూడలి వద్ద డిజిటల్ పేమెంట్లపై అదనపు చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలు, విద్యార్థులు, కార్మికులు, చిరు వ్యాపారుల రోజు వారీ జీవితంలో తప్పనిసరిగా మారిన యుపిఐ చెల్లింపులపై ఎండిఆర్ పేరిట కేంద్ర ప్రభుత్వం అదనంగా వసూలు చేయనున్న చారీల ప్రభావం భారీగా కనపడుతుందన్నారు. ఈ నూతన విధానంలో రూ. 2 వేలకు మించిన చెల్లింపుల లావాదేవీలపై ఎండిఆర్ రుసుములు చివరికి సామాన్య జనమే భరించాల్సి వస్తుందని, దీని వల్ల నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై ప్రభావం పడుతుందన్నారు. పెట్రోల్ ఉత్పత్తులు, వంట గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను ఆకాశాన్నంటుతున్న తరుణంలో కేంద్రప్రభుత్వం పరోక్షంగా ఎండిఆర్ పేరిట అదనపు వసూళ్లకు తెరలేపిందని విమర్శించారు. అచ్చే దిన్ అంటూ ప్రజలను దోచుకోవటం కాదా అని బిజెపి ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సల్మాన్ బేగ్, టి.సత్యప్రసాద్‌లు మాట్లాడుతూ నగదు లావాదేవీల స్థానంలో ఎలాంటి అదనపు చార్జిలు ఉండవంటూ విస్తృత ప్రచారంతో డిజిటల్ చెల్లింపు విధానాన్ని ప్రజలకు అలవాటు చేసిన కేంద్ర ప్రభుత్వం తాజాగా ఎండిఆర్‌ల పేరిట ప్రతి రెండు వేల లావాదేవీలపై అదనపు చార్జీలు విధించటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు రాజ్‌కుమార్, శేఖర్, గిరి బాబు, అక్రమ్, సచిన్, నదీమ్, కిరణ్, ప్రదీప్, నర్సింహ, కీర్తన్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

**యాదగిరిగుట్ట :** యుపిఐ చార్జీలను నిరసిస్తూ బుధవారం యాదగిరిగుట్టలో ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ పేరబోయిన మహేందర్ మాట్లాడుతూ డిజిటల్ ఇండియా పేరుతో ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన విధానం ప్రకారం రూ.2,000కు మించిన వ్యక్తివ్యాపారి లావాదేవీలపై 0.4 శాతం వ్యాపారి రుసుము, అలాగే రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువ లావాదేవీలపై గరిష్ఠంగా రూ.300 వరకు వర్తింపజేయడం దారుణమన్నారు. వ్యక్తిగత లావాదేవీలు మరియు రూ.2,000 లోపు వ్యాపారి లావాదేవీలు ఉచితంగానే కొనసాగుతాయని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఈ రుసుముల విధానం భవిష్యత్తులో చిన్న వ్యాపారులు, స్వయం ఉపాధి పొందుతున్న యువతపై తీవ్ర ఆర్థిక ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. సుమారు 96 శాతం లావాదేవీలపై ప్రభావం ఉండదని ప్రభుత్వం పేర్కొన్నప్పటికీ, మిగిలిన లావాదేవీలపై రుసుము విధించే విధానాన్ని ప్రజా ప్రయోజనాల కోణంలో పునఃసమీక్షించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి, కౌన్సిలర్ బబ్బూరి శ్రీధర్, సహాయకార్యదర్శి పేరబోయిన బంగారు, ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి కంబాల వెంకటేష్, నాయకులు ఆనంతుల నర్సింహ, శెట్టి నర్సింహ, సంగి అరవింద్, బండ రామచందర్, ఒంటెద్దు సంజీవ, పేరబోయిన సత్యనారాయణ, ప్రశాంత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకిచ్చిన హామీల అమలు ఏదీ?

### మహిళా సమాఖ్య యాదాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** ఎన్నికల సమయంలో మహిళలకిచ్చిన హామీల అమలేదని మహిళా సమాఖ్య యాదాద్రి జిల్లా ప్రధానకార్యదర్శి బండి జంగమ్మ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం భువనగిరి పట్టణంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో బండి జంగమ్మ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు గ్యాస్ సబ్సిడీతో పాటు ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం అందించాలని కోరారు. అర్హులైన వారందరికీ వితంతు, ఒంటరి మహిళలకు పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు నిరంతరం పెరుగుతున్న నేపథ్యంలో ధరల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళలపై జరుగుతున్న దాడులు, వేధింపులను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత కఠినమైన చర్యలు చేపట్టాలన్నారు. మహిళలకు భద్రత కల్పించడంతో పాటు వారి ఆర్థిక, సామాజిక హక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాలని బండి జంగమ్మ కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళా సమస్యలపై మహిళా సమాఖ్య చేపడుతున్న కార్యక్రమాలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. మహిళల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు వాటి పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమాలను నిర్వహించాలని సూచించారు. సమావేశంలో మహిళా సమాఖ్య జిల్లా గౌరవ అధ్యక్షురాలు గుర్రం రాజమణి, నాయకులు అరే పుష్ప, మాటూరి జానమ్మ, యానాల సంధ్య, కౌసల్య, మంగమ్మ, జయమ్మ, చంద్రకల, కిష్టమ్మా, యాదమ్మ, మాధవి తదితరులు పాల్గొన్నారు.




## రిమ్స్‌లో ఐదుగురు పసికందుల మృతి అత్యంత విషాదకరం

### బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించాలి
### ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీమాన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఐదుగురు పసికందులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మర్రి శ్రీమాన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నెర్లికంటి శ్రీకాంత్ అన్నారు. చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన చిన్నారులకు పూర్తి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ఐదుగురు పసికందుల ప్రాణాలు కోల్పోవడం వారి కుటుంబాలకు తీరని లోటని, బాధిత కుటుంబాల కన్నీటికి ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ ఘటనకు దారితీసిన కారణాలతో పాటు ఆసుపత్రిలోని ఫైర్ సేఫ్టీ వ్యవస్థ, విద్యుత్ పరికరాల నిర్వహణ, అత్యవసర నిష్క్రమణ మార్గాలు తదితర అంశాలపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. విచారణలో వెల్లడైన వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు. మృతిచెందిన ప్రతి చిన్నారి కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే తగిన ఆర్థిక పరిహారం అందించాలని, ప్రమాదానికి నిర్లక్ష్యం లేదా భద్రతా లోపాలు కారణమని తేలితే బాధ్యులపై చట్టపరమైన కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఫైర్ సేఫ్టీ, విద్యుత్ వ్యవస్థలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలపై ప్రత్యేక భద్రతా ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా నవజాత శిశువుల విభాగాల్లో 24 గంటల అత్యవసర భద్రతా, స్పందన వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రమాదంలో గాయపడిన చిన్నారులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు వారి కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని ప్రభుత్వం అందించాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు చేయాలని అన్నారు.

# యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో
# దసరాలోపు పూర్తి స్థాయిలో ఉత్పత్తి

## విద్యుత్ శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దసరాలోపు యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పూర్తి స్థాయిలో ఉత్పత్తి చేయాలని ముఖ్యమంత్రి యనుముల రేవంత్ రెడ్డి ఆదేశించారు. విద్యుత్ శాఖపై ఎంసీఆర్ హెచ్ఆర్డీలో బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్షించారు. యాదాద్రి థర్మల్ కేంద్రంలో పూర్తి స్థాయి విద్యుత్ ఉత్పత్తి చేయకపోవడంపై అధికారులను సీఎం, డిప్యూటీ సీఎం ప్రశ్నించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తికి జీ 9 బొగ్గు అవసరమని అధికారులు తెలిపారు. సింగరేణి లో జీ 9 బొగ్గు ఉత్పత్తి చేసే బ్లాకులు లేవని, సమీప భవిష్యత్తులోనూ సింగరేణి నుంచి జీ 9 బొగ్గు ఉత్పత్తి అయ్యే అవకాశం లేదనీ అధికారులు వివరించారు. జీ 9 బొగ్గు లభ్యత లేనప్పుడు ఆ సాంకేతికతతో ఎలా యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మించారని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రశ్నించారు. పిట్ హెడ్ (బొగ్గు గనుల పైనే విద్యుత్ కేంద్ర నిర్మాణం) కాకుండా, దూరంగా ఎందుకు యాదాద్రి థర్మల్ కేంద్రం నిర్మించారని, దానికి బొగ్గు సరఫరాతో రాష్ట్రంపై పడే అదనపు భారం ఎంత అని అధికారులను సీఎం, డిప్యూటీ సీఎం ప్రశ్నించారు. నాడు రాజకీయ కారణాలతోనే పిట్ హెడ్ పై కాకుండా దూరంగా యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మించారని అధికారులు వెల్లడించారు. యాదాద్రికి బొగ్గు సరఫరాతో తెలంగాణ రాష్ట్రంపై రూ. 40 వేల కోట్ల అదనపు భారం పడుతోందని అధికారులు తెలిపారు. సింగరేణి నుంచి జీ 9 బొగ్గు కు ఉన్న అవకాశాలపై సీఎం, డిప్యూటీ సీఎం ఆరా తీశారు. గత ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనకపోవడంతో జీ 9 బొగ్గును సింగరేణి సరఫరా చేయలేదని తేల్చిచెప్పిన అధికారులు. సింగరేణిలో ఇప్పటికే 14 బొగ్గు బ్లాకులు మూతపడ్డాయని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న విద్యుత్ అవసరాల దృష్ట్యా మహానది కోల్ ఫీల్డ్స్, కోల్ ఇండియా నుంచి బొగ్గు కొనుగోలుకు చర్యలు ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. తక్షణమే కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో చర్చించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.

# దక్షిణ మధ్య రైల్వేలో తొలిసారి 'కవచ్ 4.0'

## మల్కాజిగిరి-కామారెడ్డి మధ్య అమలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైలు భద్రతలో భారతీయ రైల్వే మరో కీలక ముందడుగు వేసింది. దక్షిణ మధ్య రైల్వేలో తొలిసారిగా అధునాతన 'కవచ్ 4.0'ను అందుబాటులోకి తీసుకొచ్చింది. హైదరాబాద్ డివిజన్‌లోని మల్కాజిగిరి–కామారెడ్డి మధ్య 108 రూట్ కిలోమీటర్ల మార్గంలో ఉన్న కవచ్ 3.2ను 4.0 వెర్షన్‌కు విజయవంతంగా అప్‌గ్రేడ్ చేశారు. దీంతో ఈ మార్గంలో రైళ్ల నిర్వహణ మరింత సురక్షితంగా, సమర్థంగా సాగేందుకు సాంకేతిక సామర్థ్యం పెరిగింది.ఈ మార్గాన్ని దక్షిణ మధ్య రైల్వే జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ పరిశీలించారు.దక్షిణ మధ్య రైల్వేలో ఇప్పటికే 1,465 రూట్ కిలోమీటర్ల మేర కవచ్ 3.2ను అమలు చేసిన అనుభవంతో కొత్త వెర్షన్‌లో మరిన్ని సాంకేతిక మెరుగుదలలు తీసుకొచ్చారు. రైలు స్థానాన్ని మరింత కచ్చితంగా గుర్తించడం, పెద్ద రైల్వే యార్డుల్లో సిగ్నళ్ల సమాచారాన్ని మెరుగ్గా అందించడం, స్టేషన్ నుంచి స్టేషన్‌కు ఆప్టికల్ ఫైబర్ కేబుల్ (ఓఎఫ్‌సీ) ద్వారా కవచ్ అనుసంధానం, ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థలతో నేరుగా అనుసంధానం వంటి కీలక మార్పులు ఇందులో ఉన్నాయి. కవచ్ భారతీయ రైల్వే స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఎటిపి) వ్యవస్థ. రైలు నిర్దేశిత వేగ పరిమితుల్లో నడిచేలా లోకో పైలట్‌కు సహకరించడంతో పాటు, అవసరమైన సమయంలో లోకో పైలట్ స్పందించకపోతే స్వయంచాలకంగా బ్రేకులు వేసే విధంగా ఇది పనిచేస్తుంది. ప్రమాదకర పరిస్థితుల్లో సిగ్నల్‌ను దాటి వెళ్లడం, అధిక వేగం, ఢీకొనే ప్రమాదాలను తగ్గించడంలో కవచ్ కీలకంగా పనిచేస్తుంది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ సురక్షిత రైలు నిర్వహణకు ఇది దోహదపడుతుంది. కవచ్ అమలుకు స్టేషన్లు, బ్లాక్ సెక్షన్లలో స్టేషన్ కవచ్, ట్రాక్ పొడవునా ఆర్ఎఫ్ఐడి ట్యాగ్‌లు, టెలికమ్యూనికేషన్ టవర్లు, ట్రాక్ వెంట ఆప్టికల్ ఫైబర్ కేబుల్, రైళ్లలో లోకో కవచ్ వంటి విస్తృత సాంకేతిక మౌలిక వసతులు అవసరమవుతాయి.

# డిజెలు, బాణసంచాకు దూరంగా ఉండాలి

## డిజిపి సి.వి. ఆనంద్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా హైదరాబాద్‌లో సుమారు 30 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డిజిపి సి.వి. ఆనంద్ తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో నిమజ్జన ఏర్పాట్లు పూర్తి చేశామని, మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. నిమజ్జన ఊరేగింపుల్లో డిజెలు, బాణసంచాకు దూరంగా ఉండాలని ఉత్సవ కమిటీలకు సూచించారు. ఖైరతాబాద్ మహాగణపతిని బుధవారం దర్శించుకున్న డిజిపి.. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, గణనాథుడి ఆశీస్సులు అందరికీ లభించాలని ఆకాంక్షించారు. సెంట్రల్ జోన్ డిసిపిగా పనిచేసినప్పటి నుంచి ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలతో తనకు 13 ఏళ్ల అనుబంధం ఉందని గుర్తుచేశారు. ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరిస్తున్న కమిటీ సభ్యులకు, పోలీసు, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. గణేష్ ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో నేడు,రేపు భారీ సంఖ్యలో నిమజ్జనాలు జరిగే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లో సిపిలు, ఎస్‌పిలు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. జిహెచ్ఎంసి, విద్యుత్, జలవనరులు తదితర శాఖలతో సమన్వయంతో ఏర్పాట్లు చేశామని, హుస్సేన్‌సాగర్‌తో పాటు వివిధ నిమజ్జన ప్రాంతాల్లో అవసరమైన క్రేన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నిమజ్జన ఊరేగింపు మార్గాల్లో చోరీలు, మహిళల పట్ల వేధింపులను అరికట్టేందుకు షీ టీమ్స్, టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దించామని తెలిపారు. ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు. డిజెలు, బాణసంచా వినియోగంపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలు అమల్లో ఉన్నాయని డిజిపి గుర్తుచేశారు. అధిక శబ్దాలతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడే అవకాశం ఉన్నందున ఉత్సవ కమిటీలు స్వచ్ఛందంగా డిజెలు, బాణసంచాకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి గణేష్ నిమజ్జనాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలని సి.వి.ఆనంద్ కోరారు.

## 28 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు
# బిజెపి ఇన్‌ఛార్జీలు

## తెలంగాణకు భన్సాల్, ఆంధ్రాకు అరవింద్



**న్యూఢిల్లీ:**దేశంలోని 28 రాష్ట్రాలు,కేంద్ర పాలిత ప్రాంతాలకు భారతీయ జనతాపార్టీ ఇన్‌ఛార్జీలను,వారికి సహాయకులను నియమించింది. తెలంగాణ రాష్ట్రానికి బిజెపి ఇన్‌ఛార్జిగా సునీల్ భన్సాల్,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అరవింద్ భదౌరియాలను నియమించారు.సునీల్ భన్సాల్ ఇప్పటికే పశ్చిమ బెంగాల్ రాష్ట్ర బాధ్యతలు నిర్వహిస్తున్నారు.అదేవిధంగా హర్యానా–ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు ఇన్‌ఛార్జి బాధ్యతలను సీనియర్ నాయకురాలు,జాతీయ ప్రధాన కార్యదర్శి స్మృతి ఇరానీకి అప్పగించారు.పార్టీ ఉపాధ్యక్షుడు రామ్ మాధవ్ తమిళనాడు–ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు రాజకీయ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తారు.వచ్చే ఏడాది ఎన్నికలు జరిగే నాలుగు బిజెపి పాలిత రాష్ట్రాలకు సంబంధించి,ఉత్తర ప్రదేశ్‌కు పార్టీ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే,గుజరాత్‌కు,రాజ్యసభ ఎంపీ తరుణ్ ఛుగ్,పంజాబ్ రాష్ట్రానికి సతీశ్ పూనియా ఇన్‌ఛార్జీలుగా నియమితులయ్యారు. ఢిల్లీ బిజెపి మాజీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ,రాజ్యసభ ఎంపి అల్కాగుర్జార్‌లు పంజాబ్‌లో సహ ఇన్‌ఛార్జిలుగా బాధ్యతలు నిర్వహిస్తారు. పూనియాకు పంజాబ్‌తోపాటు జమ్మూ కశ్మీరులో పార్టీ ఇన్‌ఛార్జి బాధ్యతలు కూడా అప్పగించారు.వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సిన సంఘర్షణాత్మకరాష్ట్రం మణిపూర్ రాష్ట్రానికి అసోంకు చెందిన బిజెపి ఎంఎల్‌ఎ రాజీవ్ రాయ్ పార్టీ బాధ్యతలు నిర్వహిస్తారు. ఆ పార్టీ జాతీయ మీడియా విభాగం,సోషల్ మీడియా యూనిట్‌లతో కూడిన కమ్యూనికేషన్స్ విభాగానికి అనిల్ బలుని సమన్వయకర్తగా నియమితులయ్యారు.తద్వారా పార్టీలో ఆయన స్థాయిని పెంచారు. ఇటీవల బిజెపి జాతీయ మీడియా సహ–సమన్వకర్తగా నియమితురాలైన ఉషా అగర్వాల్‌కు ఈ విభాగం కన్వీనర్ స్థాయిని ఇచ్చి గౌరవించారు. ఈ కన్వీనర్ బాధ్యతలను ఇప్పటివరకూ అనిల్ బలుని నిర్వహించారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ చేసిన ఈ నియామకాలన్నీ తక్షణం అమలులోకి వస్తాయని పార్టీ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేసింది. కాగా పార్టీ సీనియర్ నాయకుడు వినయ్ సహస్రబుద్ధే ఢిల్లీ పార్టీ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తారు.ఆయనకు సహ–ఇన్‌ఛార్జిలుగా జమ్యాంగ్ సెరింగ్ నామ్‌గ్యాల్,దర్శన్ జర్దోష్ బాధ్యతలు నిర్వర్తిస్తారు.ఉత్తర ప్రదేశ్‌కు వినోద్ తావ్డేను ఇన్‌ఛార్జిగా ఉంటారు. జగదీష్ పటేల్,మేధాకులకర్ణి,ప్రదీప్ వర్మ,ఆనంద్ ఓర్ఝాలు సహ–ఇన్‌ఛార్జిలుగా వ్యవహరిస్తారు. బిజెపి ఉపాధ్యక్షుడు బైజయంత్ జైపాండాను మహారాష్ట్ర ఇన్‌ఛార్జిగా నియమించగా ఆయనకు సహ ఇన్‌ఛార్జీలుగా అమిత్ మాలవీయ,సదానంత్ షెట్ తనవాడే,కమల్‌జీత్ సెహ్రావత్‌లు సహ ఇన్‌చార్జిలుగా పనిచేస్తారు.పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి స్మృతిఇరానీ హర్యానా–ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల బాధ్యతలు నిర్వహిస్తారు. మరో జాతీయ ప్రధాన కార్యదర్శి హరీశ్ ద్వివేదీ బీహార్–కర్ణాటక రాష్ట్రాలకు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తారు.లోక్‌సభ ఎంపి డి.పురంధరేశ్వరికి ఒడిసా రాష్ట్ర బాధ్యతలు అప్పగించారు. పార్టీ జాతీయ కార్యదర్శి స్వదేశ్ సింగ్ సహ ఇన్‌ఛార్జిగా ఉంటారు. త్రిపుర రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి బిప్లవ్ కుమార్‌దేవ్ మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇన్‌ఛార్జిగా ఉంటారు. కేంద్ర మాజీమంత్రి భారతీ ప్రవీణ్ పవార్‌కు గోవా రాష్ట్ర బాధ్యతలు అప్పగించారు. ఈ కోస్తా రాష్ట్రంలో కూడా వచ్చే ఏడాది ఎన్నికలు జరుగుతాయి.

# మహా నిమజ్జనానికి హైదరాబాద్ సర్వసన్నద్ధం



- 20 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు
- 10 వేల సిసి కెమెరాలు.. 24 డ్రోన్లతో నిఘా
- బాలాపూర్ నుంచి సాగనున్న తుది శోభాయాత్ర
- ప్రజలు సహకరించాలి : సిపి వి.సి.సజ్జనార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వినాయక నిమజ్జన మహోత్సవానికి హైదరాబాద్ నగరం సర్వసన్నద్ధమైంది. శుక్రవారం జరిగే మహా నిమజ్జన శోభాయాత్రకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా హైదరాబాద్ సిటీ పోలీస్ భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. బాలాపూర్ నుంచి హుస్సేన్‌సాగర్ వరకు శోభాయాత్ర సాగే ప్రధాన మార్గాలపై 10 వేల సిసి కెమెరాలు, 24 డ్రోన్లు, దాదాపు 100 హైరైజ్ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు హైదరాబాద్ పోలీసు కమిషనర్ వి.సి.సజ్జనార్ బుధవారం టిజిసిసిసిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం నగరవ్యాప్తంగా 20 వేల మంది పోలీసు సిబ్బందిని రంగంలోకి దించారు.ణేశ్ నిమజ్జన శోభాయాత్రను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని రకాల పకడ్బందీ చర్యలు చేపట్టామని హైదరాబాద్ సిపి వి.సి. సజ్జనార్ తెలిపారు. ఇప్పటికే మూడో రోజు నుంచే నగరంలో గణేశ్ విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా కొనసాగుతోంది. ఇప్పటివరకు వివిధ ప్రాంతాలకు చెందిన 32,878 విగ్రహాల నిమజ్జనం పూర్తికాగా, ఇందులో హైదరాబాద్ నగరానికి చెందిన 6,108 విగ్రహాలు ఉన్నాయి. గత 24 గంటల్లోనే నగర పరిధిలో 2,161 విగ్రహాలు నిమజ్జనం అయ్యాయి. ఖైరతాబాద్ బడా గణేశ్‌ను ఇప్పటివరకు సుమారు 25 లక్షల మంది, బాలాపూర్ గణేశ్‌ను 15 లక్షల మంది భక్తులు దర్శించుకున్న నేపథ్యంలో చివరి రోజు మరింత భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని పోలీసులు అంచనా వేస్తున్నారు. గణేశ్ ఉత్సవాల కోసం హైదరాబాద్ సిటీ పోలీస్ మూడు నెలల ముందుగానే విస్తృత స్థాయిలో ఏర్పాట్లు ప్రారంభించింది. విగ్రహ తయారీదారులు, జిహెచ్ఎంసి, ఆర్అండ్‌బి, విద్యుత్, జలమండలి, రవాణా, అగ్నిమాపక, వైద్యారోగ్య, హైడ్రా, హెచ్ఎండిఎ తదితర శాఖలతో సమన్వయ సమావేశాలు నిర్వహించారు. ఖైరతాబాద్, బాలాపూర్ ఉత్సవ కమిటీలు, పీస్ కమిటీలతోనూ పలు దఫాలుగా చర్చలు జరిపారు. మండపాల అనుమతుల కోసం ఆన్‌లైన్ విధానంలో 15,426 దరఖాస్తులు రాగా, క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం 14,929 మండపాలకు అనుమతులు మంజూరు చేశారు. అనుమతులు పొందిన మండపాలన్నింటినీ జియో ట్యాగ్ చేశారు. విద్యుత్ తీగలు, ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించే పోస్టర్లను మండపాల వద్ద ఏర్పాటు చేశారు.

**కంట్రోల్ రూమ్ నుంచి క్షణక్షణం పర్యవేక్షణ..**

శోభాయాత్రపై నిఘా కోసం ప్రధాన మార్గాల్లోని 10 వేల సిసి కెమెరాలను బంజారాహిల్స్‌లోని టిజిసిసిసి కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించారు. 24 డ్రోన్లతో కీలక ప్రాంతాలను పర్యవేక్షించనున్నారు. విగ్రహాల సంఖ్యను పర్యవేక్షించేందుకు సుమారు 100 హైరైజ్ కెమెరాలను వినియోగిస్తున్నారు.బంజారాహిల్స్‌లోని జాయింట్ కంట్రోల్ రూమ్‌తో పాటు ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా, నెక్లెస్ రోడ్, మొఘల్‌పురా స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో వివిధ శాఖల అధికారులు 24 గంటలూ అందుబాటులో ఉంటారు.

**20 వేల మందితో భారీ బందోబస్తు..**

హైదరాబాద్ కమిషనరేట్‌లోని లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, టాస్క్ ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్, సిటీ సెక్యూరిటీ వింగ్, సిఎఆర్ తదితర విభాగాల నుంచి దాదాపు 20 వేల మంది పోలీసు సిబ్బంది విధుల్లో ఉంటారు. ఇతర జిల్లాల నుంచి 8,142 మంది అధికారులు, సిబ్బందితో కూడిన 42 ప్లాటూన్లను రప్పించి ఏడు జోన్లకు కేటాయించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో 4 ఆర్ఎఎఫ్ కంపెనీలు, 2 సిఆర్‌పిఎఫ్ కంపెనీలను మోహరించారు. 53 బాంబ్ డిటెక్షన్ బృందాలు కూడా విధుల్లో ఉంటాయి.నగర ప్రవేశ మార్గాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మాల్స్ తదితర రద్దీ ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. మొజంజాహి మార్కెట్, బషీర్‌బాగ్ తదితర కీలక ప్రాంతాల్లో ఐజి,డిఐజి స్థాయి అధికారులను ప్రత్యేకంగా నియమించారు.

**డిజెలు, అధిక శబ్దంపై నిషేధం..**

సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా నిమజ్జన శోభాయాత్రల్లో డిజెలు, సౌండ్ మిక్సర్లు, అధిక శబ్ద తీవ్రత కలిగించే పరికరాలు, బాణసంచా వినియోగంపై హైదరాబాద్ సిటీ పోలీస్ నిషేధం విధించింది. నిబంధనలు ఉల్లంఘిస్తే పరికరాలను సీజ్ చేయడంతో పాటు నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

**మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు..**

మహిళలు, యువతుల భద్రత కోసం మూడు షిఫ్టుల్లో 26 షీటీమ్స్ పనిచేయనున్నాయి. సెప్టెంబర్ 14 నుంచి ఇప్పటివరకు ఖైరతాబాద్, బాలాపూర్ వంటి రద్దీ ప్రాంతాల్లో అసభ్యంగా ప్రవర్తించిన 1,172 మందిని పోలీసులు పట్టుకున్నారు. ఇందులో 1,121 మంది మేజర్లు, 51 మంది మైనర్లు ఉన్నారు. నిమజ్జనం రోజున నేర నియంత్రణ కోసం సిసిఎస్ పరిధిలో 139 మంది సిబ్బందిని ఐదు సెక్టార్లుగా విభజించి, 25 ప్రత్యేక మఫ్టీ బృందాలను ఏర్పాటు చేశారు. ఆపదలో ఉన్న మహిళలు డయల్ 112 లేదా షీటీమ్స్ వాట్సాప్ నంబర్ 9490616555కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.



## విద్యార్థులకు రాష్ట్రపతి ముర్ము పిలుపు

# దేశానికి, సమాజానికే .. తొలి ప్రాధాన్యత ఇవ్వాలి

**వడోదర :** తాము పనిచేసే రంగంలో దేశం, సమాజ ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విద్యార్థులకు పిలుపునిచ్చారు. అలా చేయడం వల్ల, దేశం, సమాజంతో పాటు వారు కూడా పురోగమిస్తారని ముర్ము ఉద్బోధించారు. బుధవారం ఇక్కడ బరోడా మహారాజా సయాజీరావు విశ్వవిద్యాలయం 75వ స్నాతకోత్సవంలో విద్యార్థులను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. ఉన్నత విద్యలో మహిళల భాగస్వామ్యం పెరుగుతోందని ద్రౌపది ముర్ము నొక్కిచెప్పారు. ప్రతీ రంగంలోనూ వారి ప్రాబల్యం పెరగడం భారతదేశ సమ్మిళిత అభివృద్ధికి సానుకూల సంకేతం అని ఆమె అన్నారు. విద్యార్థులు తమ విద్యను కేవలం తమ కోసం, తమ కుటుంబాల కోసం మాత్రమే కాకుండా, సమాజ శ్రేయస్సుకు తాము ఎలా దోహదపడగలరో కూడా ఆలోచించాలని రాష్ట్రపతి సూచించారు. విద్యార్థులు తాము పనిచేసే రంగంలో దేశ, సమాజ ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తే, దేశం పాటు వారూ, సమాజం కూడా పురోగమిస్తారని ముర్ము అన్నారు. ఇలాంటి పురోగతి వారికి అపారమైన సంతృప్తిని ఇస్తుందని, వారి విద్య అర్థాన్ని గ్రహించడానికి సహాయపడుతుందని ఆమె చెప్పారు. 'మీరు ఇంజినీర్ అవుతుంటే, ప్రజల జీవితాలను మెరుగుపరిచే పద్ధతులను అభివృద్ధి చేయండి. మీరు డాక్టర్ అవుతుంటే, వైద్య వృత్తిని కేవలం ఒక వృత్తిగా కాకుండా, ఒక సేవగా భావించండి' అని రాష్ట్రపతి ఉద్బోధించారు. సేవలోనే మానవత్వం, శాంతి ఉన్నాయని, అది సంతృప్తిని ఇస్తుందని, జీవించడానికి వనరులు అవసరమే అయినా సంపద సర్వస్వం కాదని, ఇతరులకు సేవచేయడం ద్వారానే నిజమైన సంతృప్తి లభిస్తుంది అని ఆమె అన్నారు. మానవాళి ప్రయోజనాల దృష్ట్యా శాస్త్రవేత్తలు సమస్యలకు పరిష్కారాలు కనుగొనాలని, కళాకారులు,రచయితలు, తమ కళ, సృజనల ద్వారా సమాజ సున్నితత్వాన్ని పెంపొందించాలని రాష్ట్రపతి అన్నారు. పారిశ్రామికవేత్తలు కేవలం సంపదపైనే దృష్టి పెట్టడమే కాకుండా ఉపాధి అవకాశాలను కూడా సృష్టించాలని నొక్కిచెప్పారు. విశ్వవిద్యాలయం బహుళ విషయ స్వభావాన్ని ప్రస్తావిస్తూ, కళలు, విజ్ఞాన శాస్త్రం, సాంకేతికత, వైద్యం, న్యాయశాస్త్రం, సమాజసేవ, లలితకళలు, ప్రదర్శన కళలు వంటి అనేక రంగాలలో ఇది విద్యను అందిస్తోందని ముర్ము పేర్కొన్నారు. ముఖ్యమైన సమస్యలు పరిష్కరించడానికి బహుళ రంగాల విధానం అవసరమని, సమాజానికి శాస్త్రవేత్త, జిజ్ఞాస, కళాకారుడి సున్నితత్వం, చరిత్రకారుడి దార్శనికత, ఆర్థికవేత్త అవగాహన, సామాజిక శాస్త్రవేత్త చైతన్యం అవసరమని రాష్ట్రపతి ముర్ము వివరించారు. స్నాతకోత్సవంలో డిగ్రీలు పొందుతున్న విద్యార్థులలోనూ, అలాగే, ప్రస్తుతం విశ్వవిద్యాలయంలో చదువుతున్నవారిలోనూ మహిళల సంఖ్య అధికంగా ఉందన్నారు. విద్యారంగంలో మహిళలు పురోగమిస్తున్నప్పటికీ, సాంప్రదాయ కార్మిక రంగంలో వారి భాగస్వామ్యం ఆ స్థాయిలో లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంట్లో ఉంటూ భవిష్యత్తును తీర్చిదిద్దే మహిళలు కూడా దేశానికి దోహదపడుతున్నారని, వారు గౌరవానికి అర్హులని తెలియజేశారు. నేడు దేశ జనాభాలో 65శాతం యువత జనాభా ఉందన్నారు. విద్యార్థులు తమ వంతు సహకారంతో గుజరాత్‌కు కీర్తిని తెచ్చి, భారతదేశపు భవిష్యత్తును ఉజ్వలం చేస్తారన్న విశ్వాసాన్ని రాష్ట్రపతి ముర్ము వ్యక్తంచేశారు.

# లా కాలేజీలు, విశ్వవిద్యాలయాలను 'బిసిఐ' ఎలా నియంత్రించగలదు?

## ప్రశ్నించిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ :** న్యాయకళాశాలలు, విశ్వవిద్యాలయాలను నియంత్రించే అధికారం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బిసిఐ)కి ఉందా? లేదా? అనే విషయాన్ని పరిశీలిస్తామని సుప్రీకోర్టు బుధవారం తెలిపింది. లైసెన్స్ మంజూరు చేసిన తర్వాతే నియంత్రణ సంస్థగా దాని చట్టబద్ధమైన పాత్ర అమలులోకి వస్తుందని అత్యున్నత న్యాయస్థానం నొక్కి చెప్పింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం, విద్యా సంబంధిత విషయాలను చూసుకోవడానికి న్యాయపండితులు, విద్యావేత్తలు మరింత అనువైనవారు కాబట్టి, న్యాయ విద్యను నియంత్రించడానికి బిసిఐని ఒక నిపుణుల సంస్థగా ఎలా పరిగణించగలరని ధర్మాసనం ప్రశ్నించింది.'బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా లా కాలేజీలను ఎలా నియంత్రించగలదు?. అనేదే అసలైన ప్రశ్న. లైసెన్స్ పొందిన తర్వాతే వారి చట్టబద్ధమైన పాత్ర అమలులోకి వస్తుంది కాబట్టి న్యాయకళాశాలలను నియంత్రించవచ్చా? లేదా? అన్నదే ఇక్కడ ప్రశ్న. విశ్వవిద్యాలయం/న్యాయ కళాశాలను నియంత్రించే, క్రమబద్ధీకరించే అధికారం బిసిఐకి ఉందో? లేదో? మేం పరిశీలించాలనుకుంటున్నాం. న్యాయ విద్యను నియంత్రించడానికి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఒక నిపుణుల సంస్థ ఎలా అవుతుంది?. న్యాయ విద్య గురించి వారికేం తెలుసు?. ప్రముఖ న్యాయపండితులు, విద్యావేత్తలు ఉన్నారు. మీరు సాధారణ మార్గదర్శకాలను నిర్దేశించవచ్చు. పాఠ్యప్రణాళిక నాలుగైదేళ్లు ఉండాలి. కానీ మీరు నియంత్రించలేరు' అని సిజెఐ మౌఖికంగా వ్యాఖ్యానించారు. 'బిసిఐ–పెర్ల్ ఫస్ట్' ట్రస్ట్ పనితీరును, ఆ ట్రస్ట్ ద్వారా న్యాయకళాశాలల ఏర్పాటును ప్రశ్నిస్తూ దాఖలైన పిటిషన్లపై అత్యున్నత న్యాయస్థానం విచారణ జరుపుతోంది. పిటిషన్లపై ధర్మాసనం నోటీస్ జారీ చేసి, రెండు వారాలలోగా బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్పందన కోరింది. విచారణ సందర్భంగా, పిటిషనర్ గిరీష్ మిట్టల్ తరపున హాజరైన న్యాయవాది ప్రశాంత్ భూషణ్ , బిసిఐ 2016లో ఒక తీర్మానాన్ని ఆమోదించి, పాత ట్రస్ట్‌ను రద్దుచేసి, ఆ నిధులను కొత్త ట్రస్ట్‌కు బదిలీ చేసిందని సమర్పించారు. 2020లో విద్య, న్యాయ వృత్తిపరమైన సంస్కరణల ప్రోత్సాహం, పరిశోధనల అభివృద్ధి కోసం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్ట్‌ను ఏర్పాటు చేసిన విషయాన్ని ప్రశాంత్‌భూషణ్ ప్రముఖంగా ప్రస్తావించారు. బిసిఐ సభ్యులుగా వారి పదవీకాలంతో సంబంధం లేకుండా, దస్తావేజు 11మంది మేనేజింగ్ ట్రస్టీలను, అసలు, శాశ్వత ట్రస్టీలుగా చేసిందని ప్రశాంత్ భూషణ్ ఆరోపించారు. ఆ తర్వాత ట్రస్ట్ గోవా, ఆంధ్రప్రదేశ్‌లలో ఒక్కో లా కళాశాలను ఏర్పాటు చేసిందని న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదించారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తరపున్న హాజరైన న్యాయవాది, జీవితకాల ట్రస్టీలు ఉండరని, ట్రస్టీల పదవీకాలంలో బిసిఐలో వారి సభ్యత్వంతోపాటు ముగుస్తుందని బార్ బాడీ ఒక తీర్మానాన్ని ఆమోదించిందని సమర్పించారు. కొత్తగా ఏర్పడే న్యాయవాదుల సంఘం తన కార్యవర్గాన్ని ఎన్నుకునే వరకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్‌పర్సన్ మనన్ కుమార్ మిశ్రా పదవి కేవలం 'తాత్కాలికం' మాత్రమేనని, అలాగే ఆ సంఘం ఏ విధానపరమైన నిర్ణయమైనా, భారత అటార్నీజనరల్, సొలిసిటర్ జనరల్‌తో సంప్రదించి తీసుకోవాలని, సుప్రీంకోర్టు గతంలో వ్యాఖ్యానించింది. అంతకుముందు, బిసిఐ చైర్‌పర్సన్‌గా మనన్ కుమార్ మిశ్రా సుదీర్ఘ పదవీకాలం చట్టబద్ధతను సవాల్ చేస్తూ, ఆయనను ఆ పదవి నుంచి తొలగించాలని కోరుతూ ఒక పిటిషన్ దాఖలైంది. మిశ్రా 2012వరకు బిసిఐ చైర్మన్‌గా తొలిసారి ఎన్నికయ్యారు. 2014లో మిశ్రా కొద్దికాలంపాటు పదవి నుంచి వైదొలగినా, అదే ఏడాది నవంబరులో తిరిగి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి, అప్పటి నుంచి ఆ పదవిలోనే కొనసాగుతున్నారని న్యాయవాది యోగమాయ ఎంజి దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. బిసిఐ యొక్క నియమం 12(2) ప్రకారం చైర్మన్, వైస్ చైర్మన్ పదవీకాలం రెండు సంవత్సరాలు లేదా సభ్యత్వం రద్దు అయ్యే వరకు ఈ రెండింటిలో ఏది ముందు అయితే అదిఅని పిటిషన్‌లో వాదించారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి లేదా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ఒక స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో కోరారు. మిశ్రా పదవీకాలాన్ని 2030 వరకు పొడిగించే ఏప్రిల్ 20, 2025 గెజిట్ నోటిఫికేషన్‌ను ఇది సవాల్ చేసింది.

# ఆర్‌టిఓ సేవల్లో పారదర్శకతే లక్ష్యం

## ఉప్పల్ ఆర్‌టిఓలో జెటిసి చంద్రశేఖర్‌గౌడ్ ఆకస్మిక తనిఖీ
## దరఖాస్తుదారులతో నేరుగా మాట్లాడి సమస్యలపై ఆరా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆర్‌టిఓ కార్యాలయాలకు వచ్చే వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా, వేగంగా సేవలు అందించాలని విజిలెన్స్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎం. చంద్రశేఖర్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. ఉప్పల్ ప్రాంతీయ రవాణా కార్యాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని కార్యకలాపాలను పరిశీలించడంతో పాటు, డ్రైవింగ్ లైసెన్స్ పరీక్షల నిర్వహణ, వాహన్ పోర్టల్‌లో పెండింగ్ దరఖాస్తులు, ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు.

**డ్రైవింగ్ టెస్ట్‌లపై ప్రత్యేక దృష్టి..**

డ్రైవింగ్ లైసెన్స్ పరీక్షలు జరుగుతున్న తీరును జెటిసి స్వయంగా పరిశీలించారు. రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకుని పరీక్షలను నిబంధనల ప్రకారం కచ్చితంగా నిర్వహించాలని సూచించారు. డ్రైవింగ్‌లో తగిన నైపుణ్యం, రహదారి భద్రతపై అవగాహన ఉన్నవారికే లైసెన్సులు జారీ చేయాలని స్పష్టం చేశారు.

**దరఖాస్తుదారుల సమస్యలు తెలుసుకుని..**

కార్యాలయానికి వచ్చిన దరఖాస్తుదారులతో చంద్రశేఖర్‌గౌడ్ నేరుగా మాట్లాడారు. సేవలు పొందడంలో ఎదురవుతున్న ఇబ్బందులు, వేచి ఉండే సమయం, సిబ్బంది వ్యవహారశైలి, ఆన్‌లైన్ సేవల వినియోగంలో సమస్యలపై వారి నుంచి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

**వాహన్ పోర్టల్ పెండింగ్‌లపై కొరడా..**

వాహన్ పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను జెటిసి పరిశీలించారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ దరఖాస్తులను ప్రాధాన్యత క్రమంలో త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అనవసరంగా జాప్యం చేస్తే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్‌టిఓ కార్యాలయ ప్రాంగణంలో ఏజెంట్లు, మధ్యవర్తులు, అనధికార వ్యక్తుల సంచారాన్ని పూర్తిగా అరికట్టాలని జెటిసి స్పష్టం చేశారు. ఏజెంట్లకు అవకాశం కల్పించే అధికారులు, సిబ్బందే బాధ్యత వహించాల్సి ఉంటుందని, వారిపై శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యాలయ ప్రధాన ద్వారం, కౌంటర్ల వద్ద మధ్యవర్తుల ప్రవేశ నిషేధానికి సంబంధించిన నోటీసులను స్పష్టంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

**ఆన్‌లైన్‌లో సేవలు.. ఆకస్మిక తనిఖీలు..**

రవాణా శాఖకు సంబంధించిన సేవలను ప్రజలు ఎలాంటి మధ్యవర్తుల సహాయం లేకుండా నేరుగా కౌంటర్ల వద్ద లేదా వాహన్, సారథి ఆన్‌లైన్ పోర్టల్స్ ద్వారా పొందవచ్చని జెటిసి తెలిపారు. ప్రజలకు సేవలు అందించడంలో జవాబుదారీతనం పెంచాలని అధికారులకు సూచించారు. ఆర్‌టిఓలు, జిల్లా రవాణా అధికారులు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు తమ పరిధిలోని కార్యాలయాలను నిరంతరం పర్యవేక్షించాలని చంద్రశేఖర్‌గౌడ్ ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ కార్యాలయాల్లో సేవల నాణ్యతను మెరుగుపరిచేందుకు, పారదర్శకతను పెంచేందుకు ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.



## ప్రజలకు చెత్తపై అవగాహన

**ప్రజాపక్షం/చర్లపల్లి:** స్వచ్ఛతాహి సేవ అనే నినాదంతో ప్రజలకు చెత్తను నాలుగు విధాలుగా వేరు చేయడం, కిచెన్ వేస్ట్ నుండి హోమ్ కంపోస్ట్‌ను తయారు చేయారు చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు బుధవారం కుషాయిగూడ వివిన్ రెడ్డి నగర్ కాలనీ అసోసియేషన్ ప్రాంగణం అవగాహన కల్పించారు. చెత్తను వేరుచేయడం వల్ల కలిగే ఉపయోగాలను ప్రజారోగ్యం, పారిశుద్ధ్యంపై వాటి ప్రభావం కిచెన్ వేస్ట్ నుండి హోమ్ కంపోస్ట్ తయారు చేసుకునే విధానాన్ని తెలియచేసి ప్రజలందరూ సహకరించాలని కాప్రా డిసి రవీంద్రసాగర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్ సుదర్శన్, కాలనీ ప్రతినిధులు వెంకట్రామిరెడ్డి, ఎస్ఎఫ్‌ఏ లక్ష్మి ,తదితరులు పాల్గొన్నారు.



## వైద్య సేవలు నాణ్యతా ప్రమాణాలతో కూడినవే : డిఎంహెచ్ఓ డా.ఆనంద్


**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** రోగులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందించే వైద్య సేవలు, మందులు పూర్తి నాణ్యతా ప్రమాణాలతో కూడినవని, ఈ విషయంలో ఎలాంటి అపోహలకు గురి కావల్సిన అవసరం ఎంత మాత్రం లేదని డిఎంహెచ్ఓ డా.ఆనంద్ పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య సదుపాయాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తూ వైద్య అధికారులు, సిబ్బంది బాధ్యత తో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజలు అవసరమైన సందర్భాల్లో తమకు అందుబాటులో ఉండే బస్తీ దవఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పభుత్వ ఆస్పత్రుల్లో లభించే ఉచిత వైద్య సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు. బుధవారం ఆయన మేడిపల్లి యూపిహెచ్‌సిని సందర్శించి మందుల నిలువలు, రోగులకు అందుతున్న వైద్య సేవలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలను పరిశీలించారు. గడువు ముగిసే మందులను గుర్తించి సరైన సమయంలో వినియోగించేలా చూడాలన్నారు. ఎన్సీడీ సేవలను మరింత సమర్థవంతంగా పర్యవేక్షించి రక్తపోటు, మధుమేహం, తదితర దీర్ఘకాల వ్యాధుల స్క్రీనింగ్, నమోదు, చికిత్స, ఫాలోఅప్ వివరాలను సక్రమంగా నిర్వహించాలన్నారు. మేడిపల్లి యూపిహెచ్‌సికి అనుకూలమైన నూతన ప్రదేశాన్ని ఎంపిక చేయాలని స్థానికులు, రోగులు, ప్రజాప్రతినిధులు డిఎంహెచ్‌ఓను కోరారు.



## ఫార్మర్ రిజిష్ట్రేషన్ తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలి : జ్యోతి

**ప్రజాపక్షం/నవాబుపేట్:** రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని నవాబుపేట్ మండల వ్యవసాయాధికారి జ్యోతి సూచించారు. బుధవారం మండలంలోని మాధిరెడ్డి పల్లి, యావపూర్, అక్నాపూర్, మాదారం గ్రామాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించిన ఆమె రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రాధాన్యతను వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ వ్యవసాయ పథకాలు, ఎరువుల బుకింగ్, ఎరువుల కొనుగోలు,అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఇతర వ్యవసాయ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని తెలిపారు. ఇప్పటివరకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ పెండింగ్‌లో ఉన్న రైతులు అక్టోబర్ 01 లోపల వరకు తమ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. రైతులు తమకు సమీపంలోని మీసేవా కేంద్రాలను సంప్రదించడం ద్వారా లేదా సంబంధిత వ్యవసాయ అధికారులు,ఏఈవోలను సంప్రదించి పెండింగ్‌లో ఉన్న ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేసుకోవాలని మండలంలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడువులోగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని ఆమె సూచించారు.

## జూదం స్థావరంపై దాడి...ముగ్గురు అరెస్ట్



**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** డబ్బులు పందెంగా పెట్టి మూడు ముక్కలాట ఆడుతున్న జూదం స్థావరంపై జవహర్‌నగర్ పోలీసులు మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకోగా, మరో ముగ్గురు పరారయ్యారు. నిందితుల నుంచి నగదు, వాహనాలు, ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జవహర్ నగర్ ఎస్ హెచ్ ఒ సైదులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 22 న రాత్రి సుమారు 7:15 గంటల కు జవహర్‌నగర్ గోశాల సమీపంలో కొంతమంది వ్యక్తు లు పేకాట (మూడు ముక్కలా) ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారం జవహర్‌నగర్ పోలీస్ స్టేష న్ ఎస్ఐ కె. రమేష్‌కు అందింది. వెంట నే ఆయన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, ఇద్దరు పంచు లు, పోలీసు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులను చూసి అక్కడ పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులు రవి, నాగరాజు, రాజు పారిపోగా, మిగిలిన ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. **అరెస్టయిన నిందితులు:** పిట్టల బాలయ్య 48, వృత్తి: డ్రైవర్, నివాసం: బీజేఆర్ నగర్, జవహర్‌నగర్ ఎర్రగుంట రాజు 32, వృత్తి: మేస్త్రీ, నివాసం: నోబుల్ స్కూల్ సమీపంలో, జవహర్‌నగర్ దేవరుప్పుల మహేష్ 45, వృత్తి: మేస్త్రీ, నివాసం: బీజేఆర్ నగర్, జవహర్‌నగర్) స్వాధీనం చేసుకున్న మొత్తం విలువ రూ.20,000/) రూ. 6,950/ నగదు 02 సెట్ల ప్లేయింగ్ కార్డులు 02 మొబైల్ ఫోన్లు 03 ద్విచక్ర వాహనాలు ప్లాటినా ఏపీ 29ఎవి 8732,ఎక్సఎల్ 100 టీ ఎస్ 08EZ9258, డిస్కవర్ 150ఎఫ్ టీ ఎస్ 07ఈ ఈ 9122 పంచుల సమక్షంలో నిందితుల వద్ద నుంచి సదరు వాటిని స్వాధీనం చేసుకొని, ఎస్ఐ కె.రమేష్ ఫిర్యాదు మేరకు జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో సుమోటోగా కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తును దర్యాప్తు అధికారి సి.జితేందర్ సింగ్ పర్యవేక్షిస్తున్నారు.

# కేంద్ర నిధులు సకాలంలో వినియోగించుకోవాలి

### ఎంపి కొండ విశ్వేశ్వర్‌రెడ్డి



**ప్రజాపక్షం/వికారాబాద్:** కేంద్ర నిధులను సకాలంలో వినియోగించుకొని జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని చేవేళ్ల ఎంపి కొండవిశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్యేలు యాదయ్య, మనోహర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ దీపకితివారితో కలసి దిశా కమిటీ సమావేశం ఎంపి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ అభివృద్ధిలో భాగంగా చేపట్టే పనులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. రోడ్ల నిర్మాణం, పాఠశాలల్లో మౌలిక వసతులు, అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మత్స్యకారులకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. గ్రామ సడక్ యోజన రోడ్ల నిర్మాణం పనులు నాణ్యతతో చేపట్టాలని తెలిపారు. జాతీయ రహదారుల్లో ప్రమాదాలు నివారించేందుకు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పిఎం అవాజ్ యోజన, పిఎం జన్మాన్ పథకం కింద అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్లను మంజూరు చేయాలని హౌసింగ్ అధికారిని ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అందజేయాలని తెలిపారు. జిల్లాలో రైల్వే ఓవర్ బ్రిడ్జిలకు సంబంధించి భూసేకరణ నివేదికలు సమర్పించి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని రైల్వే అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం చేపట్టే వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. జిల్లాలో మైనింగ్ ద్వారా ఆదాయం సమకుర్చాక పోగ అక్రమ మైనింగ్ జరుగుతుందని దీనిని అరికట్టాలని ఆదేశించారు. బ్యాకులు రుణాలు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా, అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, వెంకటచారి, ట్రైనింగ్ కలెక్టర్ సచిన్ బస్వరజ్, సిఇఒ సుధీర్, డిఆర్‌డిఒ శ్రీనివాస్, డిఎఫ్‌ఒ విశాల్ బత్తుల, తదితరులు పాల్గొన్నారు.

## ఆహార భద్రతా ప్రమాణాల చట్టం పటిష్టంగా అమలు చేయాలి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ప్రజల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా జిల్లాలో ఆహార భద్రతా ప్రమాణాల చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు సంబంధిత అధికారులు తరచు ఆకస్మిక తనిఖీలు చేయటంతో పాటు ఆహార పదార్థాల విషయంలో వచ్చే ఫిర్యాదులను జాప్యం లేకుండా పరిష్కరిం చి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా స్థాయి ఆహార భద్రతా కమిటి ఆదేశాలు జారీ చేసింది. జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ నేతృత్వంలో ఆహార భద్రతా సలహా కమిటి త్రైమాసిక సమావేశం నిర్వహించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దీని ప్రకారం ఇకపై జిల్లా పరిధిలోని సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల్లో ప్రతి నెలా కనీసంరెండింటిని తనిఖీ చేయాల్సి ఉంటుంది. అంగన్‌వాడి కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్య కళాశాలల క్యాంటిన్‌లను పరిశీలించి ఆహార నాణ్యతను చూడాల్సి ఉంటుంది. హోటళ్లు, రెసారెంట్లు, లాంటి ఆహార విక్రయ కేంద్రాల్లో పరిశుభ్రత లోపా లు, పారిశుద్య నిబంధనల ఉల్లంఘనలపై దృష్టి సారిస్తూ ఉల్లంఘనదారులపై నోటీసులు జారీ చేయటం, ఆ తర్వాత తిరిగి పరిశీలించి కఠిన చర్యలకు పూనుకోవాల్సి ఉంటుంది. ఈ సమావేశంలో డిఎంహెచ్‌ఓ, డిఈఓ, పంచాయతి అధికారి, జిల్లా ఆహార భద్రతా నియమిత అధికారి పాల్గొన్నారు.

## మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకుడు



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు యువజన కాంగ్రెస్ కార్యకలాపాలను విస్తృతం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుండే అంశాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో ఘట్‌కేసర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కేశపావుల వినోద్ కుమార్ చర్చించారు.హైదరాబాద్‌లోని ఎమ్మెల్యేక్వార్టర్స్‌లో బుధవారం మహేష్ కుమార్ గౌడ్‌ను వినోద్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి.పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఘట్‌కేసర్ మండలంలో పార్టీ పరిస్థితి,యువజన కాంగ్రెస్ చేపడుతున్న కార్యక్రమాలు, స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆత్మీయంగా చర్చించారు.యువతను పార్టీ కార్యక్రమాల్లో మరింత భాగస్వాములను చేస్తూ కాంగ్రెస్‌ను గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు.ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి యేయాలని సూచించారు.కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకుడు సాయి నిరుడు,సాయి కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు నాణ్యమైన సేవలు అందాలి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ప్రభుత్వ బాలసదన్‌లో పిల్లలకు నాణ్యమైన సంరక్షణ, విద్య, అవసరమైన న్యాయ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ జివిఎల్ ప్రియాంక సూచించారు. బుధవారం కాచివాని సింగారంలోని ప్రభు త్వ బాలసదన్ హోంను సందర్శించి అక్కడి పిల్లలకు అందుతున్న సేవలు, సౌకర్యాలు ఎలా ఉన్నాయన్న విషయాన్ని పరిశీలించారు. పిల్లలతో నేరుగా మాట్లాడి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకొన్నా రు. బాలసదన్ రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు కె.నాగజ్యోతి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ఇంతియాజ్ రహీం, నారపల్లి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు డా. సౌమ్య, బాలసదన్ సూపరింటెండెంట్ భవాని, తదితరులు పాల్గొన్నా రు.

## సహారా ఏజెంట్ల చెల్లింపులపై స్పీకర్ కు వినతి పత్రం



**ప్రజాపక్షం /వికారాబాద్ :** సహార సంస్థల్లో పెట్టుబడులు పెట్టిన ఖాతాదారులకు పెండింగ్ లో ఉన్న చెల్లింపులను పూర్తిస్థాయిలో అందేలా సిఎం దృష్టికి తీసుకెళ్లి చెల్లింపులు జరిగేలా కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకు రావాలని కోరుతు బుధవారం స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు సహారా కార్యకర్తలు, ఏజెంట్లు వినతిపత్రం సమర్పించారు. సహారా సంస్థలో పెట్టుబడులుపెట్టిన అనేక మంది ఖాతాదారులు తమ డబ్బుల కోసం దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్నారని అన్నారు. వికారాబాద్ బ్రాంచ్ , వికారాబాద్ ఎప్‌సి, హైదరాబాద్ పరిధిలోని సహారా సంస్థలోని ఎన్‌పీఓఎస్ డబ్బులను సహారా ఇండియా పరివార్‌లో పెట్టుబడిగా పెట్టిన ఖాతాదారులు ప్రస్తుతం చెల్లింపుల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. మూడేళ్లగాకు పైగా తమ డబ్బులకోసం ఎదురుచూస్తున్న ఖాతాదారుల సమస్య మరింత తీవ్రంగా ఉందన్నారు. ఖాతాదారుల సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికితీసుకెళ్లి పెండింగ్ చెల్లింపులు త్వరితగతిన అందేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని వినతి పత్రం ద్వారా స్పీకర్ ను కోరారు.

## నాటిన మొక్కలను బాధ్యతతో సంరక్షించాలి

### అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** పచ్చదనం పెంపొందించే దిశగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జిల్లా అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. బుధవారం మూడుచింతలపల్లి మున్సిపల్ కొల్తూర్‌లోని ప్రాధమిక, జిల్లా పరిషత్ పాఠశాలలో వనమహోత్సవంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ జాం రవితో కలిసి మొక్కలు నాటి నీళ్లు పోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కల సంరక్షణతో పర్యావరణ పరిరక్షణకు తోడ్పటమే కాకుండా భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, మండల విద్యాధికారి బాగ్యమణి, మున్సిపల్ వైస్ చైర్మన్ శశిరేఖ, కౌన్సిలర్ గిరిపల్లి రమేష్, నాయకుడు దత్తు గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'దోస్త్' లో స్పాట్ అడ్మిషన్లు

### కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** టీజి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో జగద్గిరిగుట్ట (శామీర్‌పేట)లో దోస్త్ ద్వారా స్పాట్ అడ్మిషన్లకు అధికారిక నోటిఫికేషన్ వెలువడిందని కళాశాల ప్రినిపల్ డాక్టర్ ఇష్రత్ తెలిపారు. బుధవారం కళాశాల ప్రిన్సిపల్ ఇష్రత్ మాట్లాడుతూ ఈ నెల సెప్టెంబర్ 24, 25 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు చెప్పారు. కోర్సుల వారీగా అందుబాటులో ఉన్న పరిమిత ఖాళీల వివరాలను కళాశాల వెబ్‌సైట్ నోటిస్ బోర్డులో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ లేదా తత్సమాన అర్హత కలిగిన విద్యార్థినులు తమ ఒరిజినల్ ధృవీకరణ పత్రాలతో కళాశాల కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. విద్యార్థినులు ఆధార్‌కార్డుతో పాటు తల్లిదండ్రులు లేదా సంరక్షకులతో కళాశాలకు రావాలని తెలిపారు. ఇప్పటివరకు దోస్త్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోని వారు అలాగే ఎక్కడ సీటు పొందని విద్యార్థులు స్పాట్ అడ్మిషన్లకు అర్హులని ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్ పేర్కొన్నారు.



## ఘనంగా ఆయుర్వేద దినోత్సవం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మున్సిపల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 11వ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని మూడు రోజుల పాటు వివిధ ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం ఆయుష్ విభాగానికి చెందిన హోమియోపతి వైద్యురాలు డాక్టర్ శ్రీలేఖ, యోగా ఇన్‌స్ట్రక్టర్ ఆధ్వర్యంలో యోగా సాధన నిర్వహించారు.అనంతరం వారు మాట్లాడుతూ యోగా, నడక ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఒత్తిడిని తగ్గించుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించామని చెప్పారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమాల ద్వారా ప్రజలు, విద్యార్థులకు యోగా, వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలి ని గడపడానికి ఆయుర్వేదం, ఆయుష్ విధానాలపై అవగాహన పెంపొందించారు. ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నా రు.

## 27న సీనియర్ ఖో ఖో జట్ల ఎంపికలు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సీనియర్ ఖో ఖో పురుషులు, మహిళల జట్ల ఎంపికలు ఈ నెల 27న సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించన్నుట్లు జిల్లా ఖో ఖో సంఘం ప్రధాన కార్యదర్శి తోట జయప్రకాష్ తెలిపారు. ఉదయం 9 గంటల ఎంపికలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ప్రతిభ ఆధారంగా క్రీడాకారులను ఎంపిక చేసి వచ్చే నెల నల్గొండా జిల్లాలో జరిగే 59వ రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌కార్డును వెంట తీసుకరావాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా ఖోఖో సంఘం అధ్యక్షురాలు మంజుల (9848288170), ప్రధాన కార్యదర్శి తోట జయప్రకాష్ (9356663477) నెంబర్లను సంప్రదించాలని కోరారు.



## సమస్యలపై ఐక్యంగా పోరాడుదాం

### ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు ఉమామహేష్ పిలుపు

**ప్రజాపక్షం/దుండిగల్:** గండి మైసమ్మ చౌరస్తా నుండి వివిధ ప్రాంతాలకు ప్రయాణికులను తీసుకెళ్లే ఆటో డ్రైవర్లు నేడు ఎఐటియుసి సంఘంలో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఉమామహేశ్వర పాల్గొని వారికి సభ్యత్వాలు ఇచ్చి ఎఐటియుసిలోకి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎఐటియుసి కార్మికుల కోసం కార్మిక హక్కులు కాపాడడానికి 100 సంవత్సరాల క్రితమే ఆవిర్భవించి నేటికీ దేశంలో అతిపెద్ద గుర్తింపు సంఘం పనిచేస్తుందని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో, అన్ని ప్రాంతాలలో విస్తరించబడిన ఏకైక సంఘం ఎఐటియుసి అని కావున అందులో చేరి సభ్యత్వం తీసుకోవడం చాలా గర్వకారణం అని అన్నారు. ఈ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వాటిని సాధించుకునేంతవరకు ఆటో డ్రైవర్లు ఐక్యంగా ఉద్యమించాలని దానికి సిపిఐ, ఏఐటియుసి సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎఐటియుసి ఆటో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమర్ ఖాన్ జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి,జిల్లా నాయకులు నర్సింహులు,సిపిఐ నాయకులు రాములు బాబు అతిథులుగా పాల్గొని ఆటో డ్రైవర్లకు ఏ కష్టం వచ్చినా స్పందిస్తామని వారి సమస్యల పరిష్కారం కోసం నిత్య అందుబాటులో ఉంటామని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఆటో డ్రైవర్లు ఖలీల్, అఖిల్ అహ్మద్, బాబర్ రాములు, నరసింహ, తదితరులతో పాటు పెద్ద ఎత్తున ఎఐటియుసిలో చేరారు.



## మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రతిభ

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మేడ్చల్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల మేడ్చల్ బాలుర ఉత్తమ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ కృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ శామీర్‌పేట డివిజన్ హకింపేటలో స్పోర్ట్స్ స్కూల్లో నిర్వహించిన మేడ్చల్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ అసోసియేషన్ అండర్ 18 విభాగం పోటీల్లో జగ్గంగూడలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు 5 కిలోమీటర్ల రేస్ వాక్ విభాగంలో బి జశ్వంత్ ప్రథమ స్థానంలో స్వర్ణ పతకం, భాలకృష్ణ ద్వితీయ స్థానం సాధించి రజిత పథకం కైవసం చేసుకున్నారని తెలిపారు. అలాగే లాంగ్ జంప్‌లో ఎండి అహ్మద్ హుస్సేన్ ద్వితీయ స్థానంలో రాణించి రజిత పతకం సాధించగా, 5 కి, మీ రేస్ వాక్‌లో స్వర్ణ పతకం సాధించిన జశ్వంత్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని చెప్పారు. ఈ సంధర్బంగా పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణ, పీడి సురేందర్, పిఇటీ వెంకటేష్ విద్యార్థులను అభినందించారు. క్రీడలతో పాటు విద్యలో రాణిస్తు పాఠశాలకు, తల్లిందండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకరావాలని ఆకాంక్షించారు.




## తల్లిదండ్రులే విశ్వరూపమని లోకానికి చాటిన వినాయకుడు : మహేష్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం / కూకట్‌పల్లి :** తల్లిదండ్రులే విశ్వరూపమని లోకానికి చాటిన వినాయకుడు పూజనీయుడని, విఘ్నాలను తొలగించే ఆది దేవుడు గణపయ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ ఆకాంక్షించారు. బుధవారం మూసాపేట్‌లో నవయువక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాగణపతి మండపాన్ని బీ బ్లాక్ అధ్యక్షులు తూము వేణు ఆహ్వానం మేరకు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ సందర్శించారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్, డా.సత్యం శ్రీరంగంలతో కలిసి లంబోదరుడికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగేందుకు ఎలాంటి అవరోధాలు లేకుండా అన్ని విఘ్నాలు తొలగించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షులు పి.నాగిరెడ్డి, ఏఎంసి చైర్మన్ కొండకింది పుష్పారెడ్డి, కాంటెస్టెడ్ కార్పొరేటర్లు యాదగిరి, గోపిశెట్టి రాఘవేందర్, ఎ,బి బ్లాక్ మహిళా అధ్యక్షురాళ్లు, తదితరులు పాల్గొన్నారు.



## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం బుధవారం నవాబుపేట మండలంలోని ఎల్లకొండ గ్రామంలో నిర్వహించారు. ఎల్లకొండ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ కావలి కొండల్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అర్హులైన రేషన్ కార్డుదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కావలి కొండల్ యాదవ్, ఉప సర్పంచ్ పెంటని చంద్రయ్య, వార్డు సభ్యులు కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. నూతన స్మార్ట్ రేషన్ కార్డులు అందుకోవడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు సూచించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వెంకటయ్య, జీపీఓ అంజయ్య, రెవెన్యూ సిబ్బంది, రేషన్ డీలర్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ

**ప్రజాపక్షం/బొంరాస్‌పేట్:** విద్యార్థులకు రెండవ జత ఏకరూప దుస్తులు పంపిణీ చేసిన ప్రధానోపాధ్యాయులు గోపాల్, ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలో విద్యానభ్యసించే ఎస్సీ ఎస్టీ విద్యార్థుల సంక్షమం కొరకు రెండవ జత ఏకరూప దుస్తుల అందించడం వల్ల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందనిఅన్నారు.విద్యార్థులందరూ ఏకరూపదుస్తులను దరించి క్రమశిక్షణ పాఠశాలలకు హజరై ,విద్యాలో రాణించాలరని ఆకాంక్షించారు.

రామ్ పోతినేని ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న రామ్ 23 చిత్రం తాజాగా రెండ్ షెడ్యూల్స్ పూర్తి చేసుకుంది. రామ్ పోతినేని తొలిసారి దర్శకత్వ బాధ్యతలు చేపడుతున్న ఈ సినిమాతో తన ప్రత్యేకమైన విజన్ను తెరపై ఆవిష్కరించనున్నారు.

రీల్



## టీచర్ ప్రేమ కథ 'సర్కారు బాయి'

శ్రీరామ్ నిమ్మల, వర్షిక హీరో హీరోయిన్స్ గా నటిస్తున్న సినిమా 'సర్కారు బాయి'. ఈ చిత్రాన్ని డెక్కన్ ఫిలిమ్స్ సమర్పణలో ప్రొడ్యూసర్ తుమ్మల ప్రఫుల్ రాం రెడ్డి నిర్మిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ ప్రాంతంలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా దర్శకుడు లారా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. అప్పటి తెలంగాణ సమాజాన్ని ప్రతిబింబిస్తూ నీటి సమస్యలు, కుల వివక్ష, అణగారిన వర్గాల జీవిత పోరాటం వంటి అంశాలను దర్శకుడు లారా కళ్లకు కట్టినట్లు తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. హీరోయిన్ వర్షిక పుట్టినరోజు సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు చెబుతూ మూవీ టీమ్ బర్త్ డే పోస్టర్ రిలీజ్ చేశారు. 'సర్కారు బాయి' సినిమాలో వర్షిక కల్పన టీచర్ పాత్రలో నటిస్తోంది. ఈ బర్త్ డే పోస్టర్ లో చీరకట్టులో ట్రెడిషనల్ లుక్ లో వర్షిక కనిపించి ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం 'సర్కారు బాయి' సినిమా షూటింగ్ తుది దశకు చేరుకుంది. ఇటీవలే చేగుంట సమీపంలోని రెడ్డిపల్లి, పరిసర ప్రాంతాల్లో భారీ షెడ్యూల్ కంప్లీట్ చేశారు. మరోవైపు ఎడిటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ కూడా జరుగుతున్నాయి. హీరో శ్రీరామ్ నిమ్మల, హీరోయిన్ వర్షిక, బాహుబలి ప్రభాకర్, నాగ మహేష్ లాంటి ప్రధాన నటీనటులు పాల్గొన్న ఈ లెంగ్తీ షెడ్యూల్ లో చాలా వరకు సినిమా చిత్రీకరించారు. త్వరలోనే 'సర్కారు బాయి' సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రొడ్యూసర్ తుమ్మల ప్రఫుల్ రాం రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీరామ్ నిమ్మల, వర్షిక, బాహుబలి ప్రభాకర్, వివ రెడ్డి, నాగ మహేష్, చలాకీ చంటి, నుపూర్ ముఖర్జీ, జ్యోతి, దేవరాజ్ పాలమూరు, మాధవి, కవిత, తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి డీవోపీ అమర్.జి, మ్యూజిక్ శివా.కె, ఎడిటర్ బి.యన్.రెడ్డి, కాస్ట్యూమ్ డిజైనర్: కె. మాధురి.

## డిజె టిల్లు లాగే 'అనుమాన పక్షి'



డిజె టిల్లు'తో దర్శకుడిగా తనదైన ముద్ర వేసిన విమల్ కృష్ణ.. మరో ఎంటర్టైనర్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అనుమాన పక్షి'. రాగ్ మయూర్ హీరోగా నటిస్తున్న ఈ సినిమా.. హ్యూమర్, క్రైం థ్రిల్లర్, కథనంతో పూర్తిగా డిఫరెంట్ గా ఉండబోతోంది. చిలక ప్రొడక్షన్స్ సమర్పణలో రాజీవ్ చిలక, రాజేష్ జగ్గియాని, హిరానంద్ దండ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. సెప్టెంబర్ 25న 'అనుమాన పక్షి' థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు.ప్రెస్ మీట్ లో హీరో రాగ్ మయూర్ మాట్లాడుతూ నటుడిగా ప్రతిక్షణం మెరుగవడానికి ప్రయత్నిస్తాను. యాక్టింగ్ నా ఊపిరి. ఇప్పుడు 'అనుమాన పక్షి'తో హీరోగా వస్తున్నాను. ఇది నాకు చాలా ఆనందంగా ఉంది. డీజే టిల్లు పెద్ద హిట్ తర్వాత విమల్ కృష్ణ నాతో సినిమా చేయాలనుకున్నారు. డైరెక్టర్ విమల్ కృష్ణ ఈ కథ చెప్పినప్పుడు నాకు చాలా సర్‌ప్రైజింగా అనిపించింది. ఎందుకంటే ఇలాంటి కథ ఎక్కడా లేదు. సెప్టెంబర్ 25న ఒక అద్భుతమైన సినిమా మీ ముందుకు రాబోతోంది అన్నారు.

**డైరెక్టర్ విమల్ కృష్ణ**

డైరెక్టర్ విమల్ కృష్ణ మాట్లాడుతూ 'డిజె టిల్లు' మీకు ఎలా సర్‌ప్రైజ్ చేసిందో, ఈ సినిమా కూడా మిమ్మల్ని 100% సర్‌ప్రైజ్ చేస్తుంది. ఈ జర్నీలో నాకు చాలా సపోర్ట్ చేసిన స్టేజ్ మీద ఉన్న అందరికీ థ్యాంక్యూ. చోటా గారు ఎడిటింగ్స్ వచ్చిన తర్వాత 'అనుమాన పక్షి' జర్నీ చాలా ఈజీ అయింది. శ్రీ చరణ్ మరోసారి చాలా అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు అని చెప్పారు. హీరోయిన్ మెరీన్ మ్యూజిక్ డైరెక్టర్ శ్రీ చరణ్ పాకాల, ప్రొడ్యూసర్ రాజీవ్ చిలక, ప్రొడ్యూసర్ మేఘా , ఎడిటర్ చోటా ప్రసాద్ పాల్గొన్నారు.

## 'ఇంప్యూర్'లో ఏం జరిగింది?



వారాహి మల్లిపాముల, శ్రీదేవి మల్లిపాముల నిర్మించిన లేటెస్ట్ మూవీ ఇంప్యూర్. నిశాంతి ఇవని దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సాయి కృష్ణ, యష్న, అభిజిత్ ప్రధాన పాత్రల్లో నటించారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా తాజాగా ప్రీ రిలీజ్ ఈవెంట్ జరుపుకుంటుంది. ఈ ఈవెంట్లో ట్రైలర్‌తో పాటు పాటను కూడా లాంఛ్ చేశారు. ఈ ఈవెంట్‌గా స్పెషల్ గెస్ట్ డైరెక్టర్ నందిని రెడ్డి వచ్చారు. ఈ ఈవెంట్‌లో నందిని రెడ్డి మాట్లాడుతూ ఈ ఈవెంట్‌కు రావడానికి రెండే మెయిన్ రీజన్స్ ఉన్నాయి. ఒకటి మా బాస్ కృష్ణ వంశీ ఫోన్ చేసి చెప్పారు. ఆయన చెబితే కాదనడానికి లేదు. సెకండ్ డైరెక్టర్ నిశాంతి గురించి. నిశాంతి నాకు 15 ఏళ్లుగా తెలుసు. నాకు మంచి ఫ్రెండ్. రీసెంట్‌గా మా ఇంటి బంగారంలో కలిసి చేశాము. కానీ ఎడిటింగ్‌లో కట్ అయింది. సారి నిశాంతి మనం త్వరలోనే కలిసి పని చేద్దాం. శ్రీదేవి మీ అమ్మాయి డ్రీమ్ నెరవేర్చినందుకు నిజంగా మిమ్మల్ని అప్రిషియేట్ చేయాలి. పేరెంట్స్ ఎంకరేజ్ చేస్తేనే మనం ఏదైనా సాధించగలం. ఈ సినిమా మంచి హిట్టవ్వాలని, అందరికీ మంచి పేరు తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు.30 ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వీ రాజ్ మాట్లాడుతూ డైరెక్టర్ నిశాంతి చేసిన కృషి, టాలెంట్‌ను వాళ్ల మదర్ ఎంకరేజ్ చేయడం నిజంగా గొప్ప విషయం. ఇంప్యూర్ సినిమా బ్రహ్మాండంగా ఆడాలి. బాగా డబ్బులు తీసుకు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నాడు. డైరెక్టర్ నిశాంతి మాట్లాడుతూ ఒక మనిషి ప్యూర్‌గా ఉండాలా? ఇంప్యూర్‌గా ఉండాలా? అనేది సొసైటీ డిసైడ్ చేస్తుంది. ఒక పెళ్లి క్యాన్సల్ అవడం వల్ల ముగ్గురి పరిస్థితి ఎలా మారింది అనేది ఈ సినిమా కథ. సంధ్య, ప్రణవ్, చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుంది. ఈ ఈవెంట్‌కు స్పెషల్ గెస్ట్ వచ్చిన నందిని రెడ్డిగా చాలా థ్యాంక్యూ అని చెప్పారు. హీరో సాయికృష్ణ, హీరోయిన్ యష్న, ప్రొడ్యూసర్ రామ్కీ పాల్గొన్నారు.

## 'పెద్దగట్టు జాతర' షూటింగ్ షురూ




ఆర్కే రెడ్డి ఫిలిమ్స్ ప్రొడక్షన్ నెం.1గా తెరకెక్కనున్న కొత్త చిత్రం 'పెద్దగట్టు జాతర' షూటింగ్ ప్రారంభమైంది. ఈ చిత్రంతో విరాన్ష్ హీరోగా అపరిచయమవుతున్నారు. ఎ. రామ కృష్ణ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. విజయ్ కుమార్. సి.హెచ్ దర్శకత్వం వహిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి హిట్ మెషీన్ అనిల్ రావిపూడి క్లాప్ కొట్టి సినిమా టైటిల్‌ను రివీల్ చేశారు. శివలెంక కృష్ణ ప్రసాద్ స్క్రిప్ట్‌ను చిత్ర బృందానికి అందించారు. దేవి శ్రీ గురూజీ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. పలువురు సినీ ప్రముఖులు, యూనిట్ సభ్యులు ఈ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ చిత్రంలో దేవి ప్రసాద్, మీనా కుమారి, సత్యకృష్ణ, సురేఖా వాణి, అజయ్ ఘోష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి నాగార్జున డిఒపి, గిరీష్ దేవాంగ్ ఆర్ట్ డైరెక్టర్ గా పని చేస్తున్నారు. విరాన్ష్, దేవి ప్రసాద్, మీనా కుమారి, సత్యకృష్ణ, సురేఖా వాణి, ప్రభాకర్ (బాహుబలి), ధన్రాజ్, తాగుబోతు రమేష్, అజయ్ ఘోష్, నాగమహేష్, బలగం రమేష్, లౌక్య తదితరులు నటిస్తున్నారు.

## రామ్ సినిమా రెండో షెడ్యూల్ పూర్తి

రామ్ పోతినేని ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న రామ్ 23 చిత్రం తాజాగా రెండ్ షెడ్యూల్ను పూర్తి చేసుకుంది. రామ్ పోతినేని తొలిసారి దర్శకత్వ బాధ్యతలు చేపడుతున్న ఈ సినిమాతో తన ప్రత్యేకమైన విజన్‌ను తెరపై ఆవిష్కరించనున్నారు. రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై కృష్ణ పోతినేని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రామ్ పోతినేనికి జోడీగా సంయుక్త కథానాయికగా నటిస్తున్నారు. తాజా షెడ్యూల్లో భాగంగా భారీ స్థాయిలో హైఇంటెన్సిటీ నైట్ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించారు. ఏకంగా ఒక కిలోమీటర్ మేర విస్తరించిన భారీ స్ట్రెచ్‌లో ఈ యాక్షన్ సీక్వెన్స్‌ను తెరకెక్కించారు. ఆ మొత్తం ప్రాంతాన్ని లైట్స్‌తో నింపి, సినిమా ప్రత్యేకమైన నియోనోయిర్ వరల్డ్‌కు సరిగ్గా సరిపోయేలా అద్భుతమైన విజువల్ క్యాన్వాస్ను క్రియేట్ చేశారు. ఈ భారీ సెటప్‌నకు సంబంధించిన ఫ్లైట్ వ్యూ చూస్తేనే సీక్వెన్స్ను ఎంత గ్రాండ్‌గా మౌంట్ చేశారో అర్థమవుతోంది.యాక్షన్ కొరియోగ్రాఫర్ కెవిన్ మాస్టర్ ఈ ఇంటెన్స్ యాక్షన్ సీక్వెన్స్‌ను డిజైన్ చేయగా, నేషనల్ అవార్డ్ విన్నింగ్ సినిమాటోగ్రాఫర్ తిరునావుక్కరసు (తిరు) ఈ విజువల్స్‌ను చిత్రీకరించారు. రామ్ పోతినేని ఊహించిన ప్రత్యేకమైన విజన్కు అనుగుణంగా సినిమాకు డిఫరెంట్ విజువల్ టెక్స్చర్‌ను అందిస్తున్నారు. సామ్ సీఎస్ సంగీతం అందిస్తుండగా, ఏఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు.ఈ చిత్రానికి , నిర్మాత: కృష్ణ పోతినేని, డిఒపి: తిరునావుక్కరసు, ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్.



## ఈగల్ ఫోర్స్‌కు సిఎం అభినందనలు



ప్రజాపక్షం/హైదరాబాద్: మాదక ద్రవ్యాల నియంత్రణలో దేశంలోనే అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన తెలంగాణ ఈగల్ ఫోర్స్‌కు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. మాదకద్రవ్యాల విక్రయం, వినియోగాన్ని సమూలంగా నిర్మూలించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చర్యలకు ఈగల్ ఫోర్స్ సాధించిన జాతీయ స్థాయి గుర్తింపు నిదర్శనమని సిఎం పేర్కొన్నారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్ (ఎఎన్‌టిఎఫ్) 3వ జాతీయ సదస్సులో ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య అత్యుత్తమ అవార్డును అందుకోవడం రాష్ట్ర పోలీసు శాఖకు, తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణలో తెలంగాణ అనుసరిస్తున్న సమర్థవంతమైన విధానాలకు ఈ జాతీయ గుర్తింపు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని తెలిపారు. ఈ మేరకు బుధవారం 'ఎక్స్' వేదికగా సిఎం రేవంత్ రెడ్డి ఒక ట్విట్ చేశారు. మాదకద్రవ్యాల మహమ్మారిని అరికట్టడం కేవలం పోలీసు వ్యవస్థ బాధ్యత మాత్రమే కాదని, యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడటం ప్రతి కుటుంబం, ప్రతి పాఠశాల, ప్రతి సంస్థ, ప్రతి పౌరుడి సమిష్టి బాధ్యత అని సిఎం పేర్కొన్నారు. మాదకద్రవ్యాలపై పోరాటాన్ని మరింత విస్తృతం చేస్తూ, యువతను చైతన్యపరచడం, డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపడం, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం ద్వారా సురక్షితమైన, ఆరోగ్యకరమైన, డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సిఎం స్పష్టం చేశారు. 'నషా ముక్త భారత్' లక్ష్యాన్ని సాధించేందుకు తెలంగాణ నుంచి బలమైన అడుగు పడాలి. 2029 డిసెంబర్ నాటికి డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మించే దిశగా ఈగల్ ఫోర్స్ మరింత దృఢ సంకల్పంతో పనిచేయాలి' అని సిఎం తెలిపారు. యువతే రాష్ట్రానికి, దేశానికి భవిష్యత్తు అని, మాదకద్రవ్యాల ప్రభావం నుంచి యువతను రక్షించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ సంఘాలు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని సిఎం పిలుపునిచ్చారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి, డ్రగ్స్ విక్రయం, వినియోగంపై సమాచారాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

## రాష్ట్రంలో రెడ్ అలర్ట్

### కలెక్టర్లు మరింత అప్రమత్తం
### మంత్రి పొంగులేటి

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో రెడ్ అలర్ట్ జారీ చేసిన జిల్లాల కలెక్టర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదేశించారు. అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రెడ్ అలర్ట్ జారీ చేసిన జిల్లాల కలెక్టర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాలు, వాగులు, చెరువులు, వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అవసరమైన చోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి జిల్లాలో 24 గంటలూ అందుబాటులో ఉండే కంట్రోల్ రూమ్, టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి ప్రజలకు తక్షణ సహాయం అందించాలని కలెక్టర్లను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించే విధంగా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, వాగులు, చెరువులు, వరద ప్రవాహ ప్రాంతాల వైపు వెళ్లవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఉద్యోగ, కార్మిక పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

### జలమండలి కార్మికులకు అండగా ప్రభుత్వం: మధు యాష్కీ గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక పక్షపాతిగా పనిచేస్తోందని అల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ అన్నారు. కార్మికుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. గోషామహల్‌లో తెలంగాణ జల మండలి ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయాన్ని బుధవారం యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చక్రధర్‌రెడ్డితో కలిసి మధు యాష్కీ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కోటి మంది కార్మికులకు కనీస వేతనాల అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. జలమండలి కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టిందని, ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారానికి కూడా కృషి చేస్తోందన్నారు. త్వరలో జరగనున్న ఆర్‌టిసి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న తెలంగాణ ఆర్‌టిసి వర్కర్స్ యూనియన్‌ను గెలిపించాలని మధు యాష్కీ గౌడ్ కోరారు. మొగుళ్ల రాజిరెడ్డి మాట్లాడుతూ జలమండలిలో ఇంకా పరిష్కరించాల్సిన రెండు, మూడు సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించిందని, వాటిని త్వరలో పరిష్కరిస్తుందని తెలిపారు. యూనియన్‌కు గుర్తింపు ధ్రువీకరణ పత్రం అందజేయడంతో పాటు కార్యాలయాన్ని కేటాయించిన జలమండలి యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఆర్‌టిసి మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఇ. అశ్వత్థామరెడ్డి, యూనియన్ ప్రధాన కార్యదర్శి టి.టి.రాఘవేంద్రరాజ్, అసోసియేట్ ప్రెసిడెంట్‌లు అల్లి శ్రవణ్‌కుమార్, ఎం.డి.జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## సత్యతేజకు మహేష్‌కుమార్‌గౌడ్ సన్మానం

### అంతర్జాతీయ కరాటేలో కాంస్య పతకం సాధించిన క్రీడాకారిణి



ప్రజాపక్షం/హైదరాబాద్: జోర్డాన్ అమ్మాన్‌లో జరిగిన ఏకేఎఫ్ 24వ జూనియర్, యూ21 కరాటే ఛాంపియన్‌షిప్–2026లో కాంస్య పతకం సాధించిన తెలంగాణ క్రీడాకారిణి బ్రహ్మదండి సత్యతేజను టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఈ కార్యక్రమం జరిగింది. 66 కేజీల వ్యక్తిగత కుమిటే విభాగంలో సత్యతేజ కాంస్య పతకం సాధించారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ నుంచి పతకం సాధించిన తొలి మహిళా క్రీడాకారిణిగా ఆమె గుర్తింపు పొందారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యమిస్తూ క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రోత్సహిస్తోందని మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. సత్యతేజ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇండియా కోచ్ కీర్తన్ కొండూరు, స్టేట్ జనరల్ సెక్రటరీ రామస్వామి తదితరులు సత్యతేజను అభినందించారు.

## ఆయకట్టుకు నీటి విడుదల

(మొదటి పేజీ తరువాయి)

గాను సాగునీటిని వృధా చేయకుండా పండించుకోవాలని ఆయన కోరారు. ప్రతిపక్షాలు లేనిపోని రాద్ధాంతలు చేసి రైతులను మభ్యపెట్టి తప్పుదోవ పట్టించేందుకు అనేక ప్రయత్నాలు చేశారని ఆ పార్టీల మాటలను నమ్మకండని కోరారు. ఈ కార్యక్రమంలో నందిమల్ల సర్పంచ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు టి.రవికాంత్, నాయకులు జింక రవి, చుక్క ఆసి రెడ్డి, వెంకట్ రెడ్డి, గణేష్ గౌడ్, శ్రీధర్, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి ముంగిటకే

(మొదటి పేజీ తరువాయి)

సర్వీసెస్'ను ప్రారంభించింది. సాంకేతికతను పాలనతో అనుసంధానించి తెలంగాణను డిజిటల్ గవర్నెన్స్‌లో దేశానికి రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. బాగ్‌లింగంపల్లిలోని ఆర్‌టిసి కళ్యాణ మండపంలో బుధవారం 'మీ సేవా డోర్ డెలివరీ సర్వీసెస్'ను మంత్రి శ్రీధర్ బాబు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పాలనలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొస్తున్నామని చెప్పారు. పరిపాలనకు సాంకేతికతను జోడించడం ద్వారా పారదర్శకత, జవాబుదారీతనం, సుపరిపాలనకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు.

**1100కు ఫోన్ చేస్తే.. ఇంటికే సేవలు**

ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేయడంలో భాగంగానే డోర్ డెలివరీ సేవలను ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. పౌరులు 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయడం లేదా మీ సేవా పోర్టల్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవడం ద్వారా ఈ సేవలను పొందవచ్చన్నారు. స్లాట్ బుక్ చేసుకున్న అనంతరం మీ సేవా సిబ్బంది ఇంటి వద్దకు వచ్చి అవసరమైన ప్రక్రియను పూర్తి చేసి సేవలను అందిస్తారని తెలిపారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ (ఇసి) కాపీలు, పోలీసు శాఖకు సంబంధించిన సేవలు, ఐజిఆర్ఎస్ రిజిస్ట్రేషన్లు తదితర సేవలు ఈ విధానం ద్వారా అందుబాటులోకి వస్తాయని వివరించారు.

**తొలి దశలో 'క్యూర్' ప్రాంతాల్లో..**

డోర్ డెలివరీ సేవల కోసం ఇప్పటికే 70 మందికి పైగా మీ సేవ ఏజెంట్లు, విఎల్ఇలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు శ్రీధర్‌బాబు తెలిపారు. తొలి దశలో 'క్యూర్' ప్రాంతాల్లో ఈ సేవలను అమలు చేస్తున్నామని, అనుభవాలను పరిగణనలోకి తీసుకుని రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరిస్తామని చెప్పారు. ప్రభుత్వ సేవలను పొందేందుకు ప్రజలు కార్యాలయాల వద్దకు వెళ్లే పరిస్థితిని తగ్గిస్తూ, ప్రభుత్వమే ప్రజల వద్దకు వెళ్లే విధంగా సాంకేతికతను వినియోగిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. పౌరులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని ఇంటి నుంచే ప్రభుత్వ సేవలు పొందాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఐటిఇ అండ్‌సి సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, మీ సేవా కమిషనర్ రవికిరణ్, టిజిటిఎస్ ఎండి సత్య నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దసరాలోపు 2 డిఎలు

(మొదటి పేజీ తరువాయి)

సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో జరిగిన చర్చలు విఫలం కావడంతో ఉద్యోగ సంఘాలు గురువారం రాష్ట్ర అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే ఉద్యోగ సంఘాల నాయకులను రాత్రి మరోసారి చర్చలకు ఆహ్వానించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనలు మేరకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క హైదరాబాద్‌లోని ఎంసిహెచ్‌ఆర్‌డిలో చర్చలు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల డిమాండ్లపై స్పష్టమైన హామీ ఇచ్చినట్టు ఉద్యోగ సంఘ నాయకులు వెల్లడించారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ దక్కడంతో అత్యవసర సమావేశాన్ని రద్దు చేసుకున్నట్లు తెలంగాణ ఉద్యోగ సంఘాల జెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరు శ్రీనివాసరావు ప్రకటించారు. పిఆర్‌సి నివేదికను సాధ్యమైనంత త్వరగా తెప్పించుకొని పరిష్కరిస్తామని డిప్యూటీ సిఎం తెలిపినట్లు పైసా అధ్యక్షులు గౌతం కుమార్ వెల్లడించారు.

**ప్రభుత్వంతో జరిగిన చర్చల్లో తీసుకున్న ముఖ్య నిర్ణయాలు:**

రెండు కరవు భత్యాలు (డిఎలు): దసరా పండుగ సందర్భంగా రెండు డిఎలను ఒకేసారి విడుదల చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అక్టోబర్ 1వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో దీనికి ఆమోదం తెలుపుతామని స్పష్టం చేసింది.

వేతన సవరణ నివేదిక (పిఆర్‌సి): ఈ నెలాఖరులోగా పిఆర్‌సి నివేదికను తెప్పించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అనంతరం పిఆర్‌సిపై నిర్ణయం తీసుకునే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లనుంది.

**బకాయి బిల్లులు:** పెండింగ్ బిల్లుల చెల్లింపుల ప్రక్రియను మార్చి నాటికి పూర్తిగా పూర్తి చేస్తామని ప్రభుత్వం తెలిపింది.

పాత పింఛను పునరుద్ధరణ (ఒపిఎస్): నూతన పింఛను విధానాన్ని (సిపిఎస్) రద్దు చేసి, పాత పింఛను విధానం అమలుపై అధ్యయనం చేయడానికి మూడు నెలల కాలపరిమితితో కమిటీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. అలాగే 01–09–2004 ఉద్యోగుల సమస్యకు కూడా పరిష్కారం లభించనుంది.

**ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలం: టిజిజెఎసి**

రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని టిజిజెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలును టిజిజెఎసి నిరంతరం పర్యవేక్షిస్తుందన్నారు. ప్రభుత్వ నిర్ణయాల నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లో జరగాల్సిన టిజిజెఎసి రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశాన్ని వాయిదా వేస్తున్నామని, అందువల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎవరూ హైదరాబాద్‌కు రావొద్దని వారు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిర్ణీత గడువులో పరిష్కరించాలని ట్రై చేస్తా అధ్యక్షుడు గౌతమ్ కుమార్ కోరారు. ఉదయం సిఎస్‌తో జరిపిన చర్చల అనంతరం తెలంగాణ ఉద్యోగ సంఘాల జెఎసి చైర్మన్ లచ్చిరెడ్డి , సెక్రెటజరీ జనరల్ రాజశేఖర్ సచివాలయ మీడియా పాయింట్‌లో వారు మాట్లాడుతూ ప్రభుత్వం రెండు డిఎలను ఇచ్చేందుకు అంగీకరించిందన్నారు. మూడో డిఎను మరో నాలుగు నెలల వరకు ఇస్తామని ప్రభుత్వం హామీనిచ్చిందని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం సకల జనుల సమ్మె చేపట్టిన ఉద్యోగులు తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఒకట తేదీన వేతనం చెల్లించాలని, పెండింగ్ డిఎలను సాధించే పరిస్థితుల్లో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల పోరాటంతో ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారానికి హామీనిచ్చిందని, ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజుకు కృతజ్ఞతలు తెలిపారు.



Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com